ఆదివారం
23-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 181
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో
విద్యార్థులకు న్యాయం
కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర- హైదరాబాద్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో లక్షలా మంది విద్యార్థులు, కుటుంబ సభ్యులు మానసింగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. శాసన సభలో శనివారం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉత్తర్వులు పాటించకుండా దశల వారిగా చెల్లించే విధంగా చేసినప్పటికీ విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయని పరిస్థితి కళాశాలల్లో నెలకొంటుందని ఆయన సభదృష్టికి తెచ్చారు. ఫీజు రీయింబర్‌మెంట్‌కు పరిష్కారం చూపకపోతే సమస్య జటిలమై విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. ప్రస్తుత విద్యాసంత్సరానికి రూ.ఏడువేల కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసిందన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.35వేలు చొప్పున చెల్లించాల్సి ఉంగా గత మూడు సంత్సరాలుగా చెల్లించడం లేదన్నారు. కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు.

'కిన్నెరసాని' పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

కిన్నెరసానిలో ఎప్పుడూ 25 టీఎంసీల నీరు ఉంటుందని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కూనంనేని కోరారు. కిన్నెర సాని వద్ద గతంలో బోటింగ్ ఉండేదని, కిన్నెరసాని పేరుతో కవిత్వం కూడా రాశారని గుర్తు చేశారు.

చుట్టూ అడవి ప్రాంతం ఉంటుందని, అక్కడ జూ పార్క్ ఎర్పాటు చేసేందుకు అధికారులు అంగీకరించారని తెలిపారు. కిన్నెరసాని నుంచి భద్రాచలానికి ఒక సఫారి ఏర్పాటు చేయాలని, పర్యాటకంగా,ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చెందుతుందని సభదృష్టికి తీసుకువచ్చారు.

ఎర్డోగన్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం
ఇస్తాంబుల్ మేయర్ అరెస్టుపై టర్కీలో నిరసనలు
2లో

25 ఏళ్లు డీలిమిటేషన్ వద్దు
అఖిలపక్ష భేటీలో దక్షిణాదినేతల డిమాండ్

- న్యాయబద్ధంగా జరిగే వరకు పోరాటం: స్టాలిన్
- మెడపై వేలాడుతున్న కత్తి: కేరళ సీఎం విజయన్
- రాజకీయ అసమానత్వం : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

చెన్నై: పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ను మరో 25 ఏళ్లు స్తంభింపజేయాలని దక్షిణాది రాష్ట్రాల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే ఉత్తరాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య గణనీయంగా పెరిగి, దక్షిణాది రాష్ట్రాల్లో తగ్గే ప్రమాదం ఉందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన కాకుండా, ఎవరికీ నష్టం జరగని రీతిలో శాస్త్రీయ విధానం కనుగొనేవరకు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. డీలిమిటేషన్ పై తొలి సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) సమావేశం శనివారం చెన్నైలో తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఐదు రాష్ట్రాల నుంచి 14 మంది నాయకులు పాల్గొన్నారు. అధిక ఆర్థిక వృద్ధి, అక్షరాస్యత ఉన్న రాష్ట్రాలకు లోక్‌సభ స్థానాల పునర్విభజన కసరత్తు వల్ల ఎదురయ్యే ముప్పుపై వారు చర్చించారు. కేరళ, తెలంగాణ,

- మిగతా 2 లో

తీర్మానాలివే...

- ప్రజాస్వామ్యం స్వభావాన్ని మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఏదైనా డీలిమిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించబడాలి. అన్ని రాష్ట్రాల రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర వాటాదారులతో సంప్రదింపులు జరగాలి.
- 42, 84,87వ రాజ్యాంగ సవరణల ఉద్దేశం జనాభా నియంత్రణ చర్యల్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలను రక్షించడం/ప్రోత్సహించడం. జనాభా స్థిరీకరణ లక్ష్యం ఇంకా సాధించబడినందున, 1971 జనాభా లెక్కల ఆధారంగా మరో 25 ఏళ్ల నియోజకవర్గాల సంఖ్యను స్తంభింపచేయాలి.
- జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన ఫలితంగా... జనాభా వాటా తగ్గిన రాష్ట్రాలను శిక్షించకూడదు. ఈ ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన రాజ్యాంగ సవరణలను అమలు చేయాలి.
- పైన పేర్కొన్న సూత్రాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం ఏదైనా డీలిమిటేషన్ కసరత్తును చేపట్టడానికి చేసే ప్రయత్నాలను ఎదుర్కోవడానికి, జేఏసీలో భాగస్వామ్యంగా ఉన్న రాష్ట్రాల పార్లమెంటు సభ్యులతో కూడిన కోర్ కమిటీ పార్లమెంటరీ వ్యూహాలను సమన్వయం చేస్తుంది.
- ఎంపీల కోర్ కమిటీ పార్లమెంటరీ సమావేశంలో గౌరవనీయులైన భారత ప్రధానికి పైన పేర్కొన్న విధంగా ఉమ్మడి ప్రాతినిధ్యాన్ని సమర్పిస్తుంది.
- సమావేశంలో ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఈ అంశంపై తమ తమ రాష్ట్రాల్లో తగిన శాసనసభ తీర్మానాలను తీసుకురావడానికి ప్రయత్నాలను ప్రారంభిస్తాయి. వీటిని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తాయి.
- సమన్వయంతో కూడిన ప్రజాభిప్రాయం సేకరణ వ్యూహం ద్వారా గత డీలిమిటేషన్ కసరత్తుల హిస్టరీ, సందర్భం, ప్రతిపాదిత డీలిమిటేషన్ పరిణామాలపై సమాచారాన్ని ఆయా రాష్ట్రాల పౌరులకు తెలియజేసేందుకు జేఏసీ అవసరమైన ప్రయత్నాలు చేస్తుంది.

పునర్విభజనతో సమాఖ్యవాదానికి తూట్లు
జేఏసీ సమావేశంలో వినయ్ విశ్వం
10లో

ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లపై కొరడా

న్యూదిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా ఝుళిపించింది. జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు అక్రమ ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల 357 వెబ్‌సైట్‌లను బ్లాక్ చేశారని.. దాదాపు 2,400 బ్యాంక్ ఖాతాలను అటాచ్ చేసినట్లుగా ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. రూ.126 కోట్లను స్తంభింపచేసినట్లు పేర్కొంది. మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని... వాటిని ఎవరూ వినియోగించొద్దని డీజీజీఐ సూచించింది. కొన్ని సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాన్ని

- మిగతా 2 లో

తేజస్‌కు త్వరలో అమెరికా ఇంజిన్ల రాక

న్యూదిల్లీ: తేజస్ యుద్ధ విమానాల తయారీలో ముఖ్యమైన ఎఫ్-404 ఇంజిన్లు అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్ (జీఈ) నుంచి రానున్నాయి. రెండేళ్ల ఆలస్యం తర్వాత అవి ఈనెల భారత్‌కు చేరనున్నాయి. ఈ ఏడాది మొత్తం 12 ఇంజిన్లు అందనున్నాయి. తేజస్ మార్క్ 1-ఎ యుద్ధ విమానాల్లో ఎఫ్-404 ఇంజిన్లు అత్యంత కీలకం. అయితే డెలివరీ జాప్యంతో హాల్ (హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్)లో తేజస్

- మిగతా 2 లో

జార్ఖండ్‌లో ఐఈడీ పేలుడు

వెస్ట్ సింగ్‌భూమ్: జార్ఖండ్‌లో అటవీ ప్రాంతంలో ఐఈడీ పేలి ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన వెస్ట్ సింగ్‌భూమ్‌లోని చైబాసా పట్టణ పరిధిలోని చోటానాగ్రా పోలీసు స్టేషన్ కిందకు వచ్చే మరాంగ్‌పొంగా అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ మేరకు అధికారులు శనివారం తెలిపారు. గాయపడిన జవాన్లను ఎయిర్‌లిఫ్ట్ చేశామన్నారు.

ఇదీ లోకం!

మణిపూర్‌కు త్వరలో మంచి రోజులు
చురాచంద్‌పూర్ పర్యటనలో జస్టిస్ గవాయ్

ఇంఫాల్: హింసతో అట్టుడికిన మణిపూర్‌కు త్వరలోనే మంచి రోజులు వస్తాయని సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కష్ట కాలం త్వరగా గడిచిపోతుందని, రాష్ట్రం మళ్లీ సుభిక్షమవుతుందన్నారు. సుప్రీం న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్ నాథ్, ఎంఎం సందేశ్, కేవీ విశ్వనాథన్, ఎన్.కోటీశ్వర్‌తో కలిసి ఆయన శనివారం మణిపూర్‌లో పర్యటించారు. వీరి వెంట మణిపూర్ హైకోర్టు న్యాయమూర్తి డి.కృష్ణకుమార్, జస్టిస్ గోల్మె గైపుల్‌షిలు కూడా ఉన్నారు. న్యాయమూర్తుల బృందం చురాచంద్‌పూర్ జిల్లాలోని శరణార్థి శిబిరాన్ని సందర్శించి అక్కడి నిర్వాసితులను కలిసింది. వారి పరిస్థితులను ఆరా తీసింది. ఆపై వైద్య శిబిరం,

న్యాయ సహాయ క్లినిక్, న్యాయ సేవల క్యాంపును లామ్కాలో మినీ సెక్రటరియట్ నుంచి వర్చువల్‌గా న్యాయమూర్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్, లెజిస్లేచర్, జ్యుడిషియరీ మద్దతుతో మణిపూర్ రాష్ట్రం కూడా మిగతా దేశం వలే త్వరలోనే విరసిల్లుతుందని అన్నారు. ఈ రాష్ట్రం కష్టాలన్నీ తీరిపోతాయని, సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆకాంక్షించారు. 'భిన్నత్వంలో ఏకత్వానికి మన దేశం ప్రతీక. మీరంతా కష్టాల్లో ఉన్నారని తెలుసు. అందరి సహాయ సహకారాలతో మీ కష్టాలన్నీ త్వరలోనే తీరిపోతాయి. మన రాజ్యాంగం గొప్పది. చుట్టుపక్కల దేశాలతో పోల్చితే మనం బలంగా, ఐక్యంగా ఉండటానికి ఇది దోహదమైంది. రాజ్యాంగంపై నమ్మకం ఉంచండి. ఏదో ఒక రోజు మణిపూర్‌లో సంపూర్ణ శాంతి నెలకొంటుంది. మిగతా దేశంలానే ఈ రాష్ట్రం కూడా వర్ధిల్లుతుంది' అని అన్నారు. రాష్ట్రంలో సాధారణ

- మిగతా 2 లో

మోదీ ఎప్పుడు వెళతారు?
జైరాం రమేశ్

న్యూదిల్లీ: హింసతో అట్టుడుకిన మణిపూర్ రాష్ట్రానికి సుప్రీంకోర్టు జడ్జిల బృందం వెళ్లడాన్ని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ స్వాగతించారు. అదే సమయంలో ప్రధాని మోదీ ఎప్పుడు వెళతారని ప్రశ్నించారు. 'మణిపూర్‌లో గత 22 నెలలుగా మణిపూర్‌లో హింస జరుగుతూ వందల మంది ప్రాణాలు కోల్పో యారు. 60వేల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. శిబిరాల్లో

- మిగతా 2 లో



హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు 'జ్ఞానపీఠ్'

న్యూదిల్లీ: ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా (88) ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపికయ్యారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఈ పురస్కారాన్ని అందుకోబోయే తొలి రచయితగా ఆయన నిలిచారు. ఈ అవార్డు రూపేణ రూ.11లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహం, ప్రశంసా పత్రం అందజేస్తారు. శుక్లాకు 59వ జ్ఞానపీఠ్ అవార్డును అందజేయాలని ప్రముఖ స్టోరీ టెల్లర్ ప్రతిభా రాయ్ చైర్మన్‌గా జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ నిర్ణయించింది. హిందీ సాహిత్యం, అద్భుత రచన శైలికిగాను ఆయనను ఈ పురస్కారం వరించింది. అవార్డుకు ఎంపికైన ఇతరుల్లో మాధవ్ కౌశిక్, దామోదర్ మౌజో, ప్రభా వర్మ, అనామికా, ఎ.కృష్ణరావు, ప్రఫుల్ షేడ్దార్, జానకీ ప్రసాద్ వర్మ, జ్ఞానపీఠ్ డైరెక్టర్ మధుసూదన్ ఆనంద్ ఉన్నారు. కాగా, వినోద్ కుమార్ శుక్లాకు 1999లో 'దీవార్ మే ఏక్ ఖిర్కీ రహతీ థీ' పుస్తకానికిగాను సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. నౌకర్ కి కమీజ్ (1979), సబ్ కుచ్ హోనా బచా రహేగా (1992) అనే కవితా సంకలనం కూడా ఆయనకు పేరు తెచ్చిపెట్టాయి.

2018లోనే వర్మపై సీబీఐ ఎఫ్ఐఆర్..!



న్యూదిల్లీ: అగ్ని ప్రమాదం జరిగిన దిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో పెద్ద ఎత్తున కరెన్సీ నోట్ల కట్టలు బయటపడటం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే జడ్జి ఇంట్లో దొరికిన సొమ్ముల విలువ కోట్ల రూపాయిలు ఉంటుందని... మరోవైపు జడ్జి ఇంట్లో ఏమీ నగదు దొరకలేదని దిల్లీ అగ్ని మాపక అధికారి అన్నట్లు... గత రెండు రోజుల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అంటే ఈ కేసుపై సమగ్ర దర్యాప్తు జరిగితేనే అసలు విషయం బయటకురాదు. న్యాయవవస్థలో ఉన్న ఒక జడ్జిపై ఆరోపణ వచ్చినప్పుడు దాన్ని 'లెక్క సరిచేసుకునే' బాధ్యత సదరు జడ్జిపై కూడా ఉంటుంది. కానీ ఇప్పటివరకూ జస్టిస్ యశ్వంత్ వర్మ నుంచి ఒక్క మాట పెదవి దాటకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆయన కావాలనే మౌనం పాటిస్తున్నారా... వెనుక ఉండి ఏమైనా నడిపిస్తున్నారా అన్న సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. తాజా ఘటన పక్కనబెడితే... 2018లో జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదైంది. సింబాలి సుగర్ మిల్స్ కుంభకోణానికి సంబంధించి యశ్వంత్ పై కేసు ఫైల్ చేసింది సీబీఐ. దానికి ఆ సమయంలో యశ్వంత్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా వ్యవహరించారు. ఆ సమయంలో వర్మ ఇంట్లో భారీగా లెక్కలు చూపని నగదు పట్టుబడటంతో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే 2012 సంవత్సరంలో జనవరి, మార్చి నెలల మధ్యలో ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ)కి సింభోలి షుగర్ మిల్స్

- మిగతా 2 లో

సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశాలు
ఈసీ

న్యూదిల్లీ: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బూత్ స్థాయిలో ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారానికిగాను అఖిలపక్ష సమావేశాలను ఎన్నికల అధికారులు నిర్వహిస్తున్నట్లు ఈసీ శనివారం వెల్లడించింది. బీజేపీకి లబ్ది చేకూర్చేందుకు ఎన్నికల డేటాను ఈసీ దుర్వినియోగిస్తున్నట్లు చాలా పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఇదే క్రమంలో ఓటరు

- మిగతా 2 లో

యువత జీవితాల్లో 'రాజీవ్ యువ వికాసం'
అధికారులు అంకితభావంతో పనిచేయాలి
ఉన్నతాధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాజీవ్ యువ వికాస పథకం ద్వారా యువత జీవితాల్లో మార్పు తీసుకురావడం కోసం అధికారులు అంకితభావంతో పని చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లి కమిటీ హాల్ లో శనివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి రాజీవ్ యువ వికాస పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 59 వేల మంది పైగా ఉద్యోగ నియామక పత్రాలు అందించామని, నిరుద్యోగ యువత తమ కాళ్లపై తాము నిలబడటానికి రాజీవ్ యువ వికాస పథకం ద్వారా స్వయం ఉపాధి పొందడానికి క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడానికి అధికారులు చాలా నిబద్ధతతో, పవిత్ర యజ్ఞంలా పనిచేయాలని సూచించారు. వనరుల సమీకరణకు ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకున్నామని, నిధుల సమస్య లేదని వివరించారు. లబ్ధిదారుడికి మంజూరి పత్రం అందజేసినప్పటి నుంచి ఎంపిక చేసుకున్న యూనిట్... వ్యాపారంలో స్థిర పడేంత వరకు సహకారాన్ని అందించేందుకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. బ్యాంకు మార్జిన్ తో కలిపి రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం రూ.తొమ్మిదివేల కోట్లు పెట్టుబడిగా పెడుతున్నదని, ప్రభుత్వ ఆలోచన విధానాన్ని వంద శాతం అమలు చేసే విధంగా అధికారుల పనితీరు ఉండాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ బీసీ

- మిగతా 2 లో

కేసీఆర్ రాజకీయాల నుంచి తప్పుకుంటే మంచిది
మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: బీఆర్‌ఎస్ నేతలకు ధరణితో దోచుకోవడం తప్పా ఏమి తెలవదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయిట్ వద్ద శనివారం మంత్రి మాట్లాడుతూ... కేటీఆర్ తండ్రి చాటు కొడుకు, హరీశ్‌రావు మామ చాటు అల్లుడని ఎద్దేవా చేశారు. వాళ్లు కనీసం డిప్యూటీ లీడర్లు కూడా కాదని వాళ్లతో ఏం మాట్లాడతామని దెప్పిపొడిచారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అప్పుడు డమ్మీ మంత్రిగా ఉండే వారని విమర్శించారు. ఆయనను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కనీసం గుర్తు కూడా పట్టరని అన్నారు. ప్రశాంత్ రెడ్డి స్పృహలేని వ్యక్తిగా మాట్లాడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు. ఉప్పల్, నారపల్లి ఫ్లై ఓవర్ పనులు గడ్కరీతో మాట్లాడి తాను చేపిస్తున్నానని మంత్రి అన్నారు. బీఆర్‌ఎస్

- మిగతా 2 లో

ప్రత్యామ్నాయ రాజకీయాల అన్వేషణలో

మొదటి రెండు మూడు సార్వత్రిక ఎన్నికలలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిరంతరం ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం అన్వేషిస్తూనే ఉంది. ఈ ప్రయత్నాల్లో భాగంగా 1967లో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. సంయుక్త విధాయక్ దళ్ మంత్రివర్గాలు ఏర్పడ్డాయి. ఈ సంయుక్త విధాయక్ దళ్ ప్రభుత్వాలలో సీపీఐ భాగస్వామి.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

విశాలాంధ్ర
ప్రపంచం
2
హైదరాబాద్
ఆదివారం
23 మార్చి 2025

ఎర్డోగన్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం

ఇస్తాంబుల్ మేయర్ అరెస్టుపై టర్కీలో నిరసనలు

ఇస్తాంబుల్: ఎర్డోగన్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. ఇస్తాంబుల్ మేయర్ అక్రమ్ ఇమాంగ్లు అరెస్టుకు పెద్దఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. బుధవారం నుంచి దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో భారీ ర్యాలీలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరిస్తూ భారీ సంఖ్యలో ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొంటున్నారు. ఆదేశాలు ధిక్కరిస్తే ఉపేక్షించేది లేదన్న ఎర్డోగన్ ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. మేయర్ విడుదలకు డిమాండ్ చేస్తున్నారు. ఎర్డోగన్‌కు ప్రధాన ప్రత్యర్థి కాబట్టే ఇమాంగ్లును లక్ష్యంగా చేసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇస్తాంబుల్‌తో పాటు అనేక పెద్ద నగరాల్లో భారీ ర్యాలీలు జరిగాయి. సరాంచనే జిల్లాలోగల మున్సిపాలిటీ భవనానికి వెళ్లే అన్ని మార్గాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు మూసివేశారు. అయినప్పటికీ జనం పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. రిపబ్లిక్ పీపుల్స్ పార్టీ (సీహెచ్‌పీ) పిలుపుమేరకు ఈ ఆందోళనలు కొనసాగుతున్నాయి. దాదాపు మూడు లక్షల మంది ప్రదర్శనలో పాల్గొన్నట్లు సీహెచ్‌పీ నేత ఓజ్గుర్ ఓజెల్ ప్రకటించారు. ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతుండగానే

నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు పెప్పర్ స్ప్రే, జల ఫిరంగులు వినియోగించారు. ఇజ్మీర్, అంకరా తదితర నగరాల్లో కొన్ని చోట్ల నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఇప్పటికే దాదాపు 350 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా 97 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అంతర్గత శాఖ మంత్రి అలీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. మేయర్ వ్యవహారంలో కోర్టు విచారణ జరగనున్న క్రమంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారేందుకు అవకాశాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే తనపై అవినీతి ఆరోపణలను ఇమాంగ్లు తోసిపుచ్చారు. మున్సిపాలిటీ టెండర్లకు సంబంధించి దాదాపు 40 ప్రశ్నలను పోలీసులు ఆయనకు సంధించినట్లు సమాచారం. మేయర్ అరెస్టును యూరోపియన్ నేతలు ఆక్షేపించారు. ఇది ప్రజాస్వామ్య తిరోగమనమని వ్యాఖ్యానించారు. మరోవైపు ఇమాంగ్లును తమ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించేందుకు సీహెచ్‌పీ సిద్ధమైంది. ఈ మేరకు ఆదివారం అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం. కాగా, టర్కీ అధ్యక్ష ఎన్నికలు 2028లో జరుగుతాయి.

ఇజ్రాయిల్‌పై హౌతీల దాడి

తిప్పికొట్టామన్న ఐడీఎఫ్

బీరుట్/టెల్అవీవ్: ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరు క్రమంలో పశ్చిమాసియా రణరంగమైంది. గాజాపై ఇజ్రాయిల్ దళాలు భీకర దాడులు కొనసాగిస్తున్నాయి. భూతల, వైమానిక దాడులతో విరుచుకుపడుతున్నాయి. ఇదే క్రమంలో లెబనాన్‌కు చెందిన హౌతీలు ఆ దేశంపై ప్రతీకార దాడి చేశాయి. ఇజ్రాయిల్ విమానాశ్రయం లక్ష్యంగా యెమెన్ నుంచి క్షిపణిని ప్రయోగించారు. దానిని కూల్చివేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. కాగా, ఇజ్రాయిల్‌పై దాడి చేసినట్లు హౌతీల ప్రతినిధి యాహ్యా ఒక ప్రకటన చేశారు. గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ ముగిసేవరకు తమ దాడులు ఆగవని తేల్చిచెప్పారు. 48 గంటల్లో మూడోసారి దాడి చేసినట్లు తెలిపారు. ఎర్ర సముద్రంలోని అమెరికా నౌక 'యూఎస్ఎస్ హ్యారీ ఎస్. ట్రూమాన్'పై హౌతీలు దాడులు ప్రారంభించారన్నారు. కాగా, హౌతీల దాడి క్రమంలో టెల్ అవీవ్ సమీపంలోని బెన్ గురియన్ విమానాశ్రయం నుంచి ప్రయాణాలకు ఆటంకం కలిగినట్లు సమాచారం.

పనామా, కోస్టారికాలో భారీ భూకంపం

పనామా: దక్షిణ పనామా, కోస్టారికాలో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.50 గంటలకు భూకంపం సంభవించినట్లు పనామా యూనివర్సిటీ జియోసైన్సెస్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. కోయిబా తీరానికి 78 కిమీల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. దక్షిణ కోస్టారికాలో తీవ్రత ఎక్కువగా ఉండగా... శాన్ జోసెతో పాటు మరికొన్ని చోట్ల స్వల్పంగా భూమి కంపించినట్లు వెల్లడించింది.

నైగర్‌లో మసీదుపై ఉగ్రదాడి: 44 మంది మృతి

నియామే: నైగర్‌లోని మసీదుపై ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటనలో 44 మంది ప్రాణాలు కోల్పోగా, 13 మంది గాయపడ్డారు. నైగర్, బుర్కినా ఫాసో, మాలీతో పంచుకున్న సరిహద్దులోని ఫాంబిటా గ్రామంలో మధ్యాహ్నం ప్రార్థనల సమయంలో సాయుధులు ఈ దాడికి పాల్పడినట్లు నైగర్ రక్షణ శాఖ శనివారం ఒక ప్రకటన చేసింది. ఇస్లామిక్ స్టేట్ అనుబంధ ఈఐజీఎస్ గ్రూపు ఈ దాడికి పాల్పడి ఉంటుందని రక్షణ శాఖ ఆరోపించింది. రంజాన్ నెల, శుక్రవారం ప్రార్థనలు సాయుధ ఉగ్రవాదులు మసీదును చుట్టుముట్టి మారణహోమానికి తెరతీసినట్లు పేర్కొంది. అనంతరం అక్కడి మార్కెట్, ఇళ్లకు ముష్కరులు నిప్పుపెట్టినట్లు వెల్లడించింది. 44 మంది పౌరుల మరణాలకు సంతాపంగా మూడు రోజుల పాటు సంతాప దినాలను అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. 2012లో త్వారెగ్ తిరుగుబాటు తర్వాత ఉత్తర మాలీ భూభాగాన్ని ఇస్లామిస్ట్ మిలిటెంట్లు వశపర్చుకున్న తర్వాత నుంచి పశ్చిమ ఆఫ్రికాలోని సహేల్ ప్రాంతంలో చొరబాట్లు మొదలయ్యాయి. ఆపై నైగర్, బుర్కినా ఫాసో తదితర కోస్తా పశ్చిమ ఆఫ్రియా దేశాలైన టాగో, ఘనాకూ చొరబాట్లు పెరిగాయి. ఉగ్రవాదుల పట్టు సాధించిన క్రమంలో కొన్ని లక్షల మంది నిర్వాసితులయ్యారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. గ్రామాలు, పట్టణాలు, సైనిక-పోలీసు స్థావరాలపై ఉగ్రదాడులు జరిగాయి. భద్రతను పునరుద్ధరించడంలో అక్కడి ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దీంతో మాలీ, బుర్కినా ఫాసో, నైగర్‌లో సైనిక పాలన సాగింది. ఇక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి వస్తోంది. తిరుగుబాట్ల క్రమంలో వారసత్వ మిత్రులైన పశ్చిమ దేశాలను వదిలి రష్యా నుంచి సైనికపరమైన సహకారాన్ని ఈ ప్రాంతాల అధికారులు కోరుతున్నారు.

మణిపూర్‌కు త్వరలో మంచి రోజులు

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితులు, శాంతి నెలకొల్పేందుకు ఐక్యంగా ముందుకెళ్లాలని మణిపూర్ ప్రజలను జస్టిస్ గవాయ్ కోరారు. మణిపూర్ అందమైన రాష్ట్రమని, ఇంఫాల్ నుంచి చురచాంద్పూర్‌కు ప్రయాణం ప్రకృతి అందాల నడుమ ఆహ్లాదంగా సాగిందని ప్రశంసించారు. శరణార్థి శిబిరాలకు వెళ్లిన తన అనుభవాలను పంచుకున్నారు. మణిపూర్ సీజేఐ చేపట్టిన పనులు అభినందించారు. అవసరార్థుల కోసం జిల్లా న్యాయ సేవల యంత్రాంగం అండగా నిలవడం ప్రశంసనీయమన్నారు. తాను ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్న నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) మణిపూర్ కోసం రూ.2.5 కోట్లు ఇచ్చిందని, అంతకుముందు రూ.1.5కోట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 109 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి కనీస ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తుండటం అభినందనీయమని జస్టిస్ గవాయ్ తెలిపారు. ఘర్షణల కారణంగా చదువు మానేసిన పిల్లలను తిరిగి బాడి బాట పట్టించడం కోసం విద్యా వ్యవస్థలు చొరవ చూపాలన్నారు. తొలుత ఇంఫాల్ విమానాశ్రయంలో న్యాయమూర్తులకు ఘన స్వాగతం లభించింది. వారంతా సద్భావన మండప్ శరణార్థి శిబిరాన్ని సందర్శించారు. నిర్వాసితులను పరామర్శించారు. అనేక మంది ఆరోగ్యాధికారులను సత్కరించారు. కాగా, మైయితే వర్గానికి చెందిన కారణంగా జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ చురచాంద్పూర్‌కు వెళ్లలేదు. బిష్ణుపూర్ జిల్లాతోనే తన పర్యటనను ముగించుకున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే

తాగు, సాగునీటి కొరత

కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మారిన జలాశయాలు: కేసీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్:
పదేళ్ల బీఆర్ఎస్ ప్రగతి పాలనలో జలకళతో ఉప్పొంగిన గోదావరి, కాళేశ్వరం ప్రాజెక్టులు, కాంగ్రెస్ పాలన తెచ్చిన కరువుతో చెరువులు కుంటలు అడుగంటి ఎడారిగా మారాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధ్వజమెత్తారు. "తలాపున పారుతుంది గోదారి... నీ చేను నీ చెలుక ఎడారి" అని నాటి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ నీటి కష్టాలను వివరిస్తూ, నాటి కవి సదాశివుడు రాసిన పాటను తిరిగి గుర్తుకుచేసుకునే పరిస్థితులు తలెత్తడం శోచనీయం అన్నారు. ఎండిన గోదావరి తల్లి కన్నీటి గోసను... కాళేశ్వరం నీళ్లందక పంటలు ఎండిన రైతన్నల గుండె కోతను సభ్య సమాజానికి తెలిపేందుకు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అధ్వర్యంలో రామగుండం నుంచి ఎర్రవల్లి దాకా 200 మందితో కూడిన 180 కిలోమీటర్ల పాదయాత్ర వారం రోజుల పాటు సాగి శనివారం ముగిసింది. ఎర్రవల్లిలో జరిగిన ముగింపు సభలో కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణను కొట్లాడి సాధించుకున్నామని, ఎంతో జాగ్రత్తగా నిలబెట్టుకున్నామని, ప్రజలు ఏమనుకున్నారో ఏందో కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నరు, అదీ వాళ్లిష్టం, కానీ దాని ఫలితం లోకం చూస్తుందన్నారు. ఇన్నాళ్లు లేని నీటి గోస ఇప్పుడెందుకు వచ్చినట్టు... తెలంగాణకు నీళ్లు ఇవ్వాలనే పాలనా ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే తెలంగాణకు సాగునీరు తాగునీరు సమస్య వచ్చిందని మండిపడ్డారు. ప్రభుత్వాలు ఖర్చుకు వెనకాడకుండా ప్రజలకు తాగునీరు, సాగు నీరు అందించాల్సిందే అని స్పష్టం చేశారు. పల్లెల నుంచి హైదరాబాదు వంటి పట్టణాలకు బతకడానికి వచ్చిన పేదలకు నాటి మన ప్రభుత్వం అండగా నిలిస్తే ఇప్పుడున్న ప్రభుత్వం వాళ్ల ఇళ్లను కూల్చివేస్తుందని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తుంటే కేసీఆర్ అన్నా ఎక్కడున్నావు రావే... రావే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కానీ నన్ను వోడగొట్టి ఇంట్ల కూర్చోబెట్టింద్రు కదా నేను ఎక్కడికి రావాలె? కత్తి ఒకనికి ఇచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే ఎట్లా అయితదన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, వంటేరు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్స్‌పై కొరడా

(మొదటిపేజీ తరువాయి)

దాచిపెడుతూ జీఎస్టీ ఎగవేతలకు పాల్పడుతున్న చట్టవిరుద్ధ ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై చర్యలు తీసుకున్నామని.. 357 వైబ్‌సైట్స్‌ని ఐటీశాఖ సమన్వయంతో బ్లాక్ చేసినట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది. బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు పాల్పడుతోన్న సుమారు 700 సంస్థలపై నిఘా వేసినట్లు పేర్కొంది. దేశం వెలుపల ఈ తరహా సంస్థలు నడుపుతోన్న కొంతమంది భారతీయులపై డీజీజీఐ మరో ఆపరేషన్ చేపట్టి... వారికి సంబంధించిన 166 ఖాతాలను బ్లాక్ చేసింది. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. చాలామంది బాలీవుడ్ ప్రముఖులు, క్రికెటర్లు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఈ ప్లాట్‌ఫామ్స్‌కు ప్రచారం నిర్వహిస్తున్నట్లుగా గుర్తించినట్లు పేర్కొంది. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... ఆ ప్లాట్‌ఫామ్స్ వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీసే అవకాశం ఉందని.. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. జీఎస్టీ చట్టం ప్రకారం.. ఆన్‌లైన్ గేమింగ్‌కు 28శాతం జీఎస్టీ విధిస్తున్నారు. ఈ రంగంలో పని చేస్తున్న సంస్థలు జీఎస్టీ కింద రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. రాబోయే ఐపీఎల్ సీజన్‌తో సహా చట్టవిరుద్ధమైన గేమింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు ఉంటాయని పేర్కొంది.

కేసీఆర్ రాజకీయాల నుంచి తప్పకుంటే మంచిది

(మొదటిపేజీ తరువాయి)

నేతలకు అబద్ధాలతో బతకడం బాగా అలవాటైందని మండిపడ్డారు. త్వరలో ఉస్మానియా హాస్పిటల్‌కు టెండర్లు పిలుస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ నేతలను ఎర్రగడ్డ హాస్పిటల్‌కు పంపించాలని అన్నారు. పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ చెప్పిన అబద్ధాలకు అసలు శిక్షలే సరిపోవని చెప్పారు. కేసీఆర్ పదిలక్షల అబద్ధాలు ఆడారని విమర్శించారు.
కేసీఆర్ మీద సభా హక్కుల ఉల్లంఘన నోటీస్ ఇవ్వాలని అన్నారు. దళితుడిని సీఎం చేయకపోతే తల తీసుకుంటానని అన్నారని మంత్రి గుర్తుచేశారు.
కేసీఆర్‌ను తలతీసి ఇవ్వమని అడగాలని లేదంటే రాజకీయాల నుంచి తప్పుకోమని చెప్పాలన్నారు. సభలో హరీశ్‌రావు వేసిన ప్రశ్నే తప్పు అని చెప్పారు.

మోదీ ఎప్పుడు వెళతారు?

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్రయం పొందుతున్నారు. బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన విధించడం కూడా ప్రశ్నలను తావిస్తోంది. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని 2023, ఆగస్టు 1న సుప్రీంకోర్టు చెప్పింది. రాష్ట్రపతి పాలన విధించడానికి 18 నెలల సమయం ఎందుకు పట్టింది? ఇప్పటికైనా సుప్రీంకోర్టు జడ్జిలు ఆ రాష్ట్రానికి వెళ్లారు. ఇది హర్షణీయం. మరి ప్రధాని ఎప్పుడు వెళతారన్నది ప్రధాన ప్రశ్న' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీరును కూడా విమర్శించారు. హోం వ్యవహారాల శాఖ పనితీరుపై చర్చలో మణిపూర్ పరిస్థితిని ప్రస్తావించకపోవడాన్ని ఆక్షేపించారు. హోంమంత్రి మిజోరం వెళ్లారు కానీ మణిపూర్‌కు ఎందుకు వెళ్లలేదని జైరాం రమేశ్ ప్రశ్నించారు. బ్యాంకాక్‌కు వెళ్లడానికి ముందు లేక అక్కడ నుంచి తిరిగి వచ్చిన తర్వాత అయినాగానీ మణిపూర్‌లో పర్యటించాలని, అక్కడి ప్రజలకు భరోసా ఇవ్వాలని ప్రధానికి సూచించారు. మణిపూర్ ప్రజలకు ప్రధాని ఆత్మీయత అవసరమని జైరాం రమేశ్ అన్నారు. సుప్రీం న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, సూర్యకాంత్, విక్రమ్ నాథ్, ఎంఎం సందేశ్, కేవీ విశ్వనాథన్, ఎన్.కోటీశ్వర్‌తో కూడిన ఆరుగురు జడ్జిల బృందం చురచాంద్పూర్‌లోని శిబిరాన్ని సందర్శించింది.

సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

జాబితాల ప్రక్షాళన కోసం జనన-మరణ పత్రాల ధ్రువీకరణనూ చేపట్టాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఇప్పటికే ఆధార్‌తో ఓటరు ఐడీల అనుసంధానం దిశగా కసరత్తు చేస్తోంది.
అలాగే, రాష్ట్రాల్లో వివిధ స్థాయిల్లో ఉన్న సమస్యలు పరిష్కరించడం కోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆ దిశగా ముందుకెళుతోంది. ఈ నేపథ్యంలోనే బూత్ స్థాయి సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశాలను ఎన్నికల అధికారులు నిర్వహిస్తున్నట్లు ఈసీ తెలిపింది. అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలని నాలుగు వేల మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 788 మంది జిల్లా ఎన్నికల అధికారులు, 36 మంది రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఈనెల 31వ తేదీ నాటికి సమావేశాలు పూర్తి చేయాలని పేర్కొంది.

తేజస్‌కు త్వరలో అమెరికా ఇంజిన్ల రాక

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధ విమానాల తయారీ ప్రక్రియ నెమ్మదించింది. పాకిస్థాన్, చైనా నుంచి పొంచి ఉన్న ముప్పు, అలాగే డ్రాగన్ అత్యాధునిక ఫైటర్ జెట్లను రూపొందించి పాక్‌కు అందిస్తుంటే.. మనం ఇంజిన్ల కోసం వేచిచూడాల్సి రావడం ఆందోళనకు దారితీసింది. 2021లో కుదిరిన 761 మిలియన్ల డాలర్ల కాంట్రాక్ట్ ప్రకారం.. ఏటా 20 ఇంజిన్లు అందుతాయని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలాఉంటే.. 98 కేఎన్ థ్రస్ట్ (కిలోన్యూటన్ల శక్తి) కలిగిన ఎఫ్-414 ఇంజిన్‌నూ అమెరికా నుంచి సమకూర్చుకోవాలని భారత్ తలపెట్టింది. మార్క్ 2లో వాటిని అమర్చాలని యోచిస్తున్నారు. అయితే వీటి సరఫరా కూడా ఇంకా మొదలుకాలేదు. ఇదిలాఉంటే.. ప్రస్తుతం ప్రపంచంలో సొంతంగా ఫైటర్ ఇంజిన్‌ను తయారుచేసే సత్తా అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనాలకే ఉంది. ఆ సామర్థ్యాన్ని సాధించేందుకు భారత్ 1984లోనే కావేరి ఇంజిన్ ప్రాజెక్టు చేపట్టింది. అణ్వస్త్ర పరీక్షల వల్ల అంతర్జాతీయ ఆంక్షలకు గురవడంతో ఈ ప్రాజెక్టు దెబ్బతింది. అయితే, 2016లో ఫ్రెంచి కంపెనీ శాఫ్రాన్ సహకారంతో 110 కేఎన్ శక్తి గల ఇంజిన్‌ను తయారీని తలపెట్టింది.

యువత జీవితాల్లో 'రాజీవ్ యువ వికాసం'

(మొదటిపేజీ తరువాయి)

మైనారిటీ ఈడబ్ల్యూఎస్ శాఖలను సమన్వయం చేస్తూ ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి రాజీవ్ యువ వికాస్ మిషన్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ మిషన్ బాధ్యతలు సీనియర్ ఐఏఎస్ అధికారికి అప్పగిస్తున్నట్లు చెప్పారు. శాఖల వారీగా ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షించడానికి ఒక అధికారిని ప్రత్యేకంగా నియామకం చేయాలని ఆదేశించారు. ముందస్తు జాబ్ క్యాలెండర్ ప్రకారం ఏప్రిల్ ఐదో తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేసి ఆరో తేదీ నుంచి మూడు వారాల్లో మండల స్థాయిలో లబ్ధిదారుల ఎంపిక చేయాలని చెప్పారు. జాబితాను కలెక్టర్ కు పంపించాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ వారం రోజుల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి జిల్లా ఇంచార్జి మంత్రి అనుమతి కోసం పంపించి అనుమతి వచ్చిన తర్వాత లబ్ధిదారులను ప్రకటించాలన్నారు. జూన్ రెండున ఎంపికైన లబ్ధిదారులకు రాష్ట్ర వ్యాప్తంగా మంజూరి పత్రాలను అందజేయాలన్నారు. వ్యాపార మెలకువలకు సంబంధించిన నైపుణ్యం అందించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక చాలా పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ ఉన్నత అధికారులు ఈ శ్రీధర్, శరత్, శ్రీధర్, దివ్య దేవరాజన్, తఫ్సీర్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

2018లోనే వర్మపై సీబీఐ ఎఫ్ఐఆర్..

(మొదటిపేజీ తరువాయి)

వందల కోట్లలో టోకరా వేసి ఘటన అప్పట్లో సంచలనమైంది.. సదరు బ్యాంకును మోసం సుమారు రూ. 148.59 కోట్లను అక్రమ మార్గంలో సింభోలి షుగర్ మిల్స్ ఖాతాలోకి మళ్లించారు. 5వేల మంది రైతులకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి బ్యాంక్ రుణానికి వెళ్లి, ఆ రైతుల పేర్లతో తప్పుడు పత్రాలు(కేవైసీ) సృష్టించి మోసానికి తెరలేపింది సింభోలి షుగర్ మిల్స్. అయితే ఈ విషయాన్ని ఓబీసీ బ్యాంకు 2015లో గ్రహించింది. ఆ షుగర్ మిల్స్ తీసుకున్న రుణం మోసం చేసి తీసుకున్నదిగా ప్రకటించింది. ఇందులో మొత్తం రుణం రూ. 97.85 కోట్లు కాగా, అవుట్ స్టాండింగ్ అమౌంట్ రూ. 109 కోట్లుగా బ్యాంకు పేర్కొంది. దీనిపై కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా వ్యవహరించిన గుర్పాల్ సింగ్ పై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అప్పటి పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ కి గుర్పాల్ సింగ్ అల్లుడు. ఆ తర్వాత ఈ కేసుకు సంబంధించి సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ(ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) కూడా రంగంలోకి దిగింది. ఈ రెండు కేంద్ర దర్యాప్తు సంస్థలు సమాంతరంగా దర్యాప్తు చేశాయి. అయితే ఈ కేసులో పెద్దగా పురోగతి కనిపించకపోవడంతో దర్యాప్తు అంశం పక్కకు పోయింది. ఈ భారీ అవినీతిని సీరియస్ గా తీసుకున్న అలహాబాద్ హైకోర్టు.. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. న్యాయవవస్థను కుదిపేసిన ఈ తరహా అవినీతిపై దర్యాప్తు కచ్చితంగా సమగ్రంగా జరగాలని పేర్కొంది.
ఇందులో రుణాలు ఎగవేతకు సంబంధించి ఏడు బ్యాంకులను లింక్ చేసింది హైకోర్టు. సుమారు ఏడు బ్యాంకులు కలిపి బయారూ. 900 కోట్లు సింభోలి షుగర్ మిల్స్ కు రుణాన్ని మంజూరు చేసినట్లు గుర్తించిన హైకోర్టు.. ఆ మేరకు ఆదేశాలు ఇచ్చింది. దాంతో 2024 ఫిబ్రవరిలో సీబీఐ రంగంలోకి దిగింది. దీనికి సంబంధించిన కంపెనీ డైరెక్టర్లు, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెకర్లపై ఎఫ్ఐఆర్ లు నమోదు చేసి విచారణను తిరిగి ప్రారంభించింది.

25 ఏళ్లు 'డీలిమిటేషన్' వద్దు

(మొదటిపేజీ తరువాయి)

పంజాబ్ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, ఎ.రేవంత్ రెడ్డి, భగవంత్ సింగ్ మాన్‌తో పాటు కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, సీపీఐ కార్యదర్శి వినయ్ విశ్వం, శిరోమణి అకాలీదళ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ ఖుందర్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కేరళ ప్రధాన కార్యదర్శి పి.ఎం.ఎ.సలాం పాల్గొన్నారు.

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాల రూపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతుందని, సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతామన్నారు. 'డీలిమిటేషన్‌పై ఈ అఖిలపక్ష భేటీ చరిత్రాత్మకంగా నిలిచిపోతుంది. ప్రస్తుతమున్న జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదు. దీన్ని మనమంతా వ్యతిరేకించాలి. పార్లమెంటులో మన ప్రాతినిధ్యం పడిపోతే... అభిప్రాయాలను వ్యక్తీకరించే బలం తగ్గుతుంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల కోసం మనం పోరాటం చేయాల్సి వస్తుంది. మన సమ్మతితో సంబంధం లేకుండానే చట్టాలు రూపొందుతాయి. ఆ నిర్ణయాలు మన ప్రజలపై ప్రభావం చూపుతాయి. విద్యార్థులు అవకాశాలు కోల్పోవాల్సి వస్తుంది. రైతులకు మద్దతు కొరవడుతుంది. మన సంప్రదాయాలు, వృద్ధి ప్రమాదంలో పడతాయి. సామాజిక న్యాయం దెబ్బతింటుంది. ఈ పరిణామాలన్నింటితో మన సొంత దేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపోతాం' అని తెలిపారు. తమ నిరసన పునర్విభజనకు వ్యతిరేకంగా కాదని పునరుద్ఘాటించారు. న్యాయబద్ధంగా, పారదర్శకంగా డీలిమిటేషన్ చేయాలనే తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. తాజా భేటీని 'జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ ఫెయిర్ డీలిమిటేషన్'గా పిలుద్దామని తమిళనాడు సీఎం ప్రతిపాదించారు. తదుపరి జేఏసీ భేటీ హైదరాబాద్‌లో జరుగుతుందని తెలిపారు. అంతకుముందు తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ 'జనాభా పెరుగుదలను అరికట్టేందుకు కొన్ని దశాబ్దాలుగా అనేక దక్షిణాది రాష్ట్రాలు కీలక చర్యలు చేపడుతున్నాయి. ఇందుకోసం అనేక విధానాలు కూడా తీసుకొచ్చాం. కానీ, కొన్ని రాష్ట్రాల్లో మాత్రం జనాభా వృద్ధి విపరీతంగా ఉంది. జనాభా నియంత్రణపై మన చర్యలకు ఎలాంటి రివార్డ్ లభించలేదు సరికదా... ఇప్పుడు రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయే ప్రమాదంలో పడ్డాం' అన్నారు.

బీజేపీకే ప్రయోజనం...

కేరళ సీఎం పినరయి విజయన్ మాట్లాడుతూ లోక్‌సభ సీట్ల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలపై 'పదునైన కత్తి' లాగా పొంచి ఉందని తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తగినంత సంప్రదింపులు లేకుండా ముందుకు సాగుతోందని పేర్కొంటూ, 'ఈ ఆకస్మిక చర్య రాజ్యాంగ సూత్రాలు లేదా ప్రజాస్వామ్య ఆవశ్యకతల ద్వారా కాదు. సంకుచిత రాజకీయ ప్రయోజనాల ద్వారా' అని విమర్శించారు. ఎలాంటి చర్చలు చేపట్టకుండానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని కేంద్రం భావిస్తోందని విమర్శించారు. 'అలా జరిగితే అది మనకు ప్రమాద ఘంటిక లాంటిదే. పార్లమెంటులో మన ప్రాతినిధ్యం తగ్గితే... దేశ సంపదలో మన వాటా కూడా తగ్గుతుంది. దీన్ని మనం ఎన్నటికీ అనుమతించకూడదు' అని అన్నారు. ఉత్తరాదిలో ఎక్కువ ప్రభావాన్ని కలిగి ఉన్న బీజేపీ ఇటువంటి ఏర్పాటు ద్వారా ప్రయోజనం పొందుతుందని మండిపడ్డారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించి, కేరళ, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు ఇప్పుడు నిరసనలో ఐక్యంగా ఉన్నాయి' అని అన్నారు. ఈ సమావేశం సంయుక్త కార్యాచరణ కమిటీ ఏర్పాటు ద్వారా సమన్వయంతో కూడిన ప్రతిఘటనకు నాంది పలికిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ చర్యలు... ఆర్థిక విధానాల నుంచి భాషా విధానాల వరకు, సాంస్కృతిక విధానాల నుంచి ప్రాతినిధ్య స్థిరీకరణ వరకు భారతదేశ సమాఖ్య వ్యవస్థను, ప్రజాస్వామ్య చట్రాన్ని అస్థిరపరుస్తున్నాయి. దీనిని ఆమోదించడానికి అనుమతించలేము' అని ఆయన అన్నారు.

డీలిమిటేషన్‌తో పంజాబ్‌కు నష్టం : భగవంత్ మాన్

డీలిమిటేషన్‌తో పంజాబ్‌కు నష్టం జరుగుతుందని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అన్నారు. పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ తర్వాత పార్లమెంటరీ సీట్ల సంఖ్య పెరిగినప్పటికీ, ఉత్తరాది రాష్ట్రంలో లోక్‌సభలో తక్కువ శాతం సీట్లు ఉంటాయని చెప్పారు. సీట్ల సంఖ్య 13 నుంచి 18కి పెరుగుతుందని, అయితే మొత్తం శాతం 2.39 శాతం నుంచి 2.11 శాతానికి తగ్గుతుందని అన్నారు. 'మొత్తం పార్లమెంటరీ సీట్ల సంఖ్య పెరిగినా, పార్లమెంటుకు మన (పంజాబ్) ప్రాతినిధ్యం తగ్గుతుంది' అని మాన్ అన్నారు.
కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశం ఎల్లప్పుడూ జనాభా లెక్కల నిబంధనలు, కుటుంబ నియంత్రణ విధానాలను సమర్థించి, దానిని ప్రగతిశీల ప్రాంతంగా మార్చిందని ఆయన చెప్పారు. ఆర్థికంగా, అక్షరాస్యత పరంగా మేము స్థిరంగా ముందున్నాము. మేము ఎల్లప్పుడూ మా స్వంత ప్రయోజనాలను మాత్రమే కాకుండా జాతీయ ప్రయోజనాలను కూడా కాపాడుకున్నాం' అని అన్నారు.

కేంద్రం చర్చ చేపట్టాలి : నవీన్ పట్నాయక్

2026 నాటి జనాభా గణాంకాలను డీలిమిటేషన్ కోసం పరిగణనలోకి తీసుకుంటే... ఒడిశా లోక్‌సభలో, రాష్ట్ర అసెంబ్లీలో సీట్లను కోల్పోతుందని బిజూ జనతాదళ్ (బీజేడీ) అధ్యక్షుడు, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని అత్యున్నత చట్టసభలో సీట్ల సంఖ్యను నిర్ణయించడానికి జనాభా మాత్రమే ప్రమాణం కాకూడదన్నారు. ఈ సమావేశంలో వర్చువల్‌గా ప్రసంగించిన పట్నాయక్... జనాభా గణాంకాల ఆధారంగా పునర్విభజన తీవ్ర ప్రభావాలు కలిగి ఉన్నందున సందేహాలను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలతో సరిహద్దుల విభజనపై వివరణాత్మక చర్చ చేపట్టాలని సూచించారు.

అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలి : కేటీఆర్

డీలిమిటేషన్‌పై ప్రశ్నించకుంటే తమను చరిత్ర క్షమించదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత విధానాలతో దేశానికి 36 శాతం జీడీపీలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతున్నాయన్నారు. డీలిమిటేషన్ వల్ల కేవలం పార్లమెంటు ప్రాతినిధ్యం తగ్గడమే కాకుండా ఆర్థిక పరమైన నిధుల కేటాయింపుల్లో తీవ్రమైన నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. మొదటి నుంచి దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, ఎన్డీఏ పాలనలో దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష మరింత పెరిగిందన్నారు. బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులను ఉత్తరాదికే పరిమితం చేయడం ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం డీలిమిటేషన్ జరిగితేనే దేశ సమాఖ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతుందన్నారు.

తెలంగాణకు 42 పైసలే... బీహార్‌కు మాత్రం రూ.6.06 : సీఎం రేవంత్

కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రాలు భారీగా చెల్లిస్తున్నా... తక్కువ మొత్తంలోనే తిరిగి పొందుతున్నామని తెలిపారు. ' తెలంగాణలో సుపరిపాలనతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా చెల్లిస్తున్నప్పటికీ తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం. రూపాయి చెల్లిస్తే... తెలంగాణకు 42 పైసలు తిరిగొస్తున్నాయి. తమిళనాడుకు 26 పైసలు, కర్నాటకకు 16 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే లభిస్తున్నాయి. కానీ బీహార్ మాత్రం రూపాయికి రూ.6.06 పొందుతోంది. ఉత్తర ప్రదేశ్‌కు రూ.2.03, మధ్య ప్రదేశ్‌కు రూ.రూ.1.73 మేర లభిస్తోంది' అని రేవంత్‌రెడ్డి వివరించారు. 1976లో లోక్‌సభ సీట్లు పెంచకుండానే డీలిమిటేషన్ చేపట్టారు. ప్రధాని మోదీ కూడా లోక్‌సభ సీట్లు పెంచకుండా దీనిని చేపట్టాలన్నారు. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించవు.
ఇలా చేస్తే దక్షిణాది రాజకీయ వాణి కోల్పోతుంది. దక్షిణాదిని సెకండరీ సిటిజన్లుగా ఉత్తరాది మారుస్తుంది. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను ఆమోదించొద్దని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నాం. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోం' అని తెలంగాణ సీఎం స్పష్టం చేశారు.

సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ

విశాలాంధ్ర - ఖమ్మం : సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల మండల, జిల్లా మహాసభలను సకాలంలో పూర్తి చేయాలని ఆయన కోరారు. ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు, పట్టణ, నగర కార్యదర్శుల సంయుక్త సమావేశం శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రజా సంఘాల నిర్మాణం చేపట్టాలన్నారు. ఏప్రిల్ చివరి నాటికి అన్ని ప్రజా సంఘాల మహాసభలను పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది సిపిఐ -శత వసంత ఉత్సవాలు జరుగుతున్నాయని శత వసంత ఉత్సవ జాతీయ స్థాయి ముగింపు సభ ఖమ్మంలోనే జరగనున్నందున పార్టీ మహాసభలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతుల, వ్యవసాయ కార్మికుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని పాలకులు గ్రామీణ ప్రాంత సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయని హేమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 26న జరిగే శత వసంత ఉత్సవ ముగింపు సభకు జిల్లా నుంచి రెండు వేల మంది జనసేవాదళ్ కార్యకర్తలను తయారు చేయాలని ఈలోపు జిల్లా వ్యాప్తంగా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయాలని హేమంతరావు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగలితండా సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి

విశాలాంధ్ర - కారేపల్లి : మంగలితండాలోని పలు సమస్యలపై వైరా శాసన సభ్యులు మాలోతూ రాందాస్ నాయక్ ను మాజీ సర్పంచ్ భర్త పిల్లలమర్రి వీరన్న శనివారం వినతిపత్రాన్ని అందించారు. మాదారం మైన్స్ క్వారీ నుంచి వచ్చే నీటిని మంగలితండా చెరువుకి మళ్ళిస్తే రైతుల పొలాలకు నీరు అందుతుందని వినతిపత్రంలో కోరారు. సుమారు 50 కుటుంబాల రైతులు ఆ నీటితో పంటలను పండిస్తారని తెలిపారు. గ్రామంలో పలు వీధులలో సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. పంటలకు కావాల్సిన నీటి విషయమై మాదారం మైన్స్ అధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వీరన్న తెలిపారు. గ్రామంలోని సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ తోకలిసి వీరన్న అందించారు.

శుద్ధమైన తాగునీటిని అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి జరుగుతున్న నీటి సరఫరా ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు నీటి సమస్యలు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ నీటి సమూనాను పరిశీలించి పథకం ద్వారా ప్రతి గ్రామానికి సిద్ధమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని. గ్రామంలోని ఓ.హెచ్.ఆర్. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, గ్రామంలో ఎవరైనా మరుగుదొడ్ల కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే వెంటనే పరిశీలించి నిబంధనల ప్రకారం మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టెన్త్ పరీక్షా కేద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : పదో తరగతి పరీక్షల లో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా హాలియ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, శనివారం పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు అన్నింటిని ఎంఈఓ, చీఫ్ సూపరింటిండెంట్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ స్థానిక పోలీసులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద భద్రతను పకడ్బందీగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితులలో ఇతరులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించవద్దని, పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు అనుమతి లేదని చెప్పారు.పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని, పోలీస్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పరీక్షలు సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిరియాల గూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మిర్యాలగూడ డి ఎస్ పి తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

రేషన్ షాపుల్లో ఏప్రిల్ నుండి సన్న బియ్యం పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : రేషన్ దుకాణాలలో సన్నబియ్యం సరఫరా అంశంపై రేషన్ డీలర్లు, రెవెన్యూ అధికారులతో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ శనివారం తన ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అన్ని రేషన్ దుకాణాలలో సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. ప్రజలెవరికి ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డు బియ్యాన్ని ఇవ్వవద్దు అన్నారు. సన్న బియ్యం జారీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. వేసవికాలం ఎండలు అధికంగా ఉన్నందున్న రేషన్ దుకాణాలకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రజలుకు ఎండ నుంచి రక్షణ కల్పించేలా తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డిఎం వేణుగోపాల్, డిఎస్ఓ కిరణ్ కుమార్, రేషన్ డీలర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

10,954 వీఆర్వో పోస్టులకు ఆమోదం

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో గ్రామీణ పాలనా వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంత్రి మండలి 10,954 గ్రామ పరిపాలన అధికారి (వీఆర్వో) పోస్టులకు ఆమోద ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖలో కొత్తగా గ్రామపాలన అధికారుల (జీపీవో) పోస్టులు మంజూరు చేస్తూ శనివారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నూతన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థకు జీపీవో గా నామకరణం చేసింది. గత ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడంతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసింది. తిరిగి గ్రామ పాలన అధికారులను నియమించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

కార్డున్న ప్రతి ఒక్కరూ

ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొనాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులకు పని కోరే ప్రతి ఒక్కరు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్న పనులన్నిటిని త్వరితగతిన పూర్తి చెయ్యాలన్నారు. అర్హత కలిగి పని కొసం చూసే ప్రతి కూలి హాజరు కావాలని కలెక్టర్ కోరారు. ఈ పని కోరే వారందరూ ఈనెల 23 నుండి 29 వరకు వారం రోజులు వేగవంతంగా పనులు పూర్తి చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు ఉన్న క్రమంలో పనులు పూర్తి చేసేందుకు పెద్ద ఎత్తున కూలీలు హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించి ప్రతి వ్యవసాయ భూమిలో ఫామ్ పౌండ్ నిర్మాణం చేపట్టాలని సూచించారు.

పిఓసిఎస్ఓ బాధితుల ఖాతాలో నిధులు జమ

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాద్ : పి ఓ సిఎస్ఓ బాధితుల ఖాతాలలో 20,75 లక్షల రూపాయలు జమ అయినట్లు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ భరోసా సెంటర్ను సందర్శించి, అందిస్తున్న సేవలను సమీక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 2022 నుంచి 2024 వరకు భరోసా కేంద్రం ద్వారా 56 మంది బాధితులకు ప్రభుత్వం తరపున రూ. 20,75,000 (ఇరవై లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలు) బాధితుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాయిదా పడకుండా వెంటనే విడుదల చేయించడం జరిగిందన్నారు.ఇట్టి విషయం పై కృషి చేసిన డిఎస్పీ తిరుపతి రావు, రూరల్ సీఐ సరవయ్యలను ప్రత్యేకంగా అభినందించారు.బాధితుల ఖాతాల్లోకి పరిహారం వేగంగా జమ చేయడానికి భరోసా యంత్రాంగం మరింత సమర్థంగా పని చేయాలన్నారు. భరోసా కేంద్రం బాధితుల కోసం తీసుకుంటున్న చర్యలను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో భరోసా టీం వారు జ్యోష్ణ, జయశ్రీ, పార్వతి, రేణుక, మౌనిక మరియు ఎస్బిసిఐ చంద్రమౌళి, రూరల్ సిఐ సర్వయ్య, రూరల్ ఎస్సై దీపికా, షీ టీం ఎస్సై సునంద, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం దొంగను పట్టుకున్న పోలీసులు

విశాలాంధ్ర - కొమరం భీం, కాగజ్ నగర్ : చెడు వ్యసనాలకు బానిసగా మారి దొంగతనాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని పట్టుకున్న కాగజ్ నగర్ టౌన్ పోలీసులు వారి వద్ద నుండి 86.6 గ్రాముల బంగారు ఆభరణాలు, TS03FF 3556 నంబర్ గల కారు, ఒక సెల్ ఫోన్, నగదు రూ.12,000 స్వాధీనం చేసుకున్నారు. కాగజ్నగర్ టౌన్ ఇన్ స్పెక్టర్ పి.రాజేంద్రప్రసాద్, ఎస్సైలు సుధాకర్, సురేష్ వివరాలను వెల్లడించారు. కాగజ్నగర్ బాలాజీనగర్లో నివసించే జంజిరాల ప్రదీప్ (24) జల్సాల కోసం గత రెండు నెలలుగా మూడు దొంగతనాల కేసుల్లో ప్రధాన నిందితుడిగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎవరూ లేని ఇంట్లోకి ప్రవేశించి దొంగతనాలు చేసేవాడు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని పట్టుకునేలా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కేసును ఛేదించడంలో సీసీటీవీ ఫుటేజి, సాంకేతిక ఆధారాలు మరియు నిఘా బృందాల సహాయంతో నిందితుని గుర్తించి అరెస్టు చేశామన్నారు. ఇంటి దొంగలను ఈశ్వరుడైన ఎరుగడు కానీ ప్రస్తుత కాలంలో సీసీ కెమెరాలు శివుడి మూడో నేత్రంగా పనిచేస్తున్నాయన్నారు.

అర్ధరాత్రి అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

విశాలాంధ్ర- తొర్రూర్ : అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి నుండి ఎట్లాంటి కార్యక్రమం పిలుపు లేకున్నా శనివారం తెల్లవారుజామున ఇంట్లో జొరబడి అక్రమ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు బంధు మహేందర్ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. జిల్లాలో కాని రాష్ట్రంలో కానీ ఏఐ ఎస్ఎఫ్ కార్యక్రమాలు లేనప్పుడు సమాచార లోపంతో అక్రమ అరెస్టులు చేయడం చాలా దుర్మార్గమని, దీనివల్ల వ్యక్తుల వ్యక్తిగత పనులు, సంఘ కార్యక్రమాలు, అడ్డుకున్నట్లేనని ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనేనని భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించి, ప్రైవేట్, కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తున్నారన్నారు. అరెస్టుల పర్వం కొనసాగిస్తే గత ప్రభుత్వానికి ఏ గది పట్టిందో భవిష్యత్తులో మీకు అదే గతి పడుతుందని పేర్కొన్నారు.

ఐటీ టవర్ నిర్మాణానికి స్థల సర్వే చేసి నివేదిక సమర్పించాలి

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి జిల్లాలో ఐటీ టవర్ నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలానికి సంబంధించి సర్వే చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులో ఐటీ టవర్ నిర్మాణం కోసం ఇదువరకు ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్ కుమార్ తో కలిసి సందర్శించారు. సంబంధిత స్థలం ఐటీ టవర్ నిర్మాణానికి అన్ని విధాలుగా అనువైనదేనా కాదా అనే విషయంపై పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐటీ టవర్ నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలానికి సంబంధించి మరోసారి సర్వే చేసి నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, సర్వే అధికారులు, తదితరులు ఉన్నారు.

నేరస్థులకు శిక్షపడేలా కృషిచేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : నేరస్థులకు శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో పనిచేస్తున్న కోర్టు డ్యూటీ అధికారులు, లైజనింగ్ అధికారులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరస్తులకు శిక్షపడే విధంగా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా మానవత్వంతో మెదలాలని, దోషులకు శిక్ష పడడంలో కోర్టు కానిస్టేబుళ్ల బాధ్యత చాలా కీలకమైనదని అన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా పనిచేస్తూ చనిపోయిన కె. నాగరాజు భార్య విజయకుమారికి రూ.7,84,762 రూపాయల భద్రత ఎక్స్ గ్రేషియా చెక్ను కమిషనర్ అందజేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లా రెడ్డి, ఇన్స్పెక్టర్లు కృష్ణ, ఇన్స్పెక్టర్ సతీష్, ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, సిసి హరీష్తో పాటు పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

చేపల పెంపకం ఆదాయాన్ని పొందవచ్చు : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక అవకాశాలు కల్పిస్తుందని, ఈ క్రమంలో చేపల పెంపకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు మరింత అదనపు ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని రెబ్బెన మండలం లైన్ గూడ గ్రామంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఏర్పాటుచేసిన చేపల పెంపకం కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సందర్శించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక అంశాలలో మహిళ స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూతనిస్తుందని. జిల్లాలో మహిళా సంఘాలచే పుట్టగొడుగులు పెంపకం కొరకు ఆసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులకు హైదరాబాద్లో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.

మెరుగైన విధుల కోసం శిక్షణ అవసరం

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి సంస్థా పరంగా సెక్యూరిటీ విభాగం విధుల నిర్వహణకు శిక్షణ తరగతులు ఎంతో అవసరమని ఎస్ఓ టు జిఎం జె. వేణుమాధవ్ అన్నారు. ఈనెల 17 నుండి వారం రోజులపాటు జరిగిన యస్ అండ్ పిసి సెక్యూరిటీ సిబ్బంది 35వ బ్యాచ్ ఫస్ట్ ఎయిడ్ అండ్ ఫైర్ ఫైటింగ్ శిక్షణా తరగతుల ముగింపు శనివారం జరిగింది. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో జరిగిన ఈ శిక్షణ పూర్తయిన నేపధ్యంలో కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రతి యూనిఫాం సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్పై పూర్తి స్థాయి అవగాహన అవసరమన్నారు. తద్వారా సెక్యూరిటీ సిబ్బంది పనితీరు గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. అన్ని గనులు, డిపార్టుమెంట్ల వద్ద ఈ సెక్యూరిటీ సిబ్బంది ఉండి అత్యవసర సేవలు అందిస్తారని తెలిపారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపికైన సి. రామకృష్ణ, యం. యాదయ్యలకు బహుమతులను అందజేశారు. శిక్షణా సిబ్బంది నిత్యావసరాలను జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహ కులకు అందజేశారు. ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు కొలనుకి ఆహ్వానం

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కౌసల్య కాలనీ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డిని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కౌసల్య కాలనీ నందు ఏప్రిల్ 6వ తేదిన నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరు కాగలరని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. శివప్రసాద్, వెంకట్ రెడ్డి, రంజిత్, నవీన్, చైతన్య పాల్గొన్నారు.

ఎకరా లోపు పేదలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి: హరీశ్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్: ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క... గత బడ్జెట్లో రైతు భరోసాకు రూ. 930 కోట్లు పెట్టారని... మంత్రి సీతక్క వేసింది రూ. 60 కోట్లే అని చెప్పారని, అంటే మీరు పెట్టింది రూ.930 కోట్లు వేసింది 60 కోట్లా... అంటే రూ. 870 కోట్లు విడుదల చేయలేదా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు నిలదీశారు. శాసనసభలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది బడ్జెట్లో కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.600 కోట్లు పెట్టారు, గతం కంటే రూ.330 కోట్లు కోత పెట్టారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉపాధి కూలీలు కోటి రెండు లక్షల మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని కోరుతున్నామని చెప్పారు. మేం రాళ్లకు, గుట్టలకు రైతుబంధు ఇచ్చామని ఆరోపిస్తున్నారు, అలాంటివి ఏమైనా ఉంటే రికవరీ చేయండి అని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో ఇచ్చేది రూ.12 వేలు అని, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల్లో 10 గుంటల వారసత్వ భూమి కూడా ఉందన్నారు. వాళ్లకు రైతు భరోసా వచ్చేది రూ.మూడు వేలైతే, వారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 12 వేలు నష్టపోతున్నారు కదా అని తెలిపారు. అందుకే ఎకరం లోపు భూమి ఉన్న ఉపాధి కూలీలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కోమటిరెడ్డిపై స్పీకర్‌కు ఫిర్యాదు

మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డిపై స్పీకర్కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్తో శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన ప్రశ్నకు కోమటిరెడ్డి ఇచ్చిన సమాధానం సభను తప్పుదోవ పట్టించే విధంగా ఉందని స్పీకర్ కు ఇచ్చిన వినతిపత్రంలో బీఆర్ఎస్ శాసన సభాపక్షం పేర్కొంది. బీఆర్ఎస్ పాలనలో సీఆర్ ఎస్ నిధులు రాలేదని, నల్లగొండ నియోజకవర్గ రోడ్లకు నిధులు కేటాయించలేదని, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ కు ఎస్క్రో అకౌంట్ తెరవలేదని కోమటి రెడ్డి ఇచ్చిన సమాధానం పూర్తిగా అవాస్తవమని స్పీకర్ కు ఆధారాలు సమర్పించారు. తక్షణమే కోమటిరెడ్డి పై తమ సభాహక్కుల ఉల్లంఘన నోటీసును అనుమతించాలని కోరారు.

ఇంటి స్థలాల కోసం జర్నలిస్టుల ప్రత్యక్ష పోరు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఖచ్చితంగా ఇస్తున్నట్లు నమ్మబలికి పదేళ్ల పుణ్యకాలం గడిపేసింది. తీరా గడచినా ఎన్నికల్లో అందరి శాపం తగిలి కేసీఆర్ ప్రభుత్వం కోల్పోయి మాజీ అయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు ఇస్తానని చెప్పి ఏడాది కాలం దాటినా కార్యచరణలో విఫలమవుతుంది. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జర్నలిస్టులు టెంట్ వేసి నిరాహార దీక్షబూనారు. దశాబ్దాలుగా ఈ వృత్తిని నమ్ముకొని అనేకమంది పేద, మధ్యతరగతి జర్నలిస్టులు కనీసం సొంతిల్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. అద్దెలు కట్టుకోలేక అనేక మంది ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటూ కుటుంబాలు లాగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై చాలా ఆశలు పెట్టుకున్నప్పటికీ ఇళ్ల స్థలాలు అందించే విషయంలో మీనమేషాలు లెక్కించటం బాధాకరంగా మారింది. కార్యాచరణ ఏమి సమీప దూరంలో కనిపించకపోవడంతో గతిలేక ప్రత్యక్ష ఉద్యమానికి దిగాల్సి వచ్చిందని యూనియన్ నాయకులు చెప్తున్నారు. నిరాహార దీక్ష చేస్తున్న జర్నలిస్టులకు శనివారం న్యూడెమొక్రసీ, ప్రజా సంఘాలు సంఘీభావం వ్యక్తం చేసి మద్దత్తు తెలిపారు. దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్ట్ ల కోసం 10 ఎకరాల స్థలం కేటాయించి పంపిణీ చేయలేదన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థలంలొ గజానికి రూ.4 వేలు చొప్పున కట్టాలని ఆంక్షలు పెడుతుందని ఆరోపించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా గతంలో కేటాయించిన తరహాలోనే ఇళ్ల స్థలాలు అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక వ్యవస్థలో వీరిని ఆదరించకుండా నిర్లక్ష్యం చేయటం మంచిది కాదన్నారు. ప్రజలకోసం నిస్వార్థంగా పనిచేసే జర్నలిలిస్టు లకు ఎలాంటి ఆంక్షలు లేకుండా స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఐ ఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్. సంజీవ్, పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి ప్రణయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయానికెళ్లే బీటి రోడ్డు నిర్మించాలి

విశాలాంధ్ర - గార్ల : మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం గ్రామ సమీపంలోని కొండలమ్మ తల్లి ఆలయంకు వెళ్లే దారిలో కంకర పోసిన అధికారులు రోడ్డు నిర్మాణ పనులను మరిచిపోయారని సిపిఎం మండల నాయకులు వంగూరి వెంకటేశ్వర్లు, మల్లెల నాగమణి విమర్శించారు. శనివారం అసంపూర్తిగా, కంకర దేలి ఇబ్బంది కరంగా ఉన్న ఈ రోడ్డుపై సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకతీయుల కాలంలో నిర్మించిన పురాతనమైన కొండలమ్మ తల్లి ఆలయంలో ఉగాది పండుగను ప్రతి ఏటా నాలుగు రోజులపాటు ప్రజలు ఘనంగా జాతర నిర్వహిస్తారన్నారు. జాతర సమిపిస్తున్నప్పటికి రోడ్డు పనులు పూర్తిచేయకపోవడం విచారకరమన్నారు. జాతరలో భక్తులకు అంతరాయం కలగకుండా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సంబంధిత అధికారులు స్పందించి బీటి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంగూరి కొండయ్య, మాజీ ఎంపీటీసీ వి. పద్మ, కె. బాల, వీరభద్రం, మంగమ్మ, నాగమణి, సరోజ, సాయి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యం, దేశ అస్థిత్వాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మతసామరస్యం తోపాటు దేశస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సంకు సంకుబాపన అనుదీప్ అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం పెనుగడప మదీనా మస్జీద్లో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రేమ, కరుణ, శాంతి, సహనం, క్రమశిక్షణ, సమానత్వం, సోదరభావం, ధార్మిక చింతనల ప్రతిరూపం పవిత్ర రంజాన్ మాసం అన్నారు. శతాబ్దాలుగా భారతదేశంలో కులమతాలకతీతంగా ప్రధాన పండుగలను సోదర భావంతో ఐక్యంగా జరుపుకుంటారని వివరించారు. రంజాన్ ఉపవాసాలను ముస్లిం సోదరులు చాలా నియమ నిష్టలతో పాటిస్తూ విశ్వమానవ కళ్యాణం కోరు కుంటూ సృష్టికర్తలు ఆరాధిస్తారని తాము దగ్గరగా ఈ క్రతువులను చూస్తున్నామన్నారు. మత రాజకీయాల వల్లనే పరస్పర సోదర భావం ఐక్యత దెబ్బతింటున్నట్లు విమర్శించారు. విచ్చిన్నకర శక్తులకు దూరంగా ఉంటూ సత్ సమాజ నిర్మాణం కోసమే అందరూ పాటుపడాలని అనుదీప్ కోరారు. ఈ సందర్భంగా మస్జీద్ కమిటీ సభ్యులు ఆత్మీయంగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అహ్మద్, కట్ట వీరభద్రం, కలకోటి ఐలయ్య, మన్నె రమేష్, ముజ్జు, మత పెద్దలు ఖలీల్ మియా, షబ్బీర్, గోరే బాబా, నసీరుద్దీన్, యాకుబ్, అస్గర్, హలీం మియా, సుభాని, యాకూబ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం ఉద్యోగులకు గంట వెసులుబాటు ఇవ్వాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి రంజాన్ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులైన ముస్లిం లకు ఉపవాస విరమణ కోసం సాయంత్రం 4:30 కె విధుల నుంచి వెళ్ళిపోవచ్చనీ గత నెల ఫిబ్రవరి 15 న సర్క్యులర్ జారీ చేశారు. కానీ కొత్తగూడెం ఏరియాలోని సింగరేణి ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులకు రంజాన్ మాసం 20 రోజులు గడిచిన సాయంత్రం గంట ఇఫ్తార్ కోసం వెసులుబాటు ఇవ్వలేదని ముస్లిం ఉద్యోగుల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది. కనీసం ఇపుడు రంజాన్ నెల చివరి అంకంలో ఉందని ఆఖరి ఈ 10 రోజుల్లో నైనా సాయంత్రం గంట ముందు విధుల నుంచి మస్జీద్ కు వెళ్లే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ రంజాన్ చివరి 10 రోజులు చాలా ప్రాముఖ్యత ఉంటుందని, రోజు విడిచి రోజు 5 (రాత్రులు) జాగారాలు ఉంటాయని, వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే ముస్లిం ఉద్యోగులు ఏరియా జిఎం షాలేం రాజు కు రాతపూర్వకంగా అభ్యర్థన పత్రం ఇచ్చినట్లు చెప్తున్నారు. సింగరేణి లోని కొన్ని డిపార్ట్మెంట్లో మినహాయింపు ఇచ్చారని ఏరియాలో తమకు మాత్రమే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేటర్ సొంత నిధులతో పవర్ బోరు వాల్స్ మరమ్మతులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నానని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. శనివారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పాడైపోయిన పవర్ బోర్వెల్స్ను తన సొంత నిధులతో ఆమె మరమతులు చేయించి బోర్ వాటర్ అందరికి అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, పార్టీ నేతలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంపాదకీయం

న్యాయమూర్తుల అన్యాయ వర్తన

రచ్చబండ మీద కూర్చుని న్యాయం చెప్పే వారిని కూడా అపారంగా గౌరవించే సంప్రదాయం మనది. గ్రామ స్థాయిలో న్యాయకోసం ఎవరైనా ఈ రచ్చబండ పంచాయితీ పెద్దలను ఆశ్రయించక తప్పేది కాదు. ఒక గ్రామం తగవు ఆ ఊళ్లోనే పరిష్కారం కావాలన్న కట్టుబాటు వల్ల రచ్చబండ న్యాయానికి చాలా ప్రాధాన్యం ఉండేది. బ్రిటీష్ వారి హయాంలో క్రమంగా కోర్టులు వెలిశాయి. ఈ కోర్టులు వెలిసిన కొత్తలో కూడా న్యాయమూర్తుల అవినీతి గురించి బోలేడు వార్తలు వినిపించేవి.

అంతకు ముందున్న రచ్చబండమీద కూర్చుని న్యాయం చెప్పేవారిలో పక్షపాతం అసలే లేదని, ఆ న్యాయం తిరుగులేనిదని కాదు కానీ విశ్వాసం ప్రజలను నడిపించేది. న్యాయవ్యవస్థ వచ్చిన తరవాత విద్యార్హత ఉన్న వారే న్యాయమూర్తులుగా ఉండే పరిస్థితి వచ్చింది. రచ్చబండ న్యాయంలో తీర్పు చెప్పే వారి బుర్రకు తోచిందే న్యాయంగా ఉండేది. కోర్టులు వచ్చిన తరవాత న్యాయశాస్త్రం అధ్యయనం చేసిన వారు తప్పుచేయరు అన్న అభిప్రాయం ఉండేది. కానీ ఈ నమ్మకం సడలడానికి ఎక్కువ కాలం పట్టలేదు. న్యాయమూర్తిని సాక్షాత్తు దేవుడిగా కూడా భావించే వారు. పరిస్థితి ఎన్నడూ అలా లేదు. న్యాయం చెప్పడం కూడా ఇప్పుడు ఒక వృత్తి. ఈ వృత్తిలో ఉన్న వారికి కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి. కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. కొన్ని వృత్తి పరమైన ప్రమాణాలూ ఉంటాయి. వీటికి నిబద్ధమై పని చేసిన న్యాయమూర్తులూ ఉన్నారు. సొంత లాభం కోసం, లేదా ఆశ్రిత పక్షపాతంతో ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారూ ఉన్నారు. కానీ ఇటీవల కొందరు హైకోర్టు న్యాయమూర్తుల ప్రవర్తన కళ్లు బైర్లు కమ్మేలా చేస్తోంది. ఇలాంటి వారికి ఏ నియమాలూ వర్తించడం లేదు. న్యాయం చెప్పే వారూ మనుషులే కనక, వారూ ఈ సమాజంలో భాగస్వాములే కనక మనిషికి ఉండే గుణావగుణాలు, సమాజంలోని రుగ్మతల ప్రభావం న్యాయమూర్తుల మీద కూడా పడుతుంది. వ్యవస్థ పదిలంగా లేనప్పుడు ఈ అవలక్షణాలు మరీ కొట్టొచ్చినట్టు బయటపడ్తాయి. వ్యవస్థ పకడ్బందీగా ఉంటే ఆ వ్యవస్థలో పని చేసే వారి లోపాలను సరిదిద్దే అవకాశం ఉంటుంది. బాగా పని చేస్తున్న వారి కౌశలాన్ని ఇనుమడింప చేసే వీలూ ఉంటుంది. కానీ వ్యవస్థే కుళ్లి పోయినప్పుడు వ్యవస్థ బండారం బయట పడ్తుంది. ఇటీవలి కాలంలో ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తుల నడవడిక పెద్ద ఎత్తున దుమారం రేపింది. గత సంవత్సరం చివరలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ యాదవ్ విశ్వ హిందూ పరిషత్తు సభలో ప్రసంగిస్తూ రాజ్యాంగ విరుద్ధమైన వ్యాఖ్యలు చేశారు. 2024 డిసెంబర్ 8 న శేఖర్ యాదవ్ విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన సభలో చేసిన ప్రసంగం విద్వేష ప్రసంగానికి ఏ మాత్రం తీసిపోదు. ఆయన ఉమ్మడి పౌర స్మృతి గురించి మాట్లాడుతూ "మా భగవద్గీత, మీ ఖురాన్" అనడం ఆయన చూపిన మత వివక్షకు నిదర్శనం. ఆయన ఖట్ ముల్లా (పాఖండుడు) అన్న మాట కూడా వాడారు. ఆయనను పదవి నుంచి తొలగించేందుకు (ఇంపీచ్ చేసేందుకు) ప్రతిపక్ష సభ్యులు నోటీసు కూడా అందజేశారు. ఒక న్యాయమూర్తిని ఇంపీచ్ చేయడం పెద్ద ప్రక్రియ. అది తేలడానికి చాలా సమయం పట్టొచ్చు.

అదే అలహాబాద్ హైకోర్టు మరో న్యాయమూర్తి రాం మనోహర్ నారాయణ్ మిశ్రా న్యాయమూర్తిగా కొనసాగడానికి అసలు ఆయనకు అర్హత ఉందా అన్న అనుమానం కలిగే రీతిలో మాట్లాడారు. ఒక పదకొండేళ్ల బాలికపై పోస్కో చట్టం కింద దాఖలైన కేసును విచారిస్తూ "స్థనాలు తాకడం, పైజామా బొందులు విప్పడం అత్యాచారం కాదు" అనడం మొత్తం సమాజమే అవాక్కయ్యేట్టు చేసింది. మరి అత్యాచారం అంటే ఇంకా ఏం జరగాలి అన్న ప్రశ్న ఉదయించింది. భారత శిక్షా స్మృతిలోని ఏదో ఓ సెక్షన్ రాం మనోహర్ నారాయణ్ మిశ్రా వాదనను సమర్థించవచ్చు. కానీ ఇలాంటి మాటలు నిండు కోర్టులు మాట్లాడినప్పుడు న్యాయమూర్తి వివేకం ఏమయింది అన్న ప్రశ్న తప్పని సరిగా ఎదురవుతుంది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందిరా జై సింగ్, శోభా గుప్తా న్యాయమూర్తి రాం మనోహర్ నారాయణ్ మిశ్రా వ్యాఖ్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా ఈ వ్యాఖ్యలపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సదరు న్యాయమూర్తి అసలు పోస్కో చట్టాన్ని సరిగ్గా చదివారా లేదా అన్న అనుమానం వస్తోంది. కనీసం అందులోని 29,30 సెక్షన్లనైనా అర్థం చేసుకున్నారా అని నిలదీయక తప్పదు. ఈ ఇద్దరు న్యాయమూర్తుల మీద సుప్రీంకోర్టు గట్టి చర్యలేవీ తీసుకోలేదు. ఏకపక్షంగా సుప్రీంకోర్టు ఇలాంటి న్యాయమూర్తులను తొలగించే అవకాశం లేదు. కానీ వారిని మరొక పద్ధతిలో శిక్షించే అవకాశం లేకపోలేదు. వారికి పని అప్పగించకుండా ఉండొచ్చునని చాలా మంది న్యాయకోవిదులు సూచించారు. కానీ సుప్రీంకోర్టు గాడి తప్పిన, విద్వేష ప్రసంగాలకు ఒడిగడ్తున్న న్యాయ మూర్తులని మరో చోటికి బదిలీ చేసి తన పనై పోయిందనుకుంటోంది. దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ఆ మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఆయన ఇంట్లో ఎక్కడ చూస్తే అక్కడ కట్టలు కట్టలు డబ్బు కనిపించింది. ఇంత డబ్బు ఎక్కడిది అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. సుప్రీంకోర్టు ఆయన మీద తీసుకున్న చర్యల్లా ఆయనను బదిలీ చేయడం. ఇలాంటి బదిలీలు వారు బదిలీ అయిన కోర్టులు చెత్తబుట్టల్లాంటివని నిరూపించడానికి పనికొస్తాయి తప్ప ఎంత మాత్రం శిక్షలు కావు. న్యాయ మూర్తి శేఖర్ యాదవ్, న్యాయమూర్తి యశ్వంత్ యాదవ్ మీద విచారణకోసం సుప్రీంకోర్టు అంతర్గత విచారణకు కమిటీలు ఏర్పాటు చేసింది. ఇదీ అసలు విషయానికి మసి పూసి మారేడుకాయ చేయడానికేనన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. శేఖర్ యాదవ్ అయితే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధపడ్డారట. భారీగా డబ్బు కట్టలు దొరికిన న్యాయమూర్తి యశ్వంత్ యాదవ్ దగ్గర అంత డబ్బు ఎక్కడిది అన్న అనుమానం సహజమే. ఇది ఆయన అవినీతి ద్వారా సంపాదించిందేనా లేదా మరెవరి డబ్బు అయినా ఆ ఇంట్లో దాచారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అది కేంద్ర హోం మంత్రి అమిత్ షా డబ్బేమో అన్న అనుమానాలూ వచ్చాయి. ఈ విషయం దృఢపడకపోయినా పొగ రావడమే ఎక్కడో నిప్పు ఉందన డాన్ని నమ్మడానికి కారణం అవుతుంది. న్యాయమూర్తుల మీద ఆరోపణలు వచ్చినప్పుడు అంతర్గత దర్యాప్తు చేయడం కోసం 1990 లో సుప్రీంకోర్టు ఓ విధానం రూపొందించింది. ముగ్గురితో కూడా జ్యుడీషియల్ కమిటీ చేత దర్యాప్తు చేయిస్తారు. ఈ పరిస్థితిలో అరోపణల్లో నిజం ఉందని తేలితే ఆయన మీద చర్యలు తీసుకోవచ్చు. కడకు న్యాయమూర్తిని రాజీనామా చేయమని కూడా అడగొచ్చు. ఒక వేళ ఆ న్యాయమూర్తి రాజీనామా చేయకపోతే ఆయనకు ఏ పనీ అప్పగించకుండా ఉండొచ్చు.

భద్రతా మండలిలో సంస్కరణలు జరిగేనా!

కనుమ ఎల్లారెడ్డి

1945 అక్టోబర్ 24న ఏర్పడిన ఐక్యరాజ్య సమితి ఏర్పడిన నాటి నుంచి కేవలం ఐదు దేశాలు మాత్రమే శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్నాయి. దాదాపు సమితి ఏర్పడి 80 సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు శాశ్వత సభ్య దేశంగా ఆరవ దేశాన్ని చేర్చుకోకపోవడం శోచనీయం. ఐక్యరాజ్య సమితిలో కనీసం 10 దేశాలయినా శాశ్వత సభ్యత్వం కలిగి ఉండాలి. అగ్రరాజ్యం ఈ విషయంలో చొరవ చూపాలి. ఐక్యరాజ్య సమితి మొత్తం అమెరికా చుట్టే తిరుగుతూ ఉంటుంది. అమెరికా తలచుకుంటే 6 వ, 7 వ దేశాలుగా భారత్, దక్షిణాఫ్రికా సిద్ధంగా ఉన్నాయి. మిగతా దేశాల మాటేమో కాని భారత్ చేరికపై ప్రయత్నాలు జరుగుతున్నా, తెరపై పేరు వచ్చినా కొన్ని రాజకీయాలు పొడచూపడం, ముఖ్యంగా చైనా, పాక్ అడ్డుపడటం తెలిసిందే. పొరుగున ఉన్న పాక్‌కు భారత్‌కు శాశ్వత సభ్యత్వ విషయం సహించలేదు. భారత్‌కు శాశ్వత సభ్యత్వం రాకుండా రాజకీయం చేస్తోంది. రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ భారత్‌ను ఆహ్వానిస్తాయి. రష్యా మాత్రం భారత్ చేరికకు ఎప్పటికీ మద్దతుగానే ఉంటోంది. ఎన్నో సార్లు భారత్ భద్రతా మండలిలో చేరాలి అని సూచించింది. భారత్ చేరిక గతంలో ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడే జరగాల్సింది. ట్రంప్ ఇప్పుడు మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఉన్నారు కనుక 6 వ దేశంగా భారత్ చేరాలి అనే ప్రకటన చేయాలి. ఇప్పటికే ఎన్నో సంస్కరణలు చేస్తున్న ట్రంప్ భద్రతా మండలిని కూడా ప్రక్షాళన చేయాలి.

ఉక్రెయిన్‌కు, హమాస్‌కు మధ్య కాల్పులు ఆగాలి. శాంతి కోసం మనం ప్రయత్నం చేయాలి అని ట్రంప్ ఉద్దేశంగా ఉంది. ఆ దిశలో ప్రయత్నాలు చేసినా, హమాస్ పెడచెవిన పెడుతోంది. ఉక్రెయిన్ పూర్తిగా అమెరికా అదుపు, ఆజ్ఞలో ఉంది. ట్రంప్ మాట వినక పోతే ఇక హమాస్ కొన్ని చిక్కులు ఎదుర్కోక తప్పదు. ఆది తెలిసే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కి అమెరికా చెప్పినట్లు నడుచుకునే స్థాయికి వచ్చాడు. ఇక్కడ రష్యా కూడా ట్రంప్ చెప్పినట్లు కాల్పుల విరమణ ఆపాలి. రెండు దేశాలు కూడా విశ్వంలోనే పెద్దవిగా ఉన్నాయి ట్రంప్ రష్యా వైపే మొగ్గు చూపుతున్నారు. చిన్న దేశమైన ఉక్రెయిన్ అభివృద్ధి చెందాలన్నా, మౌలిక వసతులు సమకుర్చుకోవాలన్న, అమెరికా అండ ఎప్పటికీ ఉండాలన్నా అమెరికా చెప్పినట్లు నడచుకోవాలి. అదే ఉక్రెయిన్ దేశానికి ఉత్తమం.

అమెరికా చొరవ తీసుకుంటేనే భారత్‌కు మార్గం సుగమం కావొచ్చు. ట్రంప్, మోదీ ఇద్దరూ స్నేహితులు కనుక భారత్ చేరికకు ఏ దేశం అడ్డు చెప్పే సాహసం చేయదు. ఒక వేళ ఏ దేశమైనా అడ్డు చెబితే అమెరికా సహించదు. భద్రతా మండలిని సంస్కరించడం ట్రంప్ తోనే సాధ్యం. అన్ని హంగులు భారత్‌కు ఉన్నా భద్రతా మండలిలో రాజ్యాల అనైక్యతతో చర్చకు వచ్చి మరుగున పడింది. ముఖ్యంగా 'వీటో 'పవర్ అడ్డు వస్తోంది. ఈ వీటో పవర్‌ను అమెరికా తీసుకుంటేనే మంచిది. అయితే మిగతా దేశాలు ఒప్పుకోవు కనుక వీటో అధికారం ఆయా రాజ్యులకు కొనసాగుతా వుంది.

అన్ని దేశాలు ఓకే మాట మీద నిలబడితే భారత్ చేరిక సులువు అవుతుంది. ట్రంప్ రావడంతో 6 వ దేశంగా భారత్ చేరికకు ఏ డోకా ఉండదు. ట్రంప్ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయే లోపు భారత్‌ను భద్రతా మండలిలో 6 వ దేశంగా చేరుస్తాడేమో చూద్దాం, రాబోయే కొద్ది నెలలలో కాని రెండు, మూడు సంవత్సరాలలో కాని భారత్ ఖచ్చితంగా భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరుతుందని ఆశిద్దాం.

9391523027

భగత్ సింగ్ జైలు నోట్‌బుక్ కథ

కల్పనా పాండే

భగత్‌సింగ్, ఆయన సహచరులు సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా, భగత్‌సింగ్ జైలు డైరీని క్లుప్తంగా పరిశీలిద్దాం. 1929 సెప్టెంబర్ 12 న జైలు అధికారులు భగత్‌సింగ్‌కు డైరీని ఇచ్చారు. దానిపై "భగత్ సింగ్ కోసం 404 పేజీలు" అని రాశారు. అతని జైలు శిక్ష సమయంలో, అతను కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, లెనిన్‌తో సహా 108 వేర్వేరు రచయితలు రాసిన 43 పుస్తకాల ఆధారంగా ఈ డైరీలో నోట్స్ రాశారు. అతను చరిత్ర, తత్వశాస్త్రం, ఆర్థికశాస్త్రంపై విస్తృతమైన నోట్స్ తీసుకున్నారు. భగత్‌సింగ్ దృష్టి వలసవాదానికి వ్యతిరేకంగా పోరాటంపై మాత్రమే కాకుండా, సామాజిక అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై కూడా ఉంది. ప్రత్యేకంగా పాశ్చాత్య ఆలోచనాపరులను చదవడానికి మొగ్గు చూపాడు. జాతీయవాద సంకుచితత్వాన్ని దాటి, ఆధునిక ప్రపంచ దృక్పథాల ద్వారా సమస్యలను పరిష్కరించాలని వాదించాడు. ఈ ప్రపంచ దృష్టి ఆయన కాలంలో కొద్దిమంది నాయకులకు, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి వారు ఉన్నారు.

1968లో భారతీయ చరిత్రకారుడు జి. దేవల్, భగత్ సింగ్ సోదరుడు కుల్బీర్ సింగ్‌తో భగత్ సింగ్ జైలు డైరీ అసలు కాపీని చూసే అవకాశం పొందాడు. నోట్స్ ఆధారంగా, దేవల్ లిపీపుల్స్ పాత్‌లి అనే పత్రికలో భగత్‌సింగ్ గురించి ఒక వ్యాసం రాశాడు, అందులో 200 పేజీల డైరీ గురించి ప్రస్తావించాడు. అతని వ్యాసంలో, జి. దేవల్, భగత్ సింగ్ పెట్టుబడిదారీ విధానం, సోషలిజం, మార్క్సిజం, కమ్యూనిజం, మతం, తత్వశాస్త్రం, విప్లవాల చరిత్ర వంటి అంశాలపై నమోదు చేశాడు. డైరీని ప్రచురించాలని కూడా సూచించాడు, కానీ అది జరగలేదు. 1977లో, రష్యన్ పండితుడు ఎల్.వి. మిట్రోఖోవ్ ఈ డైరీ గురించి సమాచారాన్ని పొందాడు. కుల్బీర్ సింగ్ నుంచి వివరాలను సేకరించిన తర్వాత, అతను ఒక వ్యాసం రాశాడు, అది తర్వాత 1981 లో అతని పుస్తకం లెనిన్ అండ్ ఇండియాలో ఒక అధ్యాయంగా చేర్చారు. 1990లో, లెనిన్ అండ్ ఇండియా హిందీలోకి అనువదించి, మాస్కోలోని ప్రగతి ప్రకాశన్ ద్వారా లెనిన్ ఔర్ భారత్ అనే శీర్షికతో ప్రచురించారు.

మరోవైపు, 1981లో, గురుకుల్ కాంగ్రీ వైస్-చాన్సలర్ అయిన జి.బి. కుమార్ హూజా, ఢిల్లీలోని తుగ్లకాబాద్ సమీపంలోని గురుకుల్ ఇంద్రప్రస్థను సందర్శించాడు. నిర్వాహకుడు శక్తివేశ్, గురుకుల్ బేస్మెంట్లో నిల్వ చేసిన కొన్ని చారిత్రక పత్రాలను అతనికి చూపించాడు. జి.బి. కుమార్ హూజా ఈ నోట్‌బుక్ కాపీని కొన్ని రోజులు అరువుగా తీసుకున్నాడు. 1989లో, మార్చి 23 హుతాత్మ దినోత్సవం సందర్భంగా, హిందుస్తానీ మంచ్ కొన్ని సమావేశాలు నిర్వహించింది. వాటికి జి.బి. కుమార్ హూజా హాజరయ్యాడు. అక్కడ, ఆయన ఈ డైరీ గురించి సమాచారాన్ని పంచుకున్నాడు. దాని ప్రాముఖ్యతతో ఆకట్టుకున్న హిందుస్తానీ మంచ్, దానిని ప్రచురించాలని నిర్ణయించింది.

ఈ బాధ్యత భారతీయ పుస్తక క్రానికల్ (జైపూర్) సంపాదకుడు భూపేంద్ర హూజాకు, హిందుస్తానీ మంచ్ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఓబెరాయ్, ప్రొఫెసర్ ఆర్.పి. భట్నాగర్, డాక్టర్ ఆర్.సి. భారతీయ మద్దతుతో ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు వల్ల దాని ప్రచురణ జరగలేదు. వారు దాని ప్రాముఖ్యతను గుర్తించడంలో విఫలమయ్యారని లేదా సరళంగా ఆసక్తితో లేకపోయారని నమ్మడం మరింత సాధ్యమైనది. అదే సమయంలో, డాక్టర్ ప్రకాష్ చతుర్వేదీ మాస్కో ఆర్కైవ్స్ నుంచి టైప్‌రైటెన్ ఫోటోకాపీని పొంది, డాక్టర్ ఆర్.సి. భారతీయకు చూపించాడు. మాస్కో కాపీ, గురుకుల్ ఇంద్రప్రస్థ బేస్మెంట్ నుంచి పొందిన చేతివ్రాత కాపీతో పదం పదంగా ఒకే విధంగా ఉంది. కొన్ని నెలల తర్వాత, 1991లో, భూపేంద్ర హూజా ఈ నోట్‌బుక్ నుంచి సారాంశాలను భారతీయ పుస్తక క్రానికల్‌లో ప్రచురించడం ప్రారంభించాడు. దీనితో షహీద్ భగత్‌సింగ్ జైలు నోట్‌బుక్ మొదటిసారిగా పాఠకులకు చేరువయింది. దీనితో పాటు, ప్రొఫెసర్ చమన్‌లాల్, దిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియంలో ఇలాంటి కాపీని చూశానని హూజాకు తెలియజేశాడు.

1994లో జైలు నోట్‌బుక్ చివరకు భారతీయ పుస్తక క్రానికల్ ద్వారా పుస్తక రూపంలో ప్రచురించారని, భూపేంద్ర హూజా, జి.బి. హూజా రాసిన ముందుమాటలో తెలిపారు. వారిలో ఎవరికీ పుస్తకం అసలు కాపీ భగత్ సింగ్ సోదరుడు కుల్బీర్ సింగ్‌దని తెలియదు. అంతేకాక, భగత్ సింగ్ సోదరి బిబి అమర్ కౌర్ కుమారుడు డాక్టర్ జగ్మోహన్ సింగ్, జైలు నోట్‌బుక్ గురించి ఎప్పుడూ ప్రస్తావించలేదు. భగత్‌సింగ్ సోదరుడు కుల్తార్ సింగ్ కుమార్తె విరేంద్ర సంధు, భగత్ సింగ్‌పై రెండు పుస్తకాలు రాశారు. కానీ ఆమె కూడా ఈ డైరీని సూచించలేదు. కుల్బీర్ సింగ్ డైరీని కలిగి ఉన్నప్పటికీ, ఆయన దానిని చరిత్రకారులతో పంచుకోవడానికి, పుస్తకంగా ప్రచురించడానికి లేదా వార్తాపత్రికల్లో విడుదల చేయడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. భారతీయ చరిత్రకారులు ఈ ముఖ్యమైన చారిత్రక పత్రాన్ని నిర్లక్ష్యం చేయడం విచారకరం.

భగత్‌సింగ్ పరిశోధన కమిటీని స్థాపించిన తర్వాత, భగత్‌సింగ్ మేనల్లుడు డాక్టర్ జగ్మోహన్ సింగ్, జేఎన్‌యూ భారతీయ భాషల కేంద్రం నుంచి ప్రొఫెసర్ చమన్‌లాల్, 1986లో భగత్‌సింగ్ ఔర్ ఉన్కే సాథియోన్ కే దస్తావేజ్ అనే శీర్షిక కింద భగత్‌సింగ్, అతని సహచరుల రచనలను సంకలనం చేసి మొదటిసారి ప్రచురించారు. 1991లో రెండవ ఎడిషన్‌లో మాత్రమే అది సూచించారు. ప్రస్తుతం, ఈ పుస్తకం మూడవ ఎడిషన్ అందుబాటులో ఉంది.

ఈ పుస్తకంలో రవీంద్రనాథ్ టాగోర్ ప్రకటనను కూడా ఉదహరించాడు. అందులో జపనీయుల డబ్బు పట్ల ఆశ "మానవ సమాజానికి భయానకమైన ముప్పు" అని వివరించారు. అంతేకాక, మారిస్ హిల్క్విట్ మార్క్స్ టు లెనిన్ నుంచి బూర్జువా పెట్టుబడిదారీ విధానాన్ని సూచించారు. నాస్తికుడిగా, భగత్ సింగ్ "మతం స్థాపిత క్రమానికి మద్దతుదారు: బానిసత్వం" అనే శీర్షిక కింద "బైబిల్ పాత, కొత్త నిబంధనలలో, బానిసత్వం ఆమోదించబోదని, దేవుని శక్తి దానిని ఖండించదు" అని రికార్డ్ చేశారు. మతం ఉద్భవం, దాని పనితీరుకు వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, ఆయన కారల్ మార్క్స్ వైపు మళ్లారు. హెగెల్ న్యాయ తత్వశాస్త్రం సంశ్లేషణ ప్రయత్నాలు అనే శీర్షికతో ఆయన రచనలో, "మార్క్స్ మతం పై ఆలోచనలు" అనే ఉప శీర్షిక కింద, ఆయన ఇలా రాశాడు:

"మనిషి మతాన్ని సృష్టిస్తాడు, మతం మనిషిని సృష్టించదు. మానవుడిగా ఉండటం అంటే మానవ ప్రపంచం, సమాజంలో భాగంగా ఉండటం. రాజ్యం, సమాజం కలిసి మతం వక్రీకృత ప్రపంచ దృష్టిని ఉత్పన్నం చేస్తాయి" పెట్టుబడిదారీ విధానాన్ని పడగొట్టి, సంప్రదాయ సోషలిజాన్ని స్థాపించడం లక్ష్యంగా పెట్టుకున్న సామాజిక సంస్కరణవాదిగా కనిపిస్తుంది. ఆయన నోట్‌బుక్‌లో, కమ్యూనిస్ట్ పార్టీ మానిఫెస్టో నుంచి అనేక ఉద్ధరణలను చేర్చాడు. ది ఇంటర్నేషనల్ గీతం పంక్తులను కూడా రికార్డ్ చేశాడు. ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచనలో, జర్మనీలో విప్లవం, ప్రతివిప్లవం గురించిన ఉద్ధరణల ద్వారా, ఆయన తన సహచరుల ఉపరితల విప్లవ ఆలోచనలను వ్యతిరేకిస్తున్నట్లు కనిపిస్తాడు.

దేశంలో మతం, కులం, గోవు పేరుతో జనసమూహం ఉరితీతలు ప్రారంభమయ్యాయి. టి. పైన్ రైట్స్ ఆఫ్ మ్యాన్ నుంచి ఆయన లేవనెత్తిన సూచనలు ఈ రోజుకు కూడా సందర్భోచితంగా ఉన్నాయి. నోట్‌బుక్‌లో, ఇలా రాశారు: "వారు జీవించే ప్రభుత్వాల నుంచే ఈ విషయాలను నేర్చుకుంటారు. బదులుగా, వారు అలవాటు చేసుకున్న శిక్షను ఇతరులపై విధిస్తారు. జనసమూహం ముందు ప్రదర్శించిన క్రూరమైన దృశ్యాల ప్రభావం వారి సున్నితత్వాన్ని మొద్దుబారుస్తుంది లేదా ప్రతీకారం కోసం కోరికను రేకెత్తిస్తుంది. సొంత భావనలు రూపొందిస్తారు."

సోషలిజం లక్ష్యం (విప్లవం), ప్రపంచ విప్లవం లక్ష్యం, సామాజిక ఐక్యత, అనేక ఇతర సమస్యలపై వివిధ రచనల నుంచి సూచనలను అందించాడు. భగత్ సింగ్ సహచరులు గమనించినట్లుగా, జైలులో ఉన్నప్పుడు ఐదు పుస్తకాలు రాశాడు. వాటి శీర్షికలు: 1. ఆత్మకథ, 2. విప్లవకారుడు, 3. భారతదేశంలో ఉద్యమాలు, 4. సోషలిజం ఆదర్శాలు, 5. మరణం గడప వద్ద. ఈ పుస్తకాలు ఆయన జైలు నుంచి విడుదలైన తర్వాత బ్రిటిష్ అధికారుల నుంచి ప్రతీకారానికి భయపడి నాశనం చేశారు.

సెల్: 9082574315

ప్రత్యామ్నాయ రాజకీయాల అన్వేషణలో

ఆర్వీ రామారావ్

మొదటి రెండు మూడు సార్వత్రిక ఎన్నికలలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిరంతరం ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం అన్వేషిస్తూనే ఉంది. ఈ ప్రయత్నాల్లో భాగంగా 1967లో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. సంయుక్త విధాయక్ దళ్ మంత్రివర్గాలు ఏర్పడ్డాయి. ఈ సంయుక్త విధాయక్ దళ్ ప్రభుత్వాలలో సీపీఐ భాగస్వామి. అప్పటి జనసంఘ్ కూడా భాగస్వామే. అయితే సంయుక్త విధాయక్ దళ్ ప్రభావం ఉత్తరాదికే పరిమితం అయింది.

ఎమర్జెన్సీ నేపథ్యంలో 1977లో భారతీయ జనసంఘ్, సోషలిస్ట్ పార్టీ, భారతీయ లోక్‌దళ్, కాంగ్రెస్ (ఒ) తో కలిసి జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ ప్రతిపక్ష కూటమిలో సీపీఐ భాగస్వామి కాదు. పదిహేనేళ్ల తరవాత తొమ్మిద్ రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. 1977లో గాని కేంద్రంలో కాంగ్రెస్‌ను గద్దె దించడం కుదరలేదు. బోఫోర్స్ కుంభకోణం తరవాత కాంగ్రెస్‌ను గద్దె దించడానికి 1989లో ప్రతిపక్షాలు మరోసారి ప్రయత్నం చేశాయి. నేషనల్ ఫ్రంట్ ఏర్పడింది. ఈ ఫ్రంట్‌కు ఎన్.టి.రామారావు అధ్యక్షులుగా ఉండేవారు. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ సమన్వయ కర్తగా ఉండేవారు. 1989 ఎన్నికలలో కాంగ్రెస్ ఓటమి పాలైంది. అప్పుడు విశ్వనాథ్ సింగ్ ప్రధానమంత్రిగా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. కానీ ఆయన ప్రభుత్వం ఏడాదైనా తిరక్క ముందే పడిపోయింది. ఆ తరవాత నేషనల్ ఫ్రంట్ తరఫున చంద్రశేఖర్ ప్రధాని అయ్యారు. అదీ కొద్ది నెలల్లోనే గద్దె దిగాల్సి వచ్చింది. నేషనల్ ఫ్రంట్‌కు సీపీఐ మద్దతు ఇచ్చింది కాని అందులో భాగస్వామి కాదు. ప్రభుత్వంలో చేరలేదు.

1996-1998 మధ్య మళ్లీ ప్రతిపక్షాల ఐక్యత అంశం చర్చకు వచ్చింది. అప్పుడు యునైటెడ్ ప్రొగ్రెసివ్ అలయన్స్ ఏర్పడింది. ఈ ఫ్రంట్ ఏర్పాటులో దక్షిణాదిలోని ప్రాంతీయ పార్టీలు కూడా కీలక పాత్ర పోషించాయి. తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు నాయుడు సమన్వయ కర్తగా ఉన్నారు. ఈ ఫ్రంట్ లోనూ సీపీఐ భాగస్వామి. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి అయింది. సీపీఐ సీనియర్ నాయకులు ఇంద్రజిత్ గుప్తా హోం మంత్రిత్వ శాఖ, చతురానన్ మిశ్రా వ్యవసాయ శాఖ నిర్వహించారు. అమెరికాతో అణు ఒప్పందంపై వివాదాలు తలెత్తడంవల్ల ఉభయ కమ్యూనిస్టు పార్టీలు యునైటెడ్ ప్రొగ్రెసివ్ అలయన్స్ (యు.పి.ఎ.) నుంచి బయటకు రావాల్సి వచ్చింది. సీపీఐ ప్రత్యామ్నాయ రాజకీయాలు కొంత కాలం కాంగ్రెస్‌ను గద్దె దించడం కోసం సాగితే ప్రస్తుతం బీజేపీని గద్దె దించేందుకు ప్రయత్నించడానికి ఉపకరిస్తున్నాయి. మతతత్వ శక్తుల నుంచి పొంచి ఉన్న ప్రమాదం గురించి కొన్ని దశాబ్దాలుగా సీపీఐ హెచ్చరిస్తూనే ఉంది. శక్తి మేరకు పోరాడుతూనే ఉంది. ఇప్పుడు ప్రత్యక్షంగా ఆ పోరాటం కొనసాగించవలసిన పరిస్థితి ఉంది.

ప్రత్యామ్నాయ రాజకీయాలు లోలకంలా ఒకప్పుడు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, కొంతకాలం బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం జరపవలసి వస్తోంది. దీన్ని బట్టి ఈ రెండు పక్షాలకు ప్రత్యామ్నాయం అవసరం అని తేలిపోతోంది. ఆ



దశ వచ్చే దాకా వేచి చూడవలసిందే. వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఐక్యమైతే తప్ప అసలైన ప్రత్యామ్నాయం రూపుకట్టదు.

జనవాణి

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలి సంవత్సరాలలో ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థలు అధిక ఫీజు వసూలు చేయడం ఆందోళనకరంగా మారింది. ఇటువంటి దుష్ప్రవర్తనను అరికట్టే లక్ష్యంతో నిర్మాణాత్మక ఫీజు వ్యవస్థను అమలు చేయడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, పాఠశాలలు నిర్దేశించిన పరిమితుల కంటే ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నాయన్నది బహిరంగ సత్యం. ఈ సమస్య తల్లిదండ్రులపై, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారంగా మారింది. విద్యా హక్కు చట్టంలో పొందుపరచినట్లుగా విద్య అనేది ప్రాథమిక హక్కు అయినప్పటికీ ఉన్నతమైన నాణ్యత గల విద్యను అందిస్తున్నట్లు భావించే ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన పరిమితులను మించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈ రుసుములలో ట్యూషన్ ఫీజు మాత్రమే కాకుండా అదనపు ఖర్చులు, అంటే పాఠ్యేతర కార్యకలాపాలు, వార్షిక ఛార్జీలు, అభివృద్ధి రుసుములు, ట్యూషన్‌లో చేర్చవలసిన సౌకర్యాల కోసం దాచిన ఖర్చులు కూడా ఉంటాయి.విశాఖపట్నం, విజయవాడ ఇతర పట్టణ ప్రాంతాలలో, జీవన వ్యయం పెరుగుతూనే ఉంది, కుటుంబాలు తమ పిల్లల విద్య, ఆర్థిక డిమాండ్లను తీర్చడానికి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ ఆర్థిక ఒత్తిడి విద్యార్థులను మాత్రమే కాకుండా కుటుంబం మొత్తం శ్రేయస్సును ప్రభావితం చేసే విధంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన రుసుం నిర్మాణాన్ని ప్రవేశపెట్టడం ద్వారా పాఠశాల రుసుములను నియంత్రించడానికి ప్రయత్నించినప్పటికీ, కఠినమైన పర్యవేక్షణ, అమలు లేకపోవడం వల్ల అనేక ప్రైవేట్ పాఠశాలలు ఈ నిబంధనలను పక్కన పెట్టేశాయి. సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం వలన , ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్దేశించిన పరిమితుల కంటే ఎక్కువగా వసూలు చేస్తూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నిబంధనలను అమలు చేయడానికి చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రైవేట్ సంస్థల ఫీజు వసూలు పద్ధతులను క్రమం తప్పకుండా తనిఖీ చేయడానికి ఒక బలమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నిర్దేశించిన ఫీజు నిర్మాణాన్ని ఉల్లంఘించిన పాఠశాలలకు భారీ జరిమానాలు లేదా వాటి నిర్వహణ లైసెన్స్‌లను రద్దు చేయడం లాంటి చర్యలు తీసుకోవాలి.ఈ విధానం ద్వారా అనైతిక ఫీజు వసూళ్లకు పాల్పడే పాఠశాలల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. ఫీజు నియంత్రణ చర్యలు తప్పనిసరి అయినప్పటికీ, అవి మాత్రమే దీర్ఘకాలికంగా ఈ సమస్యను పరిష్కరించడంలో సరిపోవు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థల ఫీజు నిర్మాణాలను నియంత్రించే అధికారిక చట్టాన్ని ప్రవేశపెట్టడం అత్యవసరం. అటువంటి చట్టం ఫీజు వసూలు పద్ధతుల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చేస్తుంది. అదనంగా, అన్యాయమైన ఫీజు పెంపుదల లేదా ఫీజు సంబంధిత వివాదాలు ఏవైనా తల్లిదండ్రులు ప్రభుత్వానికి నివేదించేలా ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. పాఠశాలలు తమ ఫీజు నిర్మాణాలను తల్లిదండ్రులకు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా బహిర్గతం చేయమని కోరడం ద్వారా పారదర్శకత మరింత మెరుగుపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో విద్యా హక్కు చట్టాన్ని పూర్తిగా అమలు చేయడం చాలా ముఖ్యం. దాని పూర్తి అమలుకు రాష్ట్రంలో తగినంత పర్యవేక్షణ లేకపోవడం విచారకరం.ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యాల నుండి వచ్చిన పిల్లలకు ఉచిత విద్యను అందించడం ద్వారా ప్రైవేట్ పాఠశాలలు చట్టంలోని నిబంధనలను పాటించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

అప్పన్న గొనప, విశాఖపట్నం

జేజేపీ నేత దారుణ హత్య

చండీగఢ్: హర్యానాలోని పానిపట్ వికాస్ నగర్‌లో జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) నేత రవీందర్ మిన్నాపై కొందరు దుండగులు శుక్రవారం కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆయన మృతిచెందారు. ఈ కాల్పుల్లో మరో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, కాల్పుల విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రవీందర్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన హత్యకు కుటుంబ గొడవలు కారణమని పోలీసులు తెలిపారు. వివాదం పరిష్కారం కోసం సమావేశమైనప్పుడు ఘర్షణ చెలరేగిందని చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పానిపట్ సిటీ స్థానం నుంచి జేజేపీ అభ్యర్థిగా రవీందర్ పోటీ చేసి ఓడిపోయారు.

ఇష్టంతో పని చేస్తే సమయం ప్రశ్నే కాదు: సుధామూర్తి

న్యూఢిల్లీ: ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే సమయం ఎప్పుడూ పరిమితంగా మారదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి భార్య, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి వ్యాఖ్యానించారు. ఇటీవల పని గంటలపై నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. నా భర్త డబ్బులు లేని సమయంలో కూడా ఇన్ఫోసిస్‌ను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు అంకితభావం కలిగిన వ్యక్తులతో కలిసి 70 గంటలు అంతకంటే ఎక్కువ సమయం పని చేయడం వల్లే అది సాధ్యమైంది. నా భర్త మాత్రమే కాదు... జర్నలిస్టులు, డాక్టర్లు వంటి ఇతర రంగాల్లోని వారు కూడా 90 గంటలు పని చేస్తున్నారు. భగవంతుడు అందరికీ రోజుకు 24 గంటల సమయమే ఇచ్చాడు. దానిని మీరు ఎలా వినియోగించుకుంటారు అనేది మీ ఇష్టం' అని సుధామూర్తి పేర్కొన్నారు. నారాయణ మూర్తి ఇన్ఫోసిస్‌ను చూసుకున్నప్పుడు తాను ఇంటి బాధ్యతలు తీసుకున్నానని ఆమె గుర్తు చేసుకు న్నారు. ఆ సమయంలో తాను పిల్లలను పెంచడంతో పాటు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను తన భర్త కంటే ఓవర్‌టైమ్ పని చేస్తున్నానని, దానికి ఆయన వెనక నుంచి సపోర్ట్‌గా ఉండి ముందుకు నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మహిళ విజయం వెనక అర్థం చేసుకునే వ్యక్తి ఉంటారని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే భారత్‌లో యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలను కొందరు సమర్థించగా... మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలంటూ ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలూ సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి.

బడ్జెట్‌కు 10 వేల సూచనలు
సీఎం రేఖాగుప్తా

న్యూఢిల్లీ: త్వరలో ప్రవేశపెట్టనున్న వికసిత్ దిల్లీ బడ్జెట్ విషయంలో ప్రజల నుంచి 10 వేల సూచనలు అందినట్లు ముఖ్యమంత్రి రేఖాగుప్తా వెల్లడించారు. ఇందులో మహిళల ఆర్థిక సాధికారత, విద్య, ఆరోగ్యం, యమునా నది ప్రక్షాళన, కాలుష్యం వంటివాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె ప్రకటించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం 'ఖీర్' వేడుకతో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. దేశరాజధానిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 24 నుంచి 28 వరకు జరగనున్నాయి. మార్చి 25న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను సిద్ధం చేసే ముందు ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు తమ ప్రభుత్వం నిపుణులతో సహా సమాజంలోని వివిధ వర్గాలను సంప్రదించిందని రేఖా గుప్తా తెలిపారు.

విమానయాన సంస్థలు జవాబుదారీగా ఉండాలి: సుప్రియా సూలే

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా విమానంపై ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అసహనం వ్యక్తంచేశారు. తాను ప్రయాణించాల్సిన విమానం కోసం గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. విమానయాన సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖను కోరారు. ఈమేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'ఎయిర్ ఇండియా విమానాలు నిరంతరం ఆలస్యం అవుతున్నాయి. మేము ప్రీమియం ఛార్జీలు చెల్లిస్తాం. అయినప్పటికీ విమానాలు సమయానికి చేరుకోవు. దీని కారణంగా పిల్లలు, వృద్ధులతో సహా అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. నేను ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన విమానంలో ప్రయాణించా. దీనికోసం గంట 19 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చింది. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి ఆలస్యాలు ఆమోదయోగ్యం కావు. విమానయాన సంస్థలకు కఠినమైన నిబంధనలు విధించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని కోరుతున్నా. ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా ఆయా సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి' అని ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టుపై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. తమ చేతుల్లో లేని వివిధ సమస్యల వల్ల విమానాలు ఆలస్యం అవుతున్నాయని తెలిపింది. మీరు ప్రయాణించిన విమానానికి అలాంటి సమస్యే ఎదురైనట్లు వెల్లడించింది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని ఎక్స్ వేదికగా పేర్కొంది.

పీకల్లోతు వివాదంలో నితీశ్

జాతీయ గీతాన్ని అవమానించారంటూ ప్రతిపక్షాల మండిపాటు

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ వివాదంలో చిక్కుకున్నారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లోని ఏసీజేఎం వెస్ట్రన్ కోర్టులో నితీశ్‌పై కేసు నమోదైంది. జాతీయ గీతాన్ని అవమానించారనే అభియోగంపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 298, 352, జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక చట్టంలోని సెక్షన్లు 2, 3 కింద కేసు నమోదు చేశారు. ఈ నెల 20న పాట్నాలో సెపక్‌తక్రా ప్రపంచ కప్ మ్యాచ్ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో, జాతీయ గీతం ఆలపిస్తున్న సమయంలో పక్కనే ఉన్న ఉన్నతాధికారితో మాట్లాడినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి సామాజికమాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి. అందులో జాతీయ గీతం ప్లే అవుతుండగా నితీశ్ కుమార్ వేదికపై తన ప్రధాన కార్యదర్శితో మాట్లాడుతున్నట్లు కనిపించారు. ప్రధాన కార్యదర్శి అతన్ని ఆపడానికి ప్రయత్నించినప్పుడు... ముఖ్యమంత్రి అతని జోక్యాన్ని పట్టించుకోకుండా అధికారిని నెట్టివేస్తూ తన సంభాషణను కొనసాగించారు. తరువాత వేదికపై ఉన్న ప్రతి ఒక్కరూ జాతీయ గీతం ఆలపించేటప్పుడు శ్రద్ధగా నిలుచున్నప్పుడు... నితీశ్‌కుమార్ ముందు నిలబడి ఉన్న ప్రజలను చేతులు జోడించి పలకరించడం కనిపించింది. దీనిపై న్యాయవాదులు అజయ్ రంజన్, సూరజ్ కుమార్ ముజఫర్‌పూర్ ఏసీజేఎం వెస్ట్రన్ కోర్టులో కేసు దాఖలు చేశారు. జాతీయ గీతాన్ని అవమానించారనే ఆరోపణలపై ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ పై కేసు నమోదైంది. పక్కనే ఉన్న ఐఏఎస్ ఆఫీసర్ వారిస్తున్నా వినిపించుకోలేదని న్యాయవాది సూరజ్ కుమార్ ఆరోపించారు. ముఖ్యమంత్రి చర్య పట్ల బీహార్ మాత్రమే కాదు, దేశం మొత్తం సిగ్గుపడుతోందని న్యాయవాది మండిపడ్డారు. దీనికి సంబంధించి కోర్టులో కేసు దాఖలైందని తెలిపారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 298, 352, జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టంలోని సెక్షన్లు 2, 3 కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. జాతీయ గీతాన్ని అవమానించడం ఎవరికీ క్షమించరానిదని న్యాయవాది సూరజ్ కుమార్ అన్నారు. దీనికి గరిష్టంగా మూడు సంవత్సరాల శిక్ష విధించవచ్చు. కోర్టులో తదుపరి విచారణ తేదీని మార్చి 28గా నిర్ణయించారు. ఇదిలా ఉండగా, జాతీయ గీతాన్ని అగౌరవపరిచారనే ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని, బీహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు శుక్రవారం శాసనసభ, శాసన మండలి ఉభయ సభలలో ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపాయి. ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ నితీశ్‌కుమార్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. స్పీకర్ నంద్ కిషోర్ యాదవ్ హెచ్చరికను పట్టించుకోకుండా సభలో ఉన్న నితీశ్‌కుమార్ కు వ్యతిరేకంగా ఆర్జేడీ ఎమ్మెల్యేలు పెద్ద పెట్టున నినాదాలు కొనసాగించారు. దీంతో శాసనసభ, శాసనమండలి కార్యకలాపాలు స్తంభించాయి. సభ వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్, నితీశ్ కుమార్ జాతీయ గీతాన్ని అగౌరవపరిచారని ఆరోపించారు. ముఖ్యమంత్రి మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రశ్నలు లేవనెత్తారు. సీఎం హోదాలో ఉండి ఇలా ప్రవర్తించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. నితీశ్ ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని, వెంటనే రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేశారు.



స్పీకర్‌పై పేపర్లు విసరడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా
ఎమ్మెల్యే పాటిల్

బెంగళూరు: శాసనసభలో గందరగోళాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత బీఆర్ పాటిల్ అన్నారు. శాసనసభలో శుక్రవారం గందరగోళం కొనసాగుతుండగానే స్పీకర్‌పై బీజేపీ సభ్యులు కాగితాలు విసిరారు. దీంతో స్పీకర్ పది నిమిషాలపాటు సభను వాయిదా వేశారు. ఇదే సమయంలోనే మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే పాటిల్ మాట్లాడుతూ సభలో ఇటువంటి గందరగోళ పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. స్పీకర్‌పై పేపర్లు వేయడం సరికాదన్నారు. ఇదే విషయమై సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ బీఆర్ పాటిల్ తనకు మిత్రుడని, ఆయనతో పిలిపించి మాట్లాడుతానన్నారు. బీఆర్ పాటిల్ కలబురగి జిల్లా అళంద నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలలకే పలువురి మంత్రుల తీరును తప్పుబట్టి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. మరోసారి సీనియర్లంటే గౌరవం లేకుండా పోతోందని, హోదాలో ఉండదలచుకోలేదన్నారు. ఆయనకు సీఎం రాజకీయ సలహాదారుడి హోదాను గత ఏడాది కల్పించారు. ఇటీవలే ఆ హోదా వలన కూడా ప్రత్యేకత ఏదీ లేదనడంతో మరోసారి సలహాదారుడి నుంచి ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా కేబినెట్ హోదా కల్పించారు.

బెంగాల్‌లో బీజేపీ ర్యాలీ

కోల్‌కతా: బార్లలో పనిచేసేందుకు మహిళలకు అనుమతిస్తూ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో బిల్లును ఆమోదించడాన్ని బీజేపీ వ్యతిరేకించింది. దీనికి నిరసనగా బీజేపీ మహిళా విభాగం శనివారం ర్యాలీ నిర్వహించింది. రాష్ట్రంలోని మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలం అవుతున్నట్లు విమర్శించింది. ఉత్త కోల్‌కతాలోని కాలేజి స్క్వేర్ నుంచి బోబజార్‌లోని ఎక్సైజ్ శాఖ కేంద్ర కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించింది. బెంగాల్ ఎక్సైజ్ చట్టం, 1909ను సవరిస్తూ బార్లలో మహిళలను పని చేసేలా అనుమతిస్తూ బిల్లును బెంగాల్ అసెంబ్లీ బుధవారం ఆమోదించింది.

డీలిమిటేషన్‌పై చిత్తశుద్ధి ఉందా
పార్టీలకు ఆర్ఎస్ఎస్ ప్రశ్న

బెంగళూరు: పునర్విభజనపై చర్చిస్తున్న పార్టీలకు దానిపై నిజంగా చిత్తశుద్ధి ఉందా లేక రాజకీయ అజెండాగా దీనిని వాడుతున్నారా అని ఆర్ఎస్ఎస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ శనివారం ప్రశ్నించారు. తమిళనాడు రాజధాని చెన్నైలో ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన డీలిమిటేషన్ జేఏసీ భేటీ క్రమంలో అరుణ్ కుమార్ స్పందిస్తూ ఆయా పార్టీలు దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ నిజంగా మొదలైనదా అని ప్రశ్నించారు. 'జనగణన మొదలు కాలేదు... పునర్విభజనపై కేంద్రం చర్చలను ప్రారంభించలేదు. ఇందుకోసం ముసాయిదా చట్టం కూడా రూపొందించలేదు' అని ఆయనన్నారు. 2022లో చట్టం తెచ్చాక పునర్విభజన జరిగిందని, అంతకు ముందు 1972లో ఈ ప్రక్రియ జరిగిందని చెప్పారు. 'అనవసర సందేహాలు, అనుమానాలు నివారించాలి. ఒకరిపై ఒకరికి నమ్మకం ఉండాలి. ప్రజాస్వామ్య స్ఫూర్తితో కలిసి ముందుకెళ్లాలి. దీనిపై స్టాలిన్ తదితరులు ఆలోచించాలి' అని అరుణ్ కుమార్ వ్యాఖ్యానించారు.

అరిస్తే... గొంతునొక్కుతా!
మహిళా నిరసనకారులపై బీజేపీ నేత జులుం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో బీజేపీ నేత ఒకరు మహిళలను గొంతునొక్కుతానంటూ బెదిరించారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మెదినీపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మార్చి 21న ఖరగ్‌పూర్‌లోని ఆరో నంబర్ వార్డులో కొత్తగా నిర్మించిన రోడ్డును ప్రారంభించేందుకు బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ దిలీప్ ఘోష్ వెళ్లారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు ఆయనను చుట్టుముట్టారు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు ఎక్కడా కనిపించలేదంటూ నిరసన తెలిపారు. తమ కౌన్సిలర్ ప్రదీప్ సర్కార్ ఈ రోడ్డును నిర్మించారని అన్నారు. ప్రారంభోత్సవం కోసం ఆయన రావడంపై మహిళలు మండిపడ్డారు. కాగా, బీజేపీ నేత దిలీప్ ఘోష్ తీవ్రంగా స్పందించారు. మహిళా నిరసనకారులను తృణమూల్ మద్దతుదారులుగా ముద్రించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఎంపీలాడ్ నిధులతో ఈ రోడ్డును నిర్మించినట్లు చెప్పారు. 'మీ నాన్న డబ్బులతో కాదు. వెళ్లి ప్రదీప్ సర్కార్‌ని అడగండి' అని అన్నారు. మరోవైపు కొందరు మహిళలు ఆగ్రహించారు. తమ తండ్రి గురించి ఎందుకు ప్రస్తావించావని దిలీప్ ఘోష్‌ను నిలదీశారు. ప్రజాప్రతినిధివైన నువ్వు ఇలా మాట్లాడవచ్చా? అని ప్రశ్నించారు. దీంతో దిలీప్ ఘోష్ సహనం కోల్పోయారు. 'మీ పద్నాలుగు తరాల గురించి కూడా మాట్లాడతా. అరవకండి. మీ గొంతు నొక్కుతా' అని బెదిరించారు. ఆ మహిళలను 'తృణమూల్ కుక్కలు'గా ఆయన అభివర్ణించారు. అయితే బీజేపీ నేత దిలీప్ ఘోష్ వ్యాఖ్యలతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఆగ్రహించిన మహిళలు ఆయన కారును చుట్టుముట్టారు. ఆ వాహనంపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకోవడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బీహార్‌కు 113 ఏళ్లు

ప్రముఖుల శుభాకాంక్షలు

పాట్నా: భారత చరిత్రలో బీహార్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడే బుద్ధుడు జ్ఞానోదయం పొందాడు. పురాతన కాలంలో నలంద విశ్వవిద్యాలయాన్ని ఇక్కడే నెలకొల్పారు. చంద్రగుప్త మౌర్య, అశోకుడు వంటి గొప్ప చక్రవర్తులు బీహార్‌ను పాలించారు. ఖగోళ శాస్త్రవేత్త ఆర్యభట్ట కూడా బీహార్‌లోనే జన్మించారు. బీహార్ అద్భుతమైన వారసత్వానికి చిహ్నంగా నిలిచింది. ఏటా మార్చి 22న బీహార్ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని జరుపుకుంటారు. 1912, మార్చి 22న బెంగాల్ ప్రావిన్స్ నుంచి వేరు చేసి, బీహార్‌ను కొత్త రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. ఈ రాష్ట్రం ఏర్పడి 113 ఏళ్లు. బీహార్ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలకు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. 'పురాతన కాలం నుండి బీహార్ భూమి జ్ఞానం, అభివృద్ధికి కేంద్రంగా వెలుగొందుతోంది. బీహార్ ప్రజలు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో తమ వంతు కృషిని కొనసాగిస్తారని నమ్ముతున్నా' అని ఎక్స్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బీహార్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఇలా రాశారు: 'బీహార్‌లోని నా సోదరులు, సోదరీమణులందరికీ బీహార్ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు. భారత చరిత్ర గర్వించేలా చేసిన మన రాష్ట్రం అభివృద్ధి ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను దాటుతోంది. ఇందులో ప్రతిభావంతులైనవారు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మేము నిరంతరం ప్రయత్నిస్తాం' అన్నారు.

బీహార్ కలను సాకారం చేద్దాం: సీఎం నితీశ్

బీహార్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ' బీహార్‌కు అద్భుతమైన చరిత్ర ఉంది. మనం మన దృఢ సంకల్పంతో బీహార్‌కు అద్భుతమైన భవిష్యత్తును సిద్ధం చేస్తున్నాం. అభివృద్ధి చెందిన బీహార్ కలను సాకారం చేసుకోవడంలో మీరందరూ భాగస్వాములు కావాలని నేను పిలుపునిస్తున్నాను' అని పేర్కొన్నారు.

నాగ్‌పూర్ అల్లర్ల కారకులపై కఠిన చర్యలు: ఫడ్నవీస్

ముంబై: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఇటీవల రెండు వర్గాల మధ్య చెలరేగిన అల్లర్లలో బంగ్లాదేశీయుల హస్తం ఉందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. ప్రస్తుతం దీనిపై ఏమీ చెప్పలేమని... దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని వెనుక ఉన్న ఎవరికైనా కఠిన చర్యలు తప్పవని అన్నారు. నాగ్‌పూర్‌లో జరిగిన హింసకు సంబంధించిన కారణాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ సమక్షంలో పోలీసు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. హింసకు కారణమైన వారినుంచే ఆస్తి నష్టం మొత్తాన్ని వసూలు చేస్తామని ఫడ్నవీస్ పేర్కొన్నారు. డబ్బు చెల్లించని పక్షంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని విక్రయిస్తామని అన్నారు. 'మతపరమైన వస్తువులు దహనం చేసినట్లు కొంతమంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు పుకార్లు వ్యాప్తి చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి కారణమైన 104 మందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వదంతులు వ్యాప్తి చేసి... అల్లర్లకు కారణమైన వారిని కూడా నిందితులుగా పరిగణిస్తాం. ఇప్పటి వరకు 66 పోస్టలను తొలగించాం' అని అన్నారు. ఈ నెల 17న నాగ్‌పూర్‌లో కొందరు మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. కొందరు ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టేలా నినాదాలు చేయడంతో హింసాత్మకంగా మారింది. ఘర్షణలో 34 మంది పోలీసులు గాయపడ్డారని, ఇందులో ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. అల్లర్ల వెనుక బంగ్లాదేశీయుల హస్తం ఉండి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సజీవంగా తిరిగి వచ్చిన 'హత్యకు గురైన మహిళ'

భోపాల్: హత్యకు గురైందని నిర్ధారించిన మహిళ ఏడాదిన్నర తర్వాత సజీవంగా ఇంటికి తిరిగి వచ్చిన సంఘటన మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ జిల్లాలో నెలకొంది. వివరాల్లోకి వెళితే... 2023 సెప్టెంబరులో గాంధీ సాగర్ ప్రాంతంలో నివసించే లలితా బాయి(35) అదృశ్యమైంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ముఖం ఛిద్రమైన ఓ మహిళ మృతదేహాన్ని లలిత కుటుంబానికి పోలీసులు చూపించారు. చేతిపై పచ్చబొట్టు, కాలికి నల్లటి దారం వంటి గుర్తుల ఆధారంగా ఆమె తన కుమార్తె అని తండ్రి గుర్తించాడు. ఆ తర్వాత మృతదేహానికి అంత్యక్రియలు కూడా నిర్వహించారు. ఆ మహిళ హత్య కేసుకు సంబంధించి నలగురు అనుమానితులైన ఇమ్రాన్, షారుక్, సోనూ, ఎజాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా, రెండు రోజుల కిందట లలితా బాయి తన ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె సజీవంగా ఉండటం చూసి తండ్రి, కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. తల్లి తిరిగి రావడం తో ఆమె ఇద్దరు పిల్లలు సంతోషం పట్టలేకపోయారు. లలితా బాయి తన తండ్రితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. ఏడాదిన్నర కిందట షారుక్ అనే వ్యక్తితో కలిసి భానుపరాకు తాను వెళ్లినట్లు పోలీసులకు చెప్పింది. అక్కడ రెండు రోజులు ఉన్నానని, ఆ తర్వాత రూ.ఐదు లక్షలకు మరో వ్యక్తికి అతడు అమ్మినట్లు చెప్పింది. రాజస్థాన్‌లోని కోటాకు తనను తీసుకెళ్లగా ఏడాదిన్నర కాలంగా అక్కడ నివసించినట్లు లలిత వివరించింది. చివరకు తప్పించుకుని తన గ్రామానికి తిరిగి చేరుకున్నట్లు ఆమె వెల్లడించింది. తన గుర్తింపును నిర్ధారించేందుకు ఆధార్, ఓటర్ ఐడీ వంటి పత్రాలను లలితా బాయి స్థానిక పోలీసులకు చూపించింది. ఇది తెలుసుకుని పోలీసులు షాక్ అయ్యారు. పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అలాగే హత్యకు గురైన మహిళ ఎవరు అన్నది దర్యాప్తు చేస్తున్నారు. జైల్లో ఉన్న నిందితుల విడుదల గురించి పరిశీలిస్తున్నారు.

దిల్లీ కార్పొరేషన్‌కు 14 మంది ఎమ్మెల్యేలు
ఎన్నికలకు ముందు స్పీకర్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2025-26 సంవత్సరానికి గాను 14 మంది ఎమ్మెల్యేలను దిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తా నామినేట్ చేశారు. దిల్లీ మేయర్ ఎన్నికలు ఈ ఏడాది ఏప్రిల్‌లో జరగాల్సి ఉండగా... స్పీకర్ తాజా చర్యలతో ప్రాధాన్యత సంతరించుకుంది. మున్సిపల్ స్థాయిలోనూ బీజేపీ గెలిస్తే 'ట్రిపుల్ ఇంజన్' ప్రభుత్వం బీజేపీ ఏలుబడిలోకి వస్తుంది. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వేటు వేసే హక్కు ఈ నామినేటెడ్ ఎమ్మెల్యేలు కలిగి ఉంటారు. దీంతో బీజేపీ గెలుపు అవకాశాలు మరింత మెరుగుపడే వీలుంది. ఎంసీడీ బడ్జెట్ రూపకల్పన, సివిక్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ గవర్నెన్స్ మెరుగుపరచేందుకు ఎమ్మెల్యేలను నామినేట్ చేస్తున్నట్టు స్పీకర్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పనితీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు, మెరుగైన ప్రజాసేవలకు నామినేట్ ఎమ్మెల్యేలు సహకరిస్తారని పేర్కొన్నారు. స్పీకర్ నామినేట్ చేసిన ఎమ్మెల్యేలలో అనిల్ కుమార్ శర్మ (ఆర్కే పురం), చంద్ర కుమార్ చౌదరి (సంగం విహార్), జితేందర్ మహాజన్ (రోహటస్ నగర్), కర్నైల్ సింగ్ (షాకూర్ బస్తీ), మనోజ్ కుమార్ షోకీన్ (నాంగ్లోయ్), నీలం పహల్వాన్ (నజఫ్‌గఢ్), ప్రద్యుమ్న సింగ్ రాజ్‌పుట్ (ద్వారక), పర్వేష్ రత్న్ (పటేల్ నగర్), రాజ్ కుమార్ భాటియా (ఆదర్శ్ నగర్), రామ్ సింగ్ నేతాజీ (బదర్‌పూర్), రవికాంత్ (త్రిలోక్‌పురి), సంజయ్ గోయల్ (సహదర), తర్వీందర్ సింగ్ మార్వా (జాంగ్‌పుర) ఉన్నారు. పర్వేష్ రత్న్, సురేంద్ర కుమార్, రామ్ సింగ్ నేతాజీ ఆప్ ఎమ్మెల్యేలు కాగా, మిగిలినవారు బీజేపీ ఎమ్మెల్యేలు. కాగా, 2024లో జరిగిన మేయర్ ఎన్నికల్లో కేవలం మూడు ఓట్ల తేడాతో బీజేపీని ఆప్ ఓడించింది.

సర్పంచ్ సంతకం ఫోర్జరీ... రూ.43 లక్షలు లూటీ

భువనేశ్వర్: ఒక పంచాయతీ అధికారి సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్రభుత్వ నిధుల్ని కాజేశాడు. వివిధ బ్యాంకు ఖాతాల్లోని ప్రభుత్వ నిధుల్లో రూ.43 లక్షలకు పైగా విత్‌డ్రా చేశాడు. ఆన్‌లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్ కోసం ఆ డబ్బును వినియోగించాడు. ఈ మోసం గురించి తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు అతడ్ని అరెస్ట్ చేశారు. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రాధాదేయ్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారి (పీఈవో) ఖేత్రమోహన్ నాయక్ భారీ ఆర్థిక మోసానికి పాల్పడ్డాడు. 2024 జులైలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ప్రభుత్వ నిధులపై కన్నేశాడు. కాగా, ఖేత్రమోహన్ నాయక్ తన పదవిని దుర్వినియోగం చేశాడు. ఆ గ్రామ సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. కేంద్ర ప్రాయోజిత నిధులు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు, ప్రజా పంపిణీ వ్యవస్థ, వృద్ధాప్య పెన్షన్ పథకాలకు సంబంధించిన ప్రభుత్వ బ్యాంకు ఖాతాల నుంచి రూ.43.01 లక్షల నిధులను చెక్కుల ద్వారా విత్ డ్రా చేశాడు. సొంత అవసరాలతోపాటు ఆన్‌లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్ కోసం ఆ డబ్బును వినియోగించాడు. మరోవైపు ఆ ఆర్థిక మోసాన్ని గుర్తించడంతో బెర్హంపూర్ విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. పంచాయతీ కార్యనిర్వహణాధికారి (పీఈవో) ఖేత్రమోహన్ నాయక్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు, ఆర్థిక నేరాలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పంచాయతీ అధికారి ఆర్థిక మోసాలపై మరింతగా దర్యాప్తు చేస్తున్నారు.

బంగ్లాదేశీ సిండికేట్ భగ్నం

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారుల నెట్‌వర్క్‌ను దిల్లీ పోలీసులు భగ్నం చేశారు. ఎనిమిది మంది బంగ్లాదేశీలను అదుపులోకి తీసుకున్నారు. దక్షిణ దిల్లీలో అక్రమంగా ఉంటున్నట్లు గుర్తించి... ఫారెనర్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ) ద్వారా ఆరుగురిని డిపోర్ట్ చేయగా, మరో నలుగురిని విచారిస్తున్నట్లు దిల్లీ పోలీసులు శనివారం తెలిపారు. నకిలీ గుర్తింపు సిండికేట్ గుట్టు రట్టు అయినట్లు తెలిపారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమ పద్ధతుల్లో భారత్‌లోకి ప్రవేశం కల్పించి, చొరబాటుదారులకు ఆశ్రయం, ఉపాధి, నకిలీ ఆధార్, పాన్, ఓటరు ఐడీలు, భారతీయ పాస్‌పోర్టులు కల్పిస్తున్నట్లు డీఎస్పీ (సౌత్) అంకితా చౌహాన్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో మహమ్మద్ ఆలంగిర్ (34) 2007లో భారత్‌కు వచ్చి స్క్రాప్ డీలర్‌గా పని చేస్తున్నాడు. భారతీయ మహిళను పెళ్లిచేసుకొని ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు. ఇతని తమ్ముడు జువెల్ ఇస్లాం (27) 2021లో భారత్‌కు వచ్చి స్క్రాప్ బిజినెస్‌లో చేరాడు. మరొక నిందితుడు రేజౌల్ 2002 నుంచి భారత్‌లో ఉంటూ ఇక్కడి పాస్‌పోర్టు పొంది బంగ్లాదేశ్, భారత్ మధ్య రాకపోకలు సాగిస్తున్నాడు. 2014లో భారత్‌కు వచ్చిన కమరుజ్జమన్... నకిలీ పత్రాలతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ఏజెంట్‌గా చేరాడు. నయీం షేక్ క్లీనర్‌గా పనిచేస్తుంటే, లతీఫ్ (37) దిల్లీలో స్వీపర్‌గా ఉన్నాడు. 2022లో భారత్ వచ్చిన మిజానుర్ రెహమాన్ స్క్రాప్ డీలర్ కాగా అదే ఏడాది వచ్చిన రబియుల్... డిఫెన్స్ కాలనీలోని ఆసుపత్రిలో అటెండెంట్. అందరి వద్ద నకిలీ ఆధార్, పాన్, ఓటరు ఐడీలను దిల్లీ పోలీసులు గుర్తించారు. 23 ఓటరు ఐడీలు, 19 పాన్ కార్డులు, 17 ఆధార్ కార్డులు, 11 జనన ధ్రువీకరణ పత్రాలు, ఆరు ఖాళీ ఓటరు ఐడీలు, పత్రాల ఫోర్జరీకి వినియోగించే కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. బీఎన్ఎస్‌లోని ఫోర్జరీ సెక్షన్లతో పాటు విదేశీయుల చట్టం1946, ఆధార్ చట్టం 2016 కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విశాలాంధ్ర హైదరాబాద్

నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దాం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజోపయోగ మైన నిర?యాలు తీసుకుని నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్టాండింగ్ కమిటీ సభ్యులను కోరారు. శనివారం సాయంత్రం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన స్టాండింగ్ కమిటి సభ్యులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి అభినందనలు తెలుపుతూ సభ్యులందరిని శాలువలతో సన్మానించారు. అనంతరం అధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ స్టాండింగ్ కమిటికి అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. స్టాండింగ్ కమిటీ పాలసీ నిర్ణయాల కమిటీ అని, నిర్మాణాత్మక, ప్రజోపయోగ మైన నిర్ణయాలు తీసుకుని నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో కమిటీ సమావేశాలను నిర్వహించుకుని అన్ని అంశాలను సమగ్రంగా చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని అన్నారు. స్టాండింగ్ కమిటీ నిబంధనల గురించి సభ్యులకు వివరించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసికి పెద్దయెత్తున నిధులను మంజూరు చేస్తున్నది.

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు:

స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక పూర్తి అయినందున ప్రతి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించడానికి కమిటీ ఆమోదం చేశారు. అల్వాల్ గ్రామానికి చెందిన గ్రామ కంఠంలోని 0.11 గుంటల భూమిని మేడ్చల్ డివిజన్‌లో కొత్త అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారికి కేటాయించుటకు కార్పొరేషన్ ఎన్.ఓ.సి జారీ చేయుటకు కమిటీ ఆమోదం చేసింది. జీహెచ్ఎంసీ జనవరి నెల యొక్క ఆదాయ వ్యయాల వివరాలు కమిటీకి సమాచారం నిమిత్తం సమర్పించడం జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వన్ టైమ్ స్కీమ్ కింద 90% బకాయి వడ్డీని మాఫీ చేయడం, స్టాండింగ్ కమిటీ ఆమోదంతో అనుమతి కోరుతూ ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ కమిటీ ఆమోదం చేసింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద గుడిమల్కాపూర్ ఫ్లవర్ మార్కెట్‌లో ఉన్న కుమందన్ బౌలి హెరిటేజ్ స్ట్రక్చర్ (చారిత్రక మెట్ల బావి) పరిరక్షణ, అభివృద్ధికి గాను ఇండియన్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్ ఆర్థిక సహకారంతో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో పునరుద్ధరణ, పరిరక్షణ కోసం మొదటి దశలో 18 నెలల పాటు నిర్మాణ్ ఎన్‌జిఓ ఆర్గనైజేషన్‌తో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం తెలిపింది. చాంద్రాయణ గుట్ట బండ్లగూడలో గల ప్రోగ్రెస్ స్కూల్ నుండి క్రిస్టల్ టౌన్, డెలివరీ కొరియర్ సర్వీస్ వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్, విడిసిసి రోడ్ నిర్మాణాలకు రూ.2.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం తెలిపింది. స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, మహాలక్ష్మి రమన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సి.ఎన్.రెడ్డి, వి.జగదీశ్వర్ గౌడ్, బురుగడ్డ పుష్ప నగేష్ పాల్గొన్నారు. అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, వేణుగోపాల్, పంకజ, గీతా రాధిక, రఘుప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, సుభద్ర దేవి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.

ఈదురు గాలులు, వర్షాలపై అప్రమత్తంగా ఉండండి : సీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్‌జిల్లాల్లో ఈదురు గాలులు, వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముందస్తు చర్యలు చేపట్టాలని అప్రమత్తం చేశారు. వెంటనే సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆదేశించారు. తర్వాత సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన శాంతి కుమారి గారు, రానున్న 48 గంటలలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని సూచన ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలంటూ అవసరమైన సూచనలు చేశారు.

ప్రజా వ్యతరేక పోస్టల్ యాక్ట్‌ను రద్దు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పోస్టల్ శాఖను ప్రైవేటీకరించి ప్రైవేట్ కొరియర్ సర్వీసులను ప్రోత్సహించే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా వ్యతరేక పోస్టల్ యాక్ట్‌ను రద్దు చేయాలనీ పోస్టల్ ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో శనివారం పోస్టల్ ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక కాన్ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పి.సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ పోస్టల్ సర్వీసెస్ బిల్లు వల్ల తపాలా రంగంలో పని చేస్తున్న సుమారు నాలుగున్నర లక్షల మంది ఉద్యోగుల ప్రాథమిక హక్కులు నిర్వీర్యం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులను సామూహికంగా తొలగించడమో లేదా విఆర్ఎస్‌తో బలవంతంగా పంపడానికి ఈ బిల్లు వీలుకల్పిస్తుందని అయన తెలిపారు. అంతేకాకుండా మూడు లక్షలమంది గ్రామీణ్ సేవక్‌ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. పోస్టల్ ఉద్యోగ కార్మిక సంఘాలతోగాని, పార్లమెంట్‌లో ఎలాటి చేర్చలు లేకుండా ఈ చట్ట తీసుకరావడం దుర్మార్గమన్నారు. తక్షణమే పోస్టల్ యాక్ట్‌ను రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ పోస్టల్ ఉద్యోగులు సంఘటితంగా దేశ వ్యాప్తంగా ఉద్యమించాలని పి.సురేష్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకులూ వి.ఎస్.బోస్, అఖిల భారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి. జలాలుద్దీన్, పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులూ బి.నరసింహులు, ఏం.కామేశ్వరరావు పాల్గొన్నారు.

కేసీఆర్ పగటి కలలు మానుకోవాలి : మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి, బీఆరెస్ అధినేత ఇప్పటికైన పగటి కలలు మానుకొని వాస్తవానికి వస్తే మంచిదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం నాడు కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేష్ గౌడ్ స్పందించారు. తెలంగాణలో బిఆర్ఎస్ దుకాణం బంద్ కావడం ఖాయమన్నారు. బిఆర్ఎస్ సృష్టించిన ఆర్థిక విధ్వంస పునాదుల మీద రైజింగ్ తెలంగాణ నినాదంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. గత పదేళ్లతో పోలిస్తే తెలంగాణ ఇప్పుడు ప్రగతి పథంలో కొనసాగుతోందని, అమావాస్య చంద్రుడిలా ఫాం హౌస్ నుంచి బయటికొచ్చిన ప్రతిసారి ప్రగల్భాలు పలకడం కేసీఆర్‌కి అలవాటుగా మారిందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ చూసి బిఆర్ఎస్ నేతలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు. సింగిల్‌గానే కాదు మీరు బీజేపీతో జతకట్టినా మళ్లీ అధికారం కాంగ్రెస్‌దే అని, పదేళ్ల పాలనపై బిఆర్ఎస్ పేరు ఎత్తితేనే తెలంగాణ ప్రజలు చీదరించుకుంటున్నారని మండిపడ్డారు. పదేళ్లు మీరు కేంద్రంలోని నరేంద్ర మోదీకి దాసోహం కావడంతోనే తెలంగాణకు కేంద్రం నుండి న్యాయంగా దక్కాల్సిన వాటాలు దక్కలేదని, కుటుంబ కోసం కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. రైతు బంధు పేరుతో మీ అనుచరుల రియల్ ఎస్టేట్ భూమలకు, వివాదాస్పద భూములకు కూడా నగదు చెల్లించి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారని ఆరోపించారు. మీరు ఇచ్చింది రూ.10 వేలు అయితే కాంగ్రెస్ వ్యవసాయ యోగ్యమైన భూమలకే రైతు భరోసా కల్పిస్తూ రూ.12 వేలు ఇస్తుందన్నారు. దేశంలో ఏక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కూలీలను కూడా ఏడాదికి రూ.12 వేలు ఇస్తూ భరోసా కల్పిస్తుందని వివరించారు.

సెల్లార్ తవ్వకాలతో ప్రజలకు ఇబ్బందులు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హైదరాబాద్ నగరంలో ఎలాంటి సెల్లార్ గుంతలు తవ్వకూడదు అని నిబంధనలు ఉన్నప్పటికీ ఎలాగోలా అనుమతులు తెచ్చుకుని సెలార్ గుంతలు భారీ లోతు తవ్వుతున్నారనని శేర్లింగంపల్లి నియోజక వర్గం బీఆర్స్ ఉపాధ్యలు మిద్దెల మల్లారెడ్డి తెలిపారు. ఈ సెల్లార్ గుంత ఒక పక్కకు పెట్రోల్ పంపు మరొక పక్కకు 8 అంతస్తుల అపార్ట్మెంట్ ఉన్నది ఒక వేళ అనుమతులు తీసుకొని ఉంటే చాలా నిబంధనలో ఉంటాయనని, మొదటగా పక్కనున్న భవనములకు చుట్టూ కూడా ఇతని బౌండరీలో దాదాపు పది ఫీట్ల సెట్ బ్యాక్ విడిచి తవ్వాలి, రోడ్డుకు దాదాపు 20 ఫీట్ల సెట్ బ్యాక్ విడిచి తవ్వాలి కానీ ఇతను పక్కనున్న భవనమునకు ఆనుకొని తవ్వినాడు ఇట్టి భవనము కూలిపోయే ప్రమాదం ఎంతైనా ఉందన్నారు. ఎందుకంటే ఇక్కడ ముందే బురద భూమి వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికి ఈ ఏరియా అంతా నీరు నిండిపోతుంది గతంలో మేము ఎన్నో ఇబ్బందులు పడ్డాము ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు మేల్కొని ప్రమాదము జరగక ముందే ప్రమాదాన్ని పసిగట్టి ప్రమాదము జరగకుండా ఉండడానికి ఇట్టి సెల్లార్ గుంతను వెంటనే పూడ్చి వేసి పక్కనున్న బిల్డింగును కాపాడాలన్నారు.

మెడికల్ కాలేజ్ పనులను వెంటనే ప్రారంభించాలి

విశాలాంధ్ర-దుండిగల్: మెడికల్ కాలేజ్ పనులను వెంటనే ప్రారంభించాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆకాంక్షించారు.తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శనివారం జరిగిన చర్చలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం 20 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని, దానికి సంబంధించి హెచ్ఎండిఏ పరిధిలో ఉండగా ఇప్పటికే జీవో కూడా విడుదల చేయడం జరిగిందని, కాబట్టి ప్రభుత్వం వెంటనే కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ పనులను చేపట్టాలని ఆయన కోరారు.

సీలింగ్‌లో ఇచ్చిన భూములు తిరిగి తీసుకున్న దొరలు

అసెంబ్లీలో లేవనెత్తిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా కొండకల్, సంగారెడ్డి జిల్లా వెలిమల గ్రామాల్లో సీలింగ్ చట్టం కింద జాగీర్దార్ల నుంచి ప్రభుత్వం తీసుకున్న భూమిని మళ్లీ దొరలకు ఇచ్చారని, ఒకసారి సీలింగ్‌లో తీసుకున్న భూములను మళ్లీ అదే దొరలకు వెనక్కి ఎలా ఇస్తారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. కొండకల్, వెలిమల గ్రామాల్లో భూముల వ్యవహారంతో పాటుగా మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండలానికి చెందిన చొక్కంపేట్, తిర్మలాపూర్ గ్రామాల్లోనూ దొరలు సీలింగ్‌లో ఇచ్చిన భూములను మళ్లీ తిరిగి తీసుకోవడంపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేసారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశం జీరో అవర్‌లో అనిరుధ్ దొరలు వందల ఎకరాల భూముల విషయంలో చేస్తున్న అక్రమాలను లేవనెత్తారు. కొండకల్, వెలిమల గ్రామాలలో ఉన్న భూములను అక్కడి దొరలు ల్యాండ్ సీలింగ్ కింద ప్రభుత్వానికి అప్పగించారని చెప్పారు. ఈ భూములతో తన జడ్చర్ల నియోజకవర్గంలోని చొక్కంపేట్, తిర్మలాపూర్ గ్రామాలకు చెందిన దొరల భూములతోనూ లింక్ ఉందని వెల్లడించారు. కొండకల్, వెలిమల తరహాలోనే చొక్కంపేట్, తిర్మలాపూర్ గ్రామాల్లోనూ సీలింగ్‌లో దొరల నుంచి తీసుకున్న భూములలో 700 ఎకరాల భూమి వరకూ సాదాబైనామాల సాయంతో దొరలు మళ్లీ తామే తీసుకున్నారని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఇదంతా గత ప్రభుత్వంలో జరిగిన వ్యవహారమని, ఈ భూముల వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరిపించాలని, పేద దళిత, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

ఆ 250 ఎకరాల భూములు మాకు వద్దు,...

మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ఖానాపూర్ గ్రామానికి తన తాత జగన్నాథరెడ్డి జాగీర్దార్‌గా ఉండేవారని, ఖానాపూర్ తన తాత మక్తాగా ఉండేదని తెలిపారు. సీలింగ్ చట్టం వచ్చిన సమయంలో తమ కుటుంబం ఖానాపూర్ లోని వేలాది ఎకరాల భూములను ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని చెప్పారు. అయితే ఈ విధంగా తాము ప్రభుత్వానికి అప్పగించిన భూముల్లో 250 ఎకరాల భూమిని పొరపాటున మళ్లీ తమ కుటుంబానికి చెందిన బూమిగా రికార్డుల్లో రాసారని అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రికార్డుల్లో మార్పులు చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తమ ఇంటికి వచ్చినప్పుడు ఖానాపూర్ భూములను గురించి వినతిపత్రం కూడా ఇచ్చానని వెల్లడించారు.

తిరుమల దర్శనం వారానికి 7 రోజులు ఇవ్వాలి...

తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలను టీటీడీ పట్టించుకోవడం లేదని, ఆంధ్ర రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు ప్రాధాన్యం ఇస్తున్న తరహాలోనే తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలపై కూడా విఐపి దర్శనాలు ఇవ్వాలనే విషయం గురించి మొదటగా తానే మాట్లాడానని అనిరుధ్ రెడ్డి గుర్తు చేసారు. ఈ విషయం గురించి తాను మాట్లాడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు కూడా మాట్లాడటంతో ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలపై వారానికి 4 రోజులు దర్శనాలను కేటాయించడానికి అంగీకరించారని చెప్పారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు కూడా వారానికి 7 రోజులు వీఐపీ దర్శనానికి అనుమతి ఉండేదని ప్రస్తావించారు. అదే తరహాలో ఇప్పుడు కూడా తెలంగాణ ప్రజలకు వారానికి 7 రోజులు వీఐపీ దర్శనాలకు అనుమతించాలని అనిరుధ్ రెడ్డి కోరారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పదవ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మరియు బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించడంతో పాటు, పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిభిరం, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా హాలులో నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వేసవి ఎండల దృష్ట్యా విద్యార్థులు ఏదైనా అస్వస్థతకు గురైతే, వెంటనే వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లను అనుమతించరాదని అన్నారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌కి అవకాశం లేకుండా పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

రైతులంటే కాంగ్రెస్ నాయకులకు ఎందుకింత నిర్లక్ష్యం ?

విశాలాంధ్ర - హైదరాబాద్ : మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి కుట్ర చేశాయని, ఆ రెండు ప్రాజెక్టులు కలిసి మేడిగడ్డపై దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. ఎస్ఎల్బీసీ టన్నల్ ప్రమాదం జరిగి నెల రోజులు గడుస్తున్నా... ఎన్డీఎస్ఏ వాళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న కుట్రను ప్రజలు గమనించాలని కోరారు. కాళేశ్వరం నీళ్లు వినియోగించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పొలాలను ఎండబెడుతూ రైతుల నోట్లల్లో మట్టికొడుతున్నదని ధ్వజమెత్తారు. లక్షలాది ఎకరాలు ఎండిపోతున్నా సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులు చూస్తూ కూర్చున్నారు తప్పా రైతుల కష్టాలను చూడడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ కళ్లు తెరిపించడానికి రామగుండం నుంచి జెండా ఎత్తుకొని కోరుకంటి చందర్ వచ్చారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీపై పోరాటం చేస్తేనే తెలంగాణ వచ్చిందని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ పై పిడికిలి ఎత్తి పోరాటం చేస్తేనే పొలాలకు నీళ్లు వస్తాయని అన్నారు. నీటి కోసం పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కృషి అభినందనీయమన్నారు. "ఒకప్పుడు తలాపున పారేటి గోదారి మన బతుకులు ఎడాది అని పాడుకున్న తెలంగాణను కేసీఆర్ గోదావరి నీటితో చెరువును నింపి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారు. ఎండకాలంలో కూడా చెరువులు మత్తడి దుంకేలా గోదావరి నీటిని కేసీఆర్ సద్వినియోగం చేశారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం వల్లనే గోదావరి జలాలను ప్రతీ ఇంటికి చేరాయని స్పష్టం చేశారు.

నాగారంలోని ప్రభుత్వ భూమితో పాటు నాలా కబ్జా

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షించడమే లక్ష్యంగా హైడ్రా అవతరించినా గ్రేటర్ కార్పొరేషన్‌కు అనుకుని ఉన్న నాగారం మున్సిపాలిటీలోని సర్వే నెంబ 291లో ప్రభుత్వ భూమి, నాలాను కబ్జా చేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరపతి కలవారికి ఒక న్యాయం, సామాన్యులకు ఒక న్యాయమా అంటూ స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వే నెంబర్ కాప్రా సర్కిల్‌కు హద్దులు దాటగానే నాగారం మున్సిపల్ ప్రారంభంలో ప్రధాన రహదారికి ఇరువైపుల దాదాపు 38 ఎకరాలు భూమి ఉంటుంని స్థానికులు పేర్కొంటున్నారు. దీని నుండి కొంత భూమి రోడ్డు, నాలా కింద పోయిగా మరికొంత పేదలు ఇండ్లు నిర్మించుకుని 58, 59 జీవోల కింద క్రమబద్ధీకరించున్నట్లు తెలిసింది. ప్రస్తుతం 15 ఎకరాలపైనే ఉంటుందని, అయితే 291 సర్వే నెంబర్ పక్కనే పట్టా భూమి కలిగి ఉండి రాజీకీయ పలుకుపడి కల్గిన వ్యక్తి 291 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని రాజకీయ అండదండలతో కొద్ది కొదిగా అక్రమించుకుంటూ తన పట్టాభూమి పక్క నుంచి చదును చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. కాప్రా చెరువు చెరువు నీరు, ఎదులాబాద్ చెరువు నీరు ప్రవహించే నాలా సైతం పూడ్చి వేస్తూ నాలానే పక్కకు మళ్ళించే విధంగా చదును చేస్తున్నారని, ఖాళీ స్థలంతో పాటు నాలాను పూడ్చిన స్థలాన్ని కలుపుకొంటే దాదాపు 50 ఫీట్లకు పైన ఉన్న నాలా 20 ఫీట్లకు కుచించుకుపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. నాలా పూడ్చి కబ్జా చేయడంమే కాకుండా ఆ సర్వే నెంబర్‌లోని కొంత భూమిని కూడ కబ్జా చేస్తున్నప్పటకి మండల తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తమకేమి పట్టనట్లు ఉండడంలో ఆంతర్యం ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలం ప్రధాన రహదారికి పక్కనే ఉండటంతో ఎకరాకు బహిరంగ మార్కెట్‌లో రూ.20 కోట్లుపైనే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. దీనిపై కీసర తహసీల్దార్ యు.అశోక్ వివరణ అడగ్గా సర్వే చేస్తే ప్రభుత్వ భూమి అని తేలితే తాను తొలగిస్తానని చెప్పాడని తెలపడం అధికారుల తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తన పరిధిలోని ప్రభుత్వం కబ్జా అవుతుంటే తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అధికారి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. ఇరిగేషన్ అధికారులు సైతం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిసింది. ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్ట్‌ను ఆదారం చేసుకుని, దానికి బఫర్ జోన్ తీసివేస్తే నాలా కబ్జాను అడ్డుకోవచ్చునని, నాలాను అనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు అధికారులు ఎందుకు ముందుకు రావడం లేదని పలువురు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తీరును ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా, ఇరిగేషన్, జిల్లా రెవెన్యూ అధికారులు 291 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని, నాలాను పరిరక్షించే విధంగా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎంను హరీష్‌రావు కలవడం శుభపరిణామం : ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎట్టకేలకు హరీష్ రావు కూడా పాజిటివ్ లైన్ లోకి వచ్చారని, సీఎం రేవంత్ రెడ్డి అందరికీ సీఎం అని గ్రహించి సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి నీ, హరీష్ రావు కలవడం శుభపరిణామం అని అందుకు ఆయనకు ధన్యవాదాలు అంటూ ఎంపీ.చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు నెగిటివ్ లైన్ లో ఉండి నిరసనలు తెలిపారని, ఇప్పుడు సమస్యల పరిష్కారానికి సీఎం ను కలిశారని పేర్కొన్నారు. శనివారం నాడు అసెంబ్లీ ఆవరణలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ నితిన్ గడ్కారీ నీ కలసి ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ క్యాబినెట్ లో పెట్టాలని కోరామని, అలాగే మెట్రో విస్తరణ మీద కేంద్రాన్ని లేఖలు రాశాం, పదేళ్ళ గత ప్రభుత్వం మెట్రో ను పట్టించుకోలేదని దుయ్యబట్టారు. కిషన్ రెడ్డి నీ కేంద్ర మంత్రిగా మాత్రమే కాదు, బీజేపీ అధ్యక్షుడిగా చూడాల్సిన అవసరం ఉందని, ఇక్కడ బీజేపీ బలోపేతం చేసుకోవాలని, సీఎం అవ్వాలని ఆయనకి ఉంటుందన్నారు. నిధులు ఇస్తే కాంగ్రెస్ క్రెడిట్ కిట్టేస్తుందని ఆయన భావిస్తున్నారని అందుకే అభివృద్ధి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇన్ని సార్లు డిల్లీకి వెళితే ఎవరు తెలంగాణ నిధులు అడ్డుకుంటున్నారు అనేది మాకు తెలిసిందని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వానికి కనీసం మూడు ఏళ్ళ సమయం ఇవ్వాలన్నారు. కేటీఆర్ పాదయాత్ర ను వెల్ కమ్ చేస్తున్నామని, రోడ్లు ఎప్పుడు ఖాళీగానే ఉంటున్నాయని, పదేళ్ళ బయటకి రాలేదు, ఇప్పుడు వస్తున్నారు అంటే మంచిదే కదా అని అభిప్రాయపడ్డారు. డిలిమిటేషన్ తమిళనాడు స్టాలిన్ ను పొగుడుతున్నారు, కానీ అంతకు ముందే లేఖలు రాసిన జానారెడ్డి, భట్టి నీ పొగడటానికి నోరు రావడం లేదు కేటీఆర్ కు అని అన్నారు. దక్షణాది రాష్ట్రాలకు కాంగ్రెస్ మద్దతు ఉంది కాబట్టే కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం డీలిమిటేషన్ సమావేశానికి వెళ్ళారని, జన గణన 2026లో జరిగితే డీలిమిటేషన్ 2027లో జరుగుతుందన్నారు. దొంగలు పడక ముందే అలెర్ట్ అవుదామని స్టాలిన్ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. అయితే డీలిమిటేషన్ సమావేశాన్ని కేంద్ర మంత్రి సంజయ్ చిల్లరగా మాట్లాడుతున్నారని, దొంగల ముఠా అనుకుంటే పోలీసులను హోమ్ శాఖ సహాయ మంత్రి ఎందుకు పంపడం లేదని ప్రశ్నించారు.

బండి సంజయ్ కి అప్పుడప్పుడు కేంద్ర మంత్రి అని గుర్తు చేయాల్సి వస్తుందని, జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ డిలిమిటేషన్ మీద క్లారిటీ లేదు అంటున్నాయన్నారు. అయినా దక్షణాది రాష్ట్ర సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యత నిర్వర్తిస్తున్నారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలు పక్కన పెట్టీ అందరు కలసి నడవాలని సూచించారు. ఈటెల రాజేందర్ మూసీ ప్రక్షాళన కోసం కేంద్రాన్ని కోరడాన్ని స్వాగతిస్తున్నామని, రాజకీయాలు చేయడం వేరు,... కానీ అభివృద్ధి విషయంలో ఈటెల రాజేందర్ ని ఒప్పుకోవాలన్నారు.

కనీస వేతనాల జీఓలను వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇందిరాపార్కు వద్ద అన్ని కార్మిక సంఘాలు శనివారం ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాకు అధ్యక్షవర్గంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు అంజద్ అలీ, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఎస్.ఎల్.పద్మ, ఐఎఫ్‌టియు, ఎఐయుటియుసి, టిఎన్‌టియుసి నాయకులు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు మరియు కనీస వేతనాల సలహామండలి సభ్యులు యం.డి.యూసుఫ్ ధర్నా ప్రారంభించారు. వారు ప్రసంగిస్తూ కనీస వేతనాలు సవరించి 13 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలు అవుతుందని, 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం డి.ఎ.లింకప్ అయిన జి.ఓ.లను ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి వేతనాలు సవరించి జి.ఓ.ను విడుదల చేయాలి. కానీ 13 నుండి 18 సంవత్సరాల కాలంలో జి.ఓ.లు సవరించకపోవటం వలన కార్మికులు నామమాత్రపు వేతనాలు పొందుతున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల బోర్డును నియమించకుంటే కార్మికులు కోర్టుకు వెళ్ళి బోర్డును ఏర్పాటు చేయించుకోవటం జరిగింది. బోర్డు కాల పరిమితి ముగిసిన వెంటనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 2వ బోర్డును కూడా ఏర్పాటు చేయించుకోవటం జరిగింది. ఈ రెండు బోర్డులలో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించటం జరిగింది. ఈ రెండు బోర్డుల కాలపరిధిలో అన్ని కార్మిక సంఘాలు కలిసి శాస్త్రీయ పద్ధతిలో 1948 కనీస వేతనాల చట్ట పరిధిలో కనీస వేతనాలు ఏలా ఉండాలనే అంశాలను చర్చించి 2017లో లేబర్ కమీషనర్‌కి నివేదించటం జరిగింది. స్పందించిన ప్రభుత్వం 2021 జూన్ 25 నుండి 30వరకు వరుసగా సెక్యూరిటీ సర్వీసెస్ జి.ఓ.నెం.21, 22, 23, 24, 25, నెంబర్లు గల 5 జి.ఓ.లను విడుదల చేసింది. రేవంత్ రెడ్డి అప్పుడు ఎంపీ హోదాలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి జి.ఓ.లను వెంటనే గజిట్‌లో ప్రింట్ చేసి అమలు చేయాలని కోరారు. ఇప్పుడు వారే ముఖ్యమంత్రిగా ఉన్నందువల్ల ఈ జి.ఓ.లను వెంటనే గజిట్‌లో ప్రింట్ చేసి అమల్లోకి తేవాలని కోరుతున్నారు. వెంటనే జి.ఓ.లు అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, 12 జి.ఓ.లను ప్రభుత్వానికి నివేదించాలని అలాగే అన్ని హంగులు పూర్తిచేసి ఉన్నటువంటి 56 జి.ఓ.లను కూడా సరిచేసి సవరించి విడుదల చేయాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టగానే మళ్ళీ కొత్త ప్లిమినరీ నోటిఫికేషన్లు విడుదల చేయటం సమర్థనీయం కాదని, ఒకసారి నోటిఫికేషన్ అదే అంశంపై ఇంకొకసారి నోటిఫికేషన్ జారీ చేయటం కుదరదు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయించటం సరియైన అంశం కాదు. రెండవసారి జారీ చేసిన నోటిఫికేషన్లను వెంటనే రద్దు చేసి గతంలో వేసిన 2 బోర్డుల రికమెండేషన్ల ఆధారంగా జి.ఓ.లను విడుదల చేయాలని, గతంలో విడుదల చేసిన 5 జి.ఓ.లను గజిట్‌లో ప్రింట్ చేయాలని డిమాండ్ చేశారు.

దావత్ ఏ ఇఫ్తార్ ఘనంగా నిర్వహించండి: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: దావత్ ఏ ఇఫ్తార్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశ మందిరంలో శనివారం ఇఫ్తార్ విందు, రంజాన్ పండుగ ఏర్పాట్లను ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో సమీక్షించారు. ఆహారంలో నాణ్యత, ప్రొటోకాల్, సౌకర్యాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఏర్పాట్లలో అశ్రద్ధ వహించరాదని, చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా చూడాలని అన్నారు. లా అండ్ ఆర్డర్, ఎలక్ట్రిసిటీ, మంచినీరు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కోరారు. ఇబ్బందులుంటే జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

వరద ముంపు సమస్య నుండి

శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: డివిజన్ అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు పోతున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. నల్లగండ్ల చెరువు నుండి బిహెచ్ఇఎల్ చౌరస్తా ఇండియన్ గ్యాస్ గోడౌన్ నాలా వరకు ఎస్ఎన్‌డీపీ అండర్ హెచ్‌సీఐటీఐలో భాగంగా రూ. 28 కోట్లు 45 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపడుతున్న ఓపెన్ డ్రైన్ ఆర్‌సీసీ బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం పనులను సంబంధిత జిహెచ్ఎంసీ అధికారులతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాలాల విస్తరణ పనులతో లోతట్టు ముంపు ప్రాంతాలకు శాశ్వత ఉపశమనం అని పేర్కొన్నారు. ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ పనులు నాణ్యతతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్ డిఈ ఆనంద్, ఏఈ భాస్కర్, ఎస్ఎన్డిపి జిహెచ్ఎంసీ డిఈ రాజు, డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, కే.రాంచందర్, కొండల్ రెడ్డి, నారాయణ, లక్ష్మణ్, బచ్చు రాజు, ఖాజా పాషా, గోవింద్ చారీ, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, గోపాల్ యాదవ్, పవన్, రాము, గోపాల్, సయ్యద్ మీర్ అలీ, అహ్మద్, సుభాష్, యాదగిరి, సురేష్, మహేష్ చారీ, రాజు, వినయ్, స్థానికవాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆక్స్‌ఫర్డ్ జూనియర్స్ కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర- బషీర్ బాగ్: ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ జూనియర్స్ పాఠశాల ఆడిటోరియంలో 'కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే'ను ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ స్కూల్ వైస్ చైర్పర్సన్ ప్రార్ధన మణికొండ తెలిపారు. ఆమె మాట్లాడు తూ చిన్నారులు ఆహ్లాదకరమైన, రంగు రంగుల దుస్తులు ధరించిన సంగీతం, నృత్యం, ప్రసంగాల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. యువ గ్రాడ్యుయేట్లు సాధించిన విజయాలను అభినందిం చారు. కెజి గ్రాడ్యుయేషన్ డిప్లొమాల పంపిణీ తల్లిదండ్రులకు భావో ద్వేగ క్షణం అన్నారు. ఈ వేడుక విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు చిరస్మరణీయమైన జ్ఞాపకాలను మిగిల్చిందన్నారు. కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, ప్రిన్సిపాల్ ఫాతిమా కాజిమ్ పాల్గొన్నారు.

ఘనంగా నటరాజ రామకృష్ణ జయంతి, స్వర నర్తన సంస్థ వార్షికోత్సవం

విశాలాంధ్ర -బషీర్ బాగ్: భరత కళా ప్రపూర్ణ పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ 102వ జయంతి స్వర నర్తన సంస్థ 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిం చారు. శనివారం పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ కళాప్రాంగణంలో సంస్థ వ్యవస్థాపకులు దెందులూరి పద్మమోహన్, కర్నాటి నవత ఆధ్వర్యాన రామకృష్ణకు నృత్య నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిధిగా హాజరైన ఐఎఫ్ఎస్ దెందులూరి నళిని మోహన్, కూచిపూడి నాట్య గురువులు డాక్టర్ భాగవతుల సేతు రామ్ కథక్ నాట్య గురువులు ఇంజిబాబు గురువు నటరాజ రామకృష్ణ తో ఉన్న అనుబంధాన్ని పంచుకొని, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గురు శ్రీకళాకృష్ణ నేతృత్వంలో నటరాజ రామకృష్ణ శిష్యులలో 12 మంది కళాకారులు ఆంధ్రనాట్యం, పేరిణిలోని వివిధ అంశాలపై చేసిన ప్రదర్శనలను సభికులు వీక్షించి అభినందించారు.

వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డికి అభినందన సభ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారతీయ జనతా పార్టీ సంస్థ గత నిర్ణయాలను, పార్టీ బలోపేతానికి చేపట్ట వలసిన కార్యక్రమాలను, నిర్వర్తించవలసిన విధివిధానాలను అనుసరించడానికి తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమించిన సందర్భంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి నూతనంగా రాష్ట్ర పార్టీ శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్షుల వారికి అభినందనలు తెలుపుతూ నియోజక వర్గ సీనియర్ నాయకులు అశోక్ కురుమ, రవీంద్రరావు, భాస్కర్, రెడ్డి, కె.నరేష్, రామరాజు, బుచ్చిరెడ్డి, కేశవులు, వసంత్ యాదవ్, నాగుల్ గౌడ్, నరేందర్ రెడ్డి, నర్సింగ్ యాదవ్, చారి ఎల్లేష్, రాధాకృష్ణ యాదవ్, సీతారామరాజు, వినయ, వరలక్ష్మి, పద్మ, డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో పరిచయ వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ సమక్షంలో మసీద్ బండ కొండాపూర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి గారు ముఖ్య అతిథులు హాజరయ్యారు. అంకిత భావం, చిత్తశుద్ధితో పనిచేస్తే తప్పకుండా అందరికీ పదవులు లభిస్తాయన్నారు. నాపై నమ్మకం ఉంచి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మహిళా మోర్చా, యువ మోర్చా, ఎస్సి మోర్చా, ఎస్టీ మోర్చా, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కౌశిక్ రెడ్డికి సీతక్క కౌంటర్

తమ్ముడు నీది నాది డిఫరెంట్ లైఫ్ స్టైల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తమ్ముడు నీ లైఫ్ స్టైల్ నా లైఫ్ స్టైల్‌కు చాలా తేడా ఉందని కావున నీకు నాకు పోలికేంటి అంటూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిమ్ రెడ్డిపై మంత్రి సీతక్క మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అవాస్తవాలని ఆమె ఖండించారు. నియోజకవర్గంలో నేను తిరిగినట్లు నువ్వు తిరగలేవు, ప్రజలకు ఎవరు ఎక్కువ అందుబాటులో ఉంటారో తేల్చుకుందాం అంటూ సవాల్ విసిరారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదన్న కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. హైదరాబాద్‌లో తిరిగే వాళ్లకు రైతులకు బోనస్ వస్తుందో లేదో తెలుస్తుందా అంటూ ఎద్దేవాచేశారు. రైతులతో సంభందం లేకుండా హైదరాబాద్‌లో తిరుగున్నట్లు ఉందని, బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ చేసింది మీరు అంటూ విమర్శించారు. వరి వేస్తే ఉరి అన్నది మీరు కానీ అదే వారి వేస్తే ప్రజా ప్రభుత్వం సన్న వడ్లకు 1200 కోట్లు బోనస్ ఇచ్చిందన్నారు. ఇంకా ఎవరికన్నా రాకపోతే అవి కూడా ఇస్తామని, అలాగే రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామని చెపుకొచ్చారు. భూమి లేని వాళ్లకే కూలీ భరోసా ఇస్తున్నామని, కొంత భూమి ఉన్న కూలీలకు ఇవ్వాలనే అంశం పరిశీలనలో ఉందన్నారు. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మా ఇంటికి రావాలని ఆహ్వానం పలుకుతున్న అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వసతి కల్పించిన క్వార్టర్‌లోనే నేను నివసిస్తున్నాను, వైయస్ భవనంలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నా అంటూ వ్యాఖ్యానించారు. అది మా ప్రభుత్వం హయాంలో నిర్మించిన భవనమే అని ఆ భవనంలోనే ఉంటున్నానట్లు వెల్లడించారు. మీలాగా ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోటల్లో నివసించడం లేదని, మా ఇంటికి వస్తే అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. మీ అందరిని భోజనానికి ఆహ్వానిస్తున్న, మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఆహ్వానించలేద న్నారు. నాది నిరాడంబర జీవితం, నా కుమారుడు కూడా హన్మకొండలోనే ఉంటాడు, నీ జీవన విధానము నా జీవన విధానము ప్రజలకు తెలుసు పాడి కౌశిక్ రెడ్డి అంటూ పేర్కొన్నారు.

కేసీఆర్‌పై ఫైర్...

వచ్చే ఎన్నికల్లో తమదే అధికారం అని ఫార్మ్ హౌస్‌లో కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. అనవసరంగా మీ కార్యకర్తలను ఊహ లోకంలో ఉంచి మీరు ఫార్మ్ హౌస్‌లోనే ఉండండి అంటూ ఏదేవా చేశారు. మా పాలన మేము చేస్తాం, ప్రజలకు మంచి పాలన అందిస్తామన్నారు. మీరు ఎప్పటికీ అవే కలలు కంటూ ఉండండి, మీరు ఎప్పటికీ అధికారంలోకి రారు ఆ విషయం మీకు అర్థం కాదని తెలిపారు.

జలమండలి ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రపంచంలో జీవకోటికి ఆక్సిజన్ తర్వాత అంతటి విలువైంది నీరు మాత్రమే అని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఆక్సిన్ లేకపోతే ఒక నిమిషం కంటే ఎక్కువ సేపు బతకలేమని, అదే నీరు లేకపోతే ఒకట్రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు బతకడం కష్టమని చెప్పారు. నీరు అనేది విలాసవంతమైనది (లగ్జరీ) కాదని, అది అత్యవసరమైనది (నెస్సెసిటీ) అని చెప్పారు. అందుకు ఇంతటి ప్రాముఖ్యమైన నీటిని వృథా చేయకూడదని వివరించారు. జలమండలి ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వెంగళ్ రావు నగర్‌లోని దుర్గాబాయ్ దేశ్ ముఖ్ బాలికల పాలిటెక్నిక్ కళాశాల వేదికగా జరిగిన ఈ వేడుకలకు ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందరరేగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... కోటీ 30 లక్షలు కలిగిన హైదరాబాద్‌కు రోజూ తాగునీరు సరఫరా చేయడం పెద్ద సవాలుతో కూడుకున్న పని అన్నారు. పెద్ద పంపులు, భారీ పైపుల ద్వారా నగర పౌరులకు జలమండలి నీటి సరఫరా చేస్తోందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో తగినంత స్థాయిలో భూగర్భ జలాలు లేకపోవడం వల్లే, 150 కిలో మీటర్ల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. 13 లక్షల కనెక్షన్లలో కేవలం 42 వేల గృహాలే ట్యాంకర్ బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. అందులో 500 మంది 75 రోజుల్లో 31 వేల ట్యాంకర్లు బుక్ చేసినట్లు చెప్పారు. 22 వేల మంది 90 శాతం ట్యాంకర్లను అంటే 2.84 లక్షల ట్యాంకర్లను బుక్ చేస్తున్నారన్నారు. దీంతో వారి గృహాల్లో సర్వే చేస్తే, ఇంకుడు గుంతలు లేనట్లు గుర్తించామన్నారు. నీటిని పొదుపుగా వాడుకుంటేనే భవిష్యత్తు బాగుంటుం దని చెప్పారు. తాగునీటి ప్రాముఖ్యా న్ని గుర్తించి వాన నీటిని ఒడిసి పట్టి సహజ వనరుల్ని భవిష్యత్తు తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, ఇంకుడు గుంతల నిర్మాణ ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, గాంధీగ్యాన్ ప్రతిష్ఠాన్ (ఎన్జీవో) ఛైర్మన్ రాజేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ యానాల ప్రభాకర్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ నేతల అక్రమ అరెస్ట్‌లపై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ఏఐవైఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎటువంటి ప్రభుత్వ ముట్టడి కార్యక్రమాలకు పిలుపు ఇవ్వకపోయినా పోలీసులు అన్ని జిల్లాల్లో ఉన్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ వేరు వేరు ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ అక్రమ అరెస్ట్‌లపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ వామపక్ష కమ్యూనిస్టు పార్టీ సీపీఐ వాటి అనుబంధ ప్రజా సంఘాలు సమాజ హితాన్ని, ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరును నిరసిస్తూ నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తుందని, రాజీలేని పోరాటాలు చేపడుతాయన్నారు. ఏదేని కార్యక్రమాలున్నా ముందుగానే బహిరంగంగా ప్రచారం ద్వారా నిరసనలు, ముట్టడిలు చేపడుతామన్నారు. కానీ ఇవేమీ లేకుకుండా పోలీసు యంత్రాంగం, ఇంటెలిజెన్స్, కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య పోకడలనే అనుసరిస్తున్నదని ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రసాదించిన పోరాట హక్కులను గౌరవించాలని, అరెస్టులతో అణచివేత ధోరణిని కట్టడి చేయవచ్చనే దృక్పథంను మార్చుకో వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్ట్ చేసిన ఏఐవైఎఫ్ నేతలను భేషరతుగా విడుదల చేయాలని, ఆ అక్రమ అరెస్టులపై రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రభుత్వం ఓయో హోటళ్లపై ఉక్కుపాదం మోపాలి

విశాలాంధ్ర - కాప్రా : మైనర్లను నిబంధనలకు విరుద్ధంగా ఓయో హోటల్‌కు అనుమతించి అసాంఘిక కార్యకలాపాలకు ప్రేరేపిస్తున్న ఈసీఐఎల్, కమాలనగర్‌లోని జీవీఎస్ గ్రాండ్ ఓయో హోటల్ ను సీజ్ చేసి, యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హోటల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లలోకి మైనర్ లను అనుమతించొద్దని ఉన్న, ఆ నిబంధనలను ఉల్లంగిస్తూ జీవీఎస్ గ్రాండ్ హోటల్ యాజమాన్యం కాసులకు కక్కుర్తి పడి మైనర్ లను అనుమతించిందని వారు ఆరోపించారు. ఈ కారణంగానే గత రెండు రోజుల క్రితం సదరు హోటల్ లో ఇద్దరు మైనర్లను అనుమతించడం, వారిపై లైంగిక వేధింపులు జరగడం, తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు వారిని రెస్క్యూ చేశారన్నారు. లైంగిక దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. అదే విధంగా ఓయో హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా జరుగుతున్నా, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఈ విషయం పై స్పందించి, తగు కఠిన చర్యలకు ఆదేశించాలన్నారు. విద్యాసంస్థల చుట్టు పక్కల ఉన్న ఓయో హోటళ్లను మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా శ్రేయస్సు కోరుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి తక్షణమే ఓయో హోటల్స్ లో జరుగుతున్న అన్ని రకాల కార్యకలాపాలపై దృష్టి సారించి, ముమ్మర విస్తృత తనికీలు చేపట్టాలని, లేకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షురాలు రజినీ, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి గిరి బాబు, ఉపాధ్యక్షుడు శేఖర్, రవి, కుమార్, సోహైల్, ఏఐఎస్ఎఫ్ నేతలు సతీష్ కుమార్, మహేష్,ప్రదీప్ పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి రోడ్ల పురోగతి మందగించింది

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో ఆర్.అండ్.బి రోడ్ల పురోగతి పూర్తిగా మందగించిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మా ప్రభుత్వం హయాంలో మొదలైన చేసిన పనులు కూడా ఎక్కడిక్కడ ఆగిపోయాయని, కాంట్రాక్టర్లు కూడా బిల్లు లు రావటం లేదు, పనులు ఎలా చేయాలి అని అంటున్నారని పేర్కొన్నారు. శనివారం శాసన సభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల చర్చలో ఆర్.అండ్.బి శాఖకు సంబంధించి ప్రవేట్ - ప్రభుత్వ భాగస్వామ్యంతో రహదారుల నిర్మాణం అంశంపై మాట్లాడుతూ కొత్త మంజూరులు కూడా ఈ బడ్జెట్‌లో పెద్దగా కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్ ప్రసంగంలో హామ్ మాడల్‌లో రోడ్ల నిర్మాణం చేబడుతామని ప్రభుత్వం అంటుందని వివరించారు. 17000 కి.మీ 28000 కోట్లతో ప్రభుత్వ ప్రవేట్ పెట్టుబడులతో రోడ్ల నిర్మాణం చేబడుతామని ప్రభుత్వం టార్గెట్ పెట్టుకున్నారని అంటే 17 వేల కిమీ ఒక్క ఆర్.అండ్.బిలో నేనా? పంచాయతీ రాజ్ రోడ్లు కూడా ఉంటాయా మంత్రి సమాధానం చెప్పాలన్నారు. బీఆరెస్ ప్రభుత్వం రాక ముందు 50 ఏండ్లలో డబుల్ లైన్ రోడ్లు 6093 కి.మీ ఉంటే మా ప్రభుత్వం వచ్చాక 10 ఏండ్లలో కొత్తగా 8672 కి.మీ (నేషనల్ హైవే ట్రాన్స్ఫర్ చేసినవి కలిపి) డబుల్ లైన్ చేసామని తెలిపారు. అలాగే 4 లైన్ రోడ్లు మొత్తం 50 ఏండ్లలో 669 కి.మీ ఉంటే మా బీఆరెస్ ప్రభుత్వ 10 ఏండ్లలో 485 కి.మీ కొత్తగా 4 లైన్‌గా చేశామన్నారు. గత 10 సంవత్సరాలలో ఆర్ అండ్ బి శాఖ ద్వారా రోడ్లు, బ్రిడ్జ్‌ల అభివృద్ధి కోసం (స్టేట్ రోడ్స్, సీఆర్ఎఫ్, ఎస్సి, ఎస్డీఎఫ్, ఎస్టీ, రూరల్ రోడ్స్,తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల నిధి) తదితర విభాగాల ద్వారా సుమారు 20 వేల కోట్ల రూపాయలను మా ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. మంత్రి కోమటి రెడ్డి గత పది సంవత్సరాలలో బీఆరెస్ ప్రభుత్వం ఒక్క గుంత కూడా పూడ్చలేదు అని సభలో ఆ వాస్తవాలు మాట్లాడారని విమర్శించారు. మా ప్రభుత్వం ఆర్.అండ్.బి ద్వారా కొత్తగా రోడ్లు వేయకపోతే రోడ్ల అభివృద్ధిలో ఈ తేడా ఎలా వస్తుందన్నారు. కొత్తగా మీరు లక్ష్యంగా పెట్టుకున్న 17 వేల కి.మీ లకు 28 వేల కోట్లలో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం ప్రవేట్ పెట్టుబడులు అంటున్నారని, 60 శాతం అంటే 16800 కోట్లు ప్రవేట్ పెట్టు బడులు అంటే ఎవరు కాంట్రాక్టర్ల లేక బ్యాంక్ లు ఇన్వెస్ట్ చేస్తాయా మంత్రి సమాధానం చెప్పాలని కోరారు. బీఆరెస్ ప్రభుత్వం 10 ఏండ్లలో చేయనిది మేము 12 నెలల్లోనే చేసాం అన్న కోమటి రెడ్డి మాటలకు సమాధానంగా మొన్న బట్టి బడ్జెట్ స్పీచ్ లోనే ఆర్.అండ్.బి శాఖ విషయంలో రాష్ట్ర ప్రభుత్వము కొత్తగా 769.35 కి.మీ రహదారుల నిర్మాణానికి 3725 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు చేసింది అంటూ ఇందులో 55 కి.మీ పొడవు రహదారులు మాత్రమే పూర్తి అయినాయి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 12 నెలలో కేవలం 55 కి.మీ పూర్తి చేసి, సభలో మాత్రం మంత్రి మాకన్న ఎక్కువ అభివృద్ధి చేసాం అని సభను తప్పుదోవ పట్టించారన్నారు.

ఫిన్‌ఫ్లూయెన్సర్ రిపోర్ట్‌ను విడుదల చేసిన సిఎఫ్ఏ ఇనిస్టిట్యూట్ ఇండియా

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : ప్రపంచవ్యాప్త పెట్టుబడి నిపుణుల సంఘం అయిన సిఎఫ్ఏ ఇనిస్టిట్యూట్, 'క్లిక్స్ అండ్ క్రెడిబిలిటీ పెట్టుబడి నిర్ణయాలలో ఫిన్‌ఫ్లూయెన్సర్ల పాత్రను అర్థం చేసుకోవడం' అనే శీర్షికతో ఇండియా ఫిన్‌ఫ్లూయెన్సర్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. ఇది భారత్‌లో చిన్న తరహా పెట్టుబడిదారుల ఆర్థిక నిర్ణయాలపై ప్రభావం చూపుతున్న ఫిన్‌ఫ్లూయెన్సర్ల పెరుగుతున్న పాత్రపై సమగ్ర విశ్లేషణను అందిస్తుంది. 1,600 మందికి పైగా పెట్టుబడిదారుల సర్వే మరియు 51 మంది ప్రముఖ ఆర్థిక ప్రభావశీలుల విశ్లేషణ ఆధారంగా, ఈ అధ్యయనం ఈ రంగంలోని అవకాశాల, ముప్పులను వెలుగులోకి తెచ్చింది. గమనించదగిన విషయం ఏమంటే, ఈ అధ్యయనంలో విశ్లేషించిన ఆర్థిక ప్రభావశీలులలో కేవలం 2% మాత్రమే సెబీ వద్ద నమోదు అయి ఉన్నారు, కానీ 33% మంది బహిరంగంగా కొనుగోలు లేదా అమ్మకానికి సిఫార్సులు ఇస్తున్నారు, ఇది బాధ్యత, నమ్మకానికి సంబంధించిన ప్రశ్నలను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో, ఈ అధ్యయనం చాలా ముఖ్యమైన విషయాలను బయటపెడుతోంది. 82% మంది ఫాలోవర్స్ ఫిన్‌ఫ్లూయెన్సర్ల సలహాపై చర్య తీసుకున్నారని చెబుతున్నారు. వీరిలో 72% మంది ఆర్థిక లాభాలు పొందినట్లు చెప్పారు. అయితే, 40 సంవత్సరాల పైబడి ఉన్న పెట్టుబడిదారుల్లో 14% మంది తప్పుదారి పట్టినట్లు లేదా మోసపోయినట్లు ఒప్పుకున్నట్లు ఈ అధ్యయనం తెలియజేస్తోంది, ఇది ఎక్కువ నిఘా నియంత్రణ అవసరాన్ని సూచిస్తుంది. ఆరతి పోర్వాల్, సిఎఫ్ఏ ఇనిస్టిట్యూట్ ఇండియా అధ్యక్షురాలు, మాట్లాడుతూ, భారతదేశపు ఫిన్‌ఫ్లూయెన్సర్ వ్యవస్థ ఆర్థిక అవగాహనను విస్తృతమైన ప్రజలవరకు తీసుకెళ్లడంలో గొప్ప అవకాశాలను కలిగి ఉంది. పెట్టుబడిదారులు సెబీ-నమోదిత నిపుణుల వద్ద నుండే సలహా తీసుకోవాలని, ఫాలో అవుతున్న ప్రభావశీలుల అర్హతలను పరిశీలించాలని మా సిఫార్సు. ఈ నివేదిక చిన్న తరహా పెట్టుబడిదారుల ప్రవర్తనను వివిధ కోణాల్లో విశ్లేషించింది. 21%-%25 ఏళ్ల వయసు గల యువ పెట్టుబడిదారులు తరచుగా అసరైన పెట్టుబడులు పెడతారు, అయితే వృద్ధులైన వారు ప్రతి నెలా క్రమంగా పెట్టుబడులు పెడతారని చెప్పబడింది. యువత తక్కువ బ్రోకరేజ్ ఉన్న ప్లాట్‌ఫారాలపై ఆసక్తి చూపిస్తే, వృద్ధులు పూర్తి సేవల బ్రోకరేజీ, వ్యక్తిగత మార్గదర్శనాన్ని నమ్ముతారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం బంజారాహిల్స్ డివిజన్ ఎమ్మెల్యే కాలనీలో రూ.1.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఫ్లాట్ నెం.160/ఏ నుండి ఒమెగా హాస్పిటల్ వరకు రూ.1.21 కోట్ల వ్యయంతో మురుగు నీటి పైప్ లైన్‌ను పున:నిర్మాణం, రూ.22 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ గల జీహెచ్ఎంసీ పార్కు నుండి ఎమ్మెల్యే కాలనీ రోడ్ 12 వరకు మురుగు నీటి లీకేజీ, ఓవర్ ఫ్లో నివారణకు ప్రధాన సీవరేజ్ పైప్ లైన్ ఏర్పాటుకు, రూ.28 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ ఫ్లాట్ నెం 11 బి నుండి 2బి వరకు మురుగు నీరు నిల్వకుండా సీవరేజ్ స్థానంలో 300 ఎం.ఎం ఆర్.సి.సి ఎస్.పి.ఎస్ శివరేజ్ లైన్ వేయుటకు మేయర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మురునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మురునీటి నిల్వలు, ఓవర్ ఫ్లో, లీకేజీల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన మురుగునీటి వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీ.ఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు, జీహెచ్ఎంసీ ఈఈ విజయ్ కుమార్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవా లని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజురైన చెక్కులను బాధితులకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60,000ల సీఎం సహాయనిధిని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి బాచుపల్లి, కొంపల్లి మున్సిపాలిటీ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 132, 131, 128, 127 డివిజన్లలోని చెందిన వాసులు వెంకటేష్ గౌడ్, ఆవుల సత్తిరెడ్డి, అనిరుద్ లాల్, ఆవుల శోభ, శారదా, గోపాలరావు, ఊరడి రాములు, అన్నపూర్ణ, కులకర్ణి ప్రవీణకి రూ.60,000, రుషిరాజ్‌కి రూ. 39,000ల మంజూరి పత్రాలను అందజేశారు. అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందన్నారు. డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్‌కుమార్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ వీరేందర్ రెడ్డి, బేకు శ్రీనివాస్, కందాడి సుదర్శన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కోలన్ జీవన్ రెడ్డి, ప్రసన్న కుమార్, జెస్సి పాల్, రాజిరెడ్డి, టేకుల ప్రవీణ్ రెడ్డి, వెంకటేష్, గోపాల్‌రావు, కాయుమ్ పషా, తిరుపతి, మోహన్ పాల్గొన్నారు.

42 శాతం బిసి రిజర్వేషన్‌ల చట్టబద్ధతకు సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : స్థానిక సంస్థలలో 42 శాతం బిసి రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఓబీసీ లాయర్స్ జెఏసి మద్దతు తెలుపుతుందనీ ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మన్ తలకొక్కుల రాజు, కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్‌లు అన్నారు. ఈ బిల్లును శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించిన అందుకు సహకరిం చిన అన్ని రాజకీయ పక్షాలకు అభినందనలు తెలిపారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ న్యాయపరంగా అన్ని లోయర్ కోర్టు నుంచి హైకోర్టు వరకు ఉన్నటువంటి ఏజీపీ, జీపి అన్ని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాష్ట్ర ప్రభుత్వం నియమించే నియామకాలలో 42 శాతం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తక్షణమే కేంద్రంలో ఉన్నటు వంటి ప్రభుత్వం పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ చేసి ఈ చట్టానికి ఉన్న అవరోధాలను తొలగించా లని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 31న అన్ని సంఘాలతో ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసి, ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కన్వీనర్ కోల జనార్ధన్, పొన్నం దేవరాజు గౌడ్, పూస మల్లేశం, టి.రాహుల్ వంశీకృష్ణ, లాయర్స్ జాక్ కన్వీనర్స్, కొండూరి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో టెన్త్ పరీక్షలు

విశాలాంధ్ర - ఆమనగల్లు : పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎవరైనా మాస్ కాపీ యింగ్‌కు పాల్పడిన, ప్రోత్స హించిన కఠిన చర్యలు తీసుకుం టామని జిల్లా విద్యాధికారి సుసింధర్‌రావు హెచ్చరించారు. శనివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల పది పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం నిర్వహించిన ఈ పరీక్షల్లో 2 సెంటర్లు ఏర్పాటు చేయగా 537 మంది విద్యార్థులకు గాను, 537 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ పాండు తెలిపారు. మాడుగుల మండల కేంద్రంలోని పదవ తరగతిపరీక్షా కేంద్రాలను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి శశిధర్‌రావు, తహసిల్దార్ సాగర్‌లు ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

బెట్టింగ్ యాప్‌లు, డ్రగ్స్ నియంత్రణపై శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆన్‌లైన్ గేమ్స్‌ను అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకుని అమాయక జనాన్ని కాపాడాలని, డ్రగ్స్ నియంత్రణకు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు మైనపల్లి హన్మంతరావు అల్వాల్ ఏసిపి మహేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆన్లైన్ గేమ్స్ ఆడి యువత, విద్యార్థులుడబ్బులు పోగొట్టుకుని ఇబ్బందులకు గురవుతున్నారని, అంతేకాక డ్రగ్స్ నియంత్రణకు కూడ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత డ్రగ్స్‌కు బానిసలవుతూ, ఐపీఎల్ బెట్టింగ్ ఫోన్ యాప్స్ ఆకర్షితులవుతూ వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, యువత, విద్యార్థుల భవిష్యత్తు పాడవకుండా కాపాడాలని ఆయన ఏసిపిని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐతోపాటు నాయకులు నాయకులు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఎస్.ఆర్.ప్రసాద్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, వినోద్ యాదవ్, నాగరా, ధర్మేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సంపత్ గౌడ్, కపిల్, యాది, సిరిగిరి రాజు, యూసీఫ్, ఆశా, బాలరాజు యాదవ్, శ్రీకాంత్ ముదిరాజ్, ఇస్త్రారి, ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజనతో సమాఖ్యవాదానికి తూట్లు

- భిన్నత్వంలో ఏకత్వమే భారత్‌కు బలం
- జేఏసీ సమావేశంలో వినయ్ విశ్వం

చెన్నై: భిన్నత్వంలో ఏకత్వమే భారత్‌కు బలమని, పునర్విభజన జరిగితే సమాఖ్యవాదానికి తూట్లు పొడవడమే అవుతుందని సీపీఐ కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. ఆయన శనివారం చెన్నైలో జరిగిన డీలిమిటేషన్ జేఏసీ సమావేశంలో మాట్లాడుతూ తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్వర్యంలో చారిత్రక సమావేశం జరుగుతుందని అభినందించారు. 'మనం కేవలం మన రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించడం లేదు. యావత్ దేశం కోసం మాట్లాడటం కోసం ఇక్కడ సమావేశం అయ్యాం' అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో బీజేపీకి పాత్ర లేదు కాబట్టే భారతీయత ... దేశ ఐక్యతను అర్థం చేసుకోలేదని విమర్శించారు. జనగణన ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే దక్షిణ రాష్ట్రాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుందని, ఉత్తరాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెరుగుతుందని వినయ్ విశ్వం నొక్కి చెప్పారు. కేరళను పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్ర జనాభా దేశ జనాభాలో 2.8 శాతమే, భూభాగాన్ని పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రానికున్నది 1.2శాతం కాగా భారత జీడీపీకి అందించే సహకారం 4.1 శాతమని తెలిపారు. విద్య, వైద్యం, సామాజిక భద్రతలో కేరళ నంబర్ వన్‌గా ఉందని, ఇది రాష్ట్ర ప్రజల దశాబ్దాల పోరాటాల ఫలితమన్నారు. తమిళనాడు కూడా అంతేనని, పెరియార్, బసన్న నాటి నుంచి సాగిన పోరుతో తమిళ రాష్ట్రం నేడు ఈ స్థాయికి చేరుకోగలిందని వినయ్ విశ్వం అన్నారు. ఆరోగ్యం, విద్య, అభివృద్ధిలో ఐదారు ర్యాంకులు వెనక్కి వెళితే తప్ప నిధులు రావని బీజేపీ నాయకుడు ఒకరు చెప్పడాన్ని బట్టి ఆ పార్టీ ఆలోచన ధోరణి, విధానం అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. జనాభా నియంత్రణ కోసం కుటుంబ నియంత్రణ విధానాన్ని దక్షిణాది రాష్ట్రాలు అనుసరించాయని, కాబట్టి ఇప్పుడు ఈ పరిస్థితి ఎదురైందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీకి గణనీయమైన తోడ్పాటు అందిస్తున్నప్పటి రాజకీయ ప్రాతినిధ్యానికి ముప్పు ఏర్పడిందని వినయ్ విశ్వం తెలిపారు. ప్రస్తుతానికి ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు లోక్‌సభలో 32శాతం అంటే 174 మంది సభ్యులు (543 స్థానాల నుంచి) ఉన్నారని, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు 24 శాతం అంటే 129 మంది ఎంపీలు ఉన్నారని గుర్తుచేశారు. మొత్తం సీట్లను 543గా ఖరారు చేస్తే ఉత్తరాది రాష్ట్రాలకు గణనీయంగా లబ్ధి చేకూరుతుందని, ఆ రాష్ట్రాలకు 205 స్థానాలు దక్కుతాయని, దక్షిణాది రాష్ట్రాలు 103 స్థానాలకు పరిమితమవుతాయని ఆయన తెలిపారు. ఒకవేళ లోక్‌సభ సామర్థ్యాన్ని 888కు పెంచితే ఉత్తరాది రాష్ట్రాలకు 39 శాతం అంటే 324 సీట్లు, దక్షిణాది రాష్ట్రాలకు 19శాతం అంటే 164 స్థానాలు ఉంటాయన్నారు. 2026 తర్వాత డీలిమిటేషన్ చేపట్టడానికి దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి చాలా కారణాలు ఉన్నాయన్నారు. పునర్విభజనలో అన్ని ప్రాంతాలకు సమాన హోదా, గౌరవం ఉండాలని... ప్రజాస్వామ్యం, న్యాయ సిద్ధాంతాలకు కట్టుబడి ఈ ప్రక్రియ జరగాలని వినయ్ విశ్వం నొక్కిచెప్పారు.

ఫరూఖ్‌ను పరామర్శించిన చంద్రబాబు, రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- నంద్యాల: రాష్ట్ర న్యాయ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ సతీమణి షెహనాజ్ ఆకస్మికంగా మృతి చెందారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం హైదరాబాద్‌లోని ఫరూక్ నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో మీ వెంటే మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యేలు, నేతలు కూడా ఫరూఖ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రామకృష్ణ సంతాపం

మంత్రి ఫరూక్ సతీమణి మృతి పట్ల సంతాపం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంతాపం ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లో ఫరూక్‌ను ఆయన నివాసంలో కలిసి రామకృష్ణ పరామర్శించారు. ఫరూక్ భార్య మరణం పట్ల సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఫరూక్‌కు ధైర్యం చెప్పారు.

వృత్తికి వన్నె తెచ్చిన సుబ్బయ్య

సన్మాన సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: తాను ఎంచుకున్న వృత్తికి వన్నెతెచ్చి అనేకమందికి స్ఫూర్తిగా నిలిచారని విశాలాంధ్ర సీనియర్ సబ్ ఎడిటర్ టీవీ సుబ్బయ్యను వక్తలు కొనియాడారు. విశాలాంధ్ర జాతీయ దినపత్రికలో సీనియర్ సబ్ ఎడిటర్‌గా పనిచేస్తూ 50వ వసంతంలోకి అడుగిడిన శుభ సందర్భంగా శనివారం విశాలాంధ్ర కార్యాలయంలో సంస్థ కార్యనిర్వాహక ఎడిటర్ కూన అజయ్‌బాబు అధ్యక్షతన సుబ్బయ్యను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ వృత్తి పట్ల నిబద్ధతో పనిచేయడంలో ఉన్న ఆనందం మరెక్కడా దొరకదన్నారు. ఒకే సంస్థలో సుదర్ఘీకాలం పాటు పనిచేయడం చాలా అరుదైన విషయమని, విధి నిర్వహణలో వివిధ సమస్యలు తలెత్తినా వాటిని అధిగమించి పని చేయడంలో సుబ్బయ్య సఫలం అయ్యారని అన్నారు. టెక్నాలజీ అందుబాటులో లేని రోజుల్లో ఆయన వివిధ అంశాలపై పట్టు సాధించడం గొప్ప విషయమన్నారు. విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పుట్టా హరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విలువలు సన్నగిల్లుతున్న నేటి ఆధునిక యుగంలో సుబ్బయ్య స్ఫూర్తిదాయకమని కొనియడారు. సమాజానికి కొంతమేరకు సమాచారాన్ని అందించాలని ఎంచుకున్న అంశంపై దృష్టి సారిస్తూ వివిధ పుస్తకాలు రచించడంలో ప్రత్యేకతను చాటుకున్నారని పేర్కొన్నారు. సుబ్బయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరు ఆ దిశగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్, హరనాథ్‌రెడ్డి, అజయ్‌బాబు, న్యూస్ ఎడిటర్ మురళీ కృష్ణ, సుబ్బయ్యను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం సంస్థలో తాను పని చేసిన సుదీర్ఘ అనుభవాలను తోటి ఉద్యోగులతో పంచుకున్నారు. విశాలాంధ్ర స్టేట్ బ్యూరో ఇంచార్జి చావా రవి, ఎంప్లాయిస్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ. సురేష్‌బాబు, సబ్‌ఎడిటర్స్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతంతోనే ప్రజాస్వామ్య రక్షణ

- నేటి నుంచి మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై రాజకీయ ప్రచారం
- ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సీపీఐ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. అందుకు ప్రతి కార్యకర్త అకుంఠిత దీక్షతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ గుంటూరు జిల్లా సమితి సభ్యుల సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో శనివారం జరిగింది. ముఖ్య అతిథి ముప్పాళ్ల మాట్లాడుతూ నరేంద్ర మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా... కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ... రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి ఈ నెల 23 నుంచి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు రాజకీయ ప్రచార కార్యక్రమాలను సీపీఐ అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో జీపుల ద్వారా, సభలు, సమావేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేపట్టి మోదీ ప్రభుత్వ విధానాలను పెద్ద ఎత్తున ఎండగట్టాలని సూచించారు. మోదీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సామాన్య ప్రజలను భ్రమలలో ఉంచి గుత్త కోటీశ్వరులకు ఊడిగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ట్రంప్ తనకు మిత్రుడంటూ గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ... ఫెడరల్ విద్యా వ్యవస్థను రద్దు చేసిన ఏకైక ప్రధానిగా నిలిచిన ట్రంప్ గురించి మీ స్పందన ఏమిటంటూ ప్రశ్నించారు. వీసా లేకుండా అమెరికాలో ఉంటున్న భారతీయుల కాళ్లకు, చేతులకు బేడీలు వేసి విమానం ఎక్కిస్తుంటే కనీసం నిరసన కూడా వ్యక్తం చేయలేని అసమర్థ ప్రభుత్వం నేడు కేంద్రంలో ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ అధికారంలోకి రాకముందు డాలర్ విలువ రూ.66 ఉండేదని, ఈ 11 సంవత్సరాల కాలంలో దాని విలువ రూ.88కు చేరిందని, రూపాయి విలువ దారుణంగా పడిపోతుంటే మోదీ గొప్ప ప్రధాని ఎలా అవుతారని ప్రశ్నించారు. మోదీ కంటే ముందు దేశాన్ని పరిపాలించిన ప్రధానులందరూ కలిసి రూ.100 లక్షల కోట్లు అప్పు చేస్తే ఒక్క మోదీ హయాంలోనే ఆ అప్పు దాదాపు రూ.200 లక్షల కోట్లకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతున్నా మోదీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుకు కట్టబెడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని మండిపడ్డారు. ఈ విధానాలతో మోదీనే సర్వస్వంగా భావించే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని, ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా సీపీఐని నిలపాలని పిలుపునిచ్చారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అర్హులయిన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల సాధన కోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిరసన దీక్షలు చేయడానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

29న తాడి ప్రకాశ్‌కు పతంజలి పురస్కారం



విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ పాత్రికేయుడు, సినీ మాటల రచయిత స్వర్గీయ కె.ఎన్.వై.పతంజలి 73వ జయంతిని పురస్కరించుకుని, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత తాడి ప్రకాశ్‌కు ఈ నెల 29న విజయనగరం గురజాడ గ్రంథాలయంలో 'పతంజలి' పురస్కారం అందచేయనున్నట్టు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఓ ప్రకటనలో తెలిపారు. గురజాడ అప్పారావు గృహంలో వేదిక ప్రతినిధులతో కలసి మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది పతంజలి జయంతి సందర్భంగా ప్రముఖులకు పురస్కారం అందచేస్తున్నామన్నారు. కార్టూనిస్ట్ మోహన్, దేవిప్రియ, శరత్‌చంద్ర, చింతికింద శ్రీనివాసరావు, జి.ఆర్.మహర్షి, పప్పు అరుణ, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, సువర్ణముఖి వంటి ప్రముఖులకు పురస్కారాలు అందజేసినట్టు వివరించారు. పురస్కార కమిటీ సభ్యులు వి.ఎమ్.కె.లక్ష్మణరావు, బండ్లమూడి నాగేంద్ర ప్రసాద్, ఎస్.కె.బాబు తో కూడిన బృందం 2025 సంవత్సరానికి ప్రకాశ్ పేరును ప్రతిపాదించినట్టు భీశెట్టి తెలిపారు. వేదిక కార్యదర్శి ఎస్. కె.బాబు, వి.ఎమ్.కె.లక్ష్మణరావు, బి.నాగేంద్ర ప్రసాద్, పౌర వేదిక ప్రతినిధులు తుమ్మగంటి రామ్మోహన్, ఇప్పలవలస గోపి, జలంత్రి రామచంద్ర రాజు పాల్గొన్నారు.

జైలు నుంచి పోసాని విడుదల

షరతులతో బెయిల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, సినీ నటుడు పోసాని కృష్ణమురళి ఎట్టకేలకు శనివారం విడుదలయ్యారు. పోసాని కృష్ణమురళికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి జి.స్పందన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గుంటూరు జిల్లా జైలు నుంచి అధికారులు పోసానిని విడుదల చేశారు. సీఎం చంద్రబాబు ఫొటోలను మార్ఫింగ్ చేసి, ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కూడా దుర్భాషలాడుతూ పోసాని గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై సీఐడీ పోలీసులు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కర్నూలు జైలు నుంచి పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి గుంటూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అప్పటి నుంచి ఇక్కడి జిల్లా జైల్లో ఉన్న పోసాని పిటిషన్ దాఖలు చేయడంతో జడ్జి బెయిల్ మంజూరు చేశారు. రూ.2 లక్షల విలువతో ఇద్దరు వ్యక్తులు జామీను ఇవ్వాలని, జైలు నుంచి విడుదలైన అనంతరం దేశం విడిచి వెళ్లరాదని, కేసు గురించి ఎక్కడా ప్రకటనలు చేయరాదని షరతులు విధించారు. నాలుగు వారాలపాటు ప్రతి మంగళ, గురువారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు మంగళగిరిలోని సీఐడీ పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని తెలిపారు. సాక్షులపై ఎలాంటి ప్రభావం చూపరాదని, కేసు దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించారు.

విపత్తుల నిర్వహణలో ఆధునిక సాంకేతికత అవశ్యం

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విపత్తుల నిర్వహణలో అత్యాధునిక సాంకేతిక పరికరాలు అత్యవసరమని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి , ఆంధ్ర ప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ ఆర్.పి. సిసోడియా పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో ఎమ్మార్వో స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి అధికారికి శాటిలైట్ ఫోన్లు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తద్వారా విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణనష్టం నివారించవచ్చని చెప్పారు. విపత్తుల నిర్వహణ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ఐదేళ్లలో కొనుగోలు చేసిన పరికరాల వినియోగ స్థితి, రాబోయే వర్షాకాలానికి అవసరమైన సన్నద్ధత, బడ్జెట్, తీవ్ర ఉష్ణప్రవాహాల (హీట్ వేవ్స్) కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై , జిల్లాల స్థాయిలో మానవ వనరులు, పరికరాల అందుబాటు పరిస్థితులను అంచనా వేసి, తుపానుల హెచ్చరిక కేంద్రాల పనితీరును సమీక్షించారు. హానికర, రసాయన కర్మాగారాల సమీపంలో గాలి నాణ్యత పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాయు కాలుష్యం లేదా రసాయన గ్యాస్ లీకేజీ వంటి ప్రమాదాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలానికి ముందుగా జీఐఎస్ ప్లాట్‌ఫాంను సిద్ధం చేయడంతో పాటు, ఐఓటీ పరికరాలను వినియోగించి ఆన్‌లైన్ డేటా తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విపత్తుల నిర్వహణలో డ్రోన్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అవసరమైన డ్రోన్ పైలెట్లను సిద్ధంగా ఉంచాలని , నైట్ విజన్ డ్రోన్ల ప్రాముఖ్యతను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కుర్మనాథ్... నిర్వహణ విధానాలను బలోపేతం చేసే దిశగా సూచనలు చేశారు.

మూడున్నర లక్షల కోట్లపై శ్వేతపత్రం

దేగా ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర- అమలాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడున్నర లక్షల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం చెల్లించిందని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించారని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న దేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం... రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇచ్చి ఉంటే వెంటనే బహిర్గతం చేయాలన్నారు. ఆ నిధులను పోలవరం ప్రాజెక్టుకు, అమరావతి రాజధాని నిర్మాణానికి ఎంత మేర కేటాయించారు, ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారా లేదా అప్పుగా ఇచ్చారా వెల్లడించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వం 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే... తాము పేదలకు మూడు సెంట్లు, నాలుగు లక్షలు ఇస్తామన్న హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం నుంచి ఇంతవరకు స్పందన లేదని విమర్శించారు. పేదలకు యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల స్థలాలు ఇచ్చి... ఇంటిని నిర్మించుకునేందుకు నిధులు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రి మూడున్నర లక్షల కోట్లు ఇచ్చామని చెబుతుంటే... రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడటం సిగ్గు చేటు అని అన్నారు. దేశ సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని విమర్శించారు. గోదావరి జిల్లాలో ఇళ్ల స్థలాలు, గృహ రుణాల కోసం సీపీఐ పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేదలు ఇళ్ల స్థలాల కోసం అన్ని జిల్లాల్లో పర్యటించి, పేదలు అందజేసిన దరఖాస్తులతో కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, రామకృష్ణ, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, ఒకటాల వెంకటేష్, మోకా శ్రీనివాసరావు, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నూతన అక్రిడిటేషన్ పాలసీని ప్రకటించాలని కోరుతూ

7న కలెక్టర్లకు వినతులు

- ఒంగోలులో రాష్ట్ర మహాసభలు
- ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జర్నలిస్టుల అక్రిడిటేషన్ నూతన విధానాన్ని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడ గాంధీనగర్ లోని ప్రెస్ క్లబ్‌లో యూనియన్ అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన శనివారం జరిగిన కార్యవర్గం... జర్నలిస్టుల సమస్యలపై చర్చించింది. ముఖ్యంగా అక్రిడిటేషన్ మంజూరు విషయంలో జరుగుతున్న జాప్యంపై కార్యవర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వివిధ జిల్లాల ప్రతినిధులు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల పాటు జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయలేదని, చివరికి అడ్డగోలు నిబంధనలతో జీవో జారీ చేసి...అర్హులైన సగం మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ నిరాకరించారని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవోని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ అక్రిడిటేషన్ మంజూరయ్యేలా నూతన విధానాన్ని రూపొందించాలని వారు కోరారు. వెంటనే నూతన అక్రిడిటేషన్ విధానాన్ని ప్రకటించాలని కోరుతూ ఏప్రిల్ 7 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని కార్యవర్గం జిల్లా శాఖలకు పిలుపు ఇచ్చింది. శాసనసభ సమావేశాల కవరేజీకి కొన్ని మీడియా సంస్థల ప్రతినిధులకు అవకాశం ఇవ్వకపోవడం సమంజసం కాదని, అన్ని సంస్థలకు కార్డులు ఇవ్వాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. శాసనసభలో మీడియా సలహా కమిటీ కూడా తక్షణమే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ చివరివారంలో ఒంగోలులో నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. అధ్యక్షత వహించిన ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ అక్రిడిటేషన్ గడువులు తరచూ పొడిగింపుల వల్ల వందలాదిమంది కొత్త జర్నలిస్టులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎన్నికలకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ఎన్నికల అధికారి డి. సోమసుందర్ కార్యవర్గానికి నివేదించారు. ఇటీవల క్యూబా రాజధాని హవానా లోని హవానా యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ మీడియా సెమినార్ ఆహ్వానం మేరకు మన దేశ జర్నలిస్టుల తరుపున హాజరైన ఐజేయు అధ్యక్షులు కే శ్రీనివాసరెడ్డిని అభినందిస్తూ సమావేశం తీర్మానం ఆమోదించింది. యూనియన్ రాష్ట్ర మహాసభల్లోనే అనుబంధ సంఘాల ఎన్నికలు కూడా పూర్తి చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, జాతీయ కార్యవర్గసభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, డాక్టర్ ఎం. ప్రసాద్ , ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కే జయరాజ్, కార్యదర్శి డి.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే కృష్ణా అర్బన్ జిల్లా అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, యూనియన్ సీనియర్ నాయకులు ఎస్.కే. బాబు తదితరులు మాట్లాడారు.

మోదీని గద్దె దించుదాం: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న నరేంద్ర మోదీని గద్దె దించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ దేశానికి ప్రధాని మోదీతో పొంచి ఉన్న ప్రమాదాన్ని... భారతదేశ లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలకు, భారత రాజ్యాంగానికి ఏర్పడబోయే ప్రమాదాన్ని గుర్తించిన సీపీఐ జాతీయ సమితి ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వరకు ప్రచార కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు వివరించారు. అధికారంలోకి రాకముందు ఇంటికొక ఉద్యోగం ఇస్తామని, వంద రోజులలో ధరలు తగ్గిస్తామని, విదేశాలలో ఉన్న నల్లధనాన్ని తీసుకువచ్చి దేశ సౌభాగ్యం కోసం ఉపయోగిస్తామని నమ్మబలికిన మోదీ... అధికారం చేపట్టి 11 సంవత్సరాలు గడిచిన ఏ ఒక్క హామిని అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ బారి నుంచి దేశాన్ని రక్షించుకోవడానికి సీపీఐ చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రసూతి మరణాలు తగ్గుముఖం: మంత్రి సత్యకుమార్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రసూతి మరణాలను తగ్గించటంలో గణనీయమైన ప్రగతి సాధించగలిగామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మహిళలకు సురక్షితమైన మాతృత్వంతో పాటు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించడంలో ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. కేంద్రం అమలు చేస్తున్న జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన, జననీ శిశు సురక్షా, సురక్షిత మాతృత్వ ఆశ్వాసన్, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ వంటి పథకాలు సమగ్ర ప్రసూతి నిర్వహణ, మాతా శిశు సంరక్షణను నిర్ధారిస్తున్నాయని వివరించారు. సురక్షిత ప్రసవాలకు ప్రసూతి విభాగాలను బలోపేతం చేశారన్నారు. మాతా, శిశు ప్రాణాలను కాపాడేందుకు మధ్యప్రదేశ్‌లో దస్తక్ అభియాన్, తమిళనాడులో అత్యవసర ప్రసూతి సంరక్షణ వంటి వినూత్న ఆవిష్కరణలు అమలులో ఉన్నాయని తెలిపారు. ప్రధాని మోదీ దార్శనిక పాలనలో భారతదేశం 2030 నాటికి ప్రసూతి మరణాల రేటును 70 కన్నా తక్కువ స్థాయికి తేవాలన్న లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తోందన్నారు. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.